ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక




కవికోకిల

9-3-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


వార్తాచిత్రాలు




హింమా కోడు బిల్లుకు ప్రతికూలముగ ఢిల్లీలో గత ఆదివారం జరిగిన సభలో శ్రీమతి రాజే ఉపన్యసిస్తున్న దృశ్యం



తవారం ఢిల్లీలో జరిగిన విద్యుచ్ఛక్తి ఇంజనీర్ల సభకు హాజరైనవారికి మంత్రి గాడ్గిల్ విందు వేసిన సందర్భంలో తీసిన ఛాయాచిత్రం గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి, బొంబాయిప్రభుత్వ విద్యుచ్ఛక్తి సలహాదారు పి అద్వానీ, ఆర్ ఆర్ దివాకర్ గార్లు.




జయపూర్‌లో గవర్నర్ జనరల్ శ్రీ రాజగోపాలాచారి కాందిశీక పురమునకు శంకుస్థాపన జరిపిరి పట్టణప్లానును శ్రీ రాజగోపాలాచారి పరిశీలిస్తున్నారు




ఏలూరులో శ్రీ నక్కాచ్చిన వెంకయ్యగారు స్థాపించిన శ్రీ వేముల కూర్మయ్య హరిజనబాలుర వసతిగృహమును గౌ. వేముల కూర్మయ్యగారు సందర్శించిన సందర్భములో తయబడిన ఛాయాచిత్రము


ఇటీవల గృహవైద్యంగురించి విచారణ జరిపేందుకు మద్రాసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వ ఉపసంఘం గుడివాడలోని హోమియోపతి చికిత్సాలయాన్ని సందర్శించినపుడు తీసిన చిత్రం కల్నల్ కె వి రమణరావు ఐ యం యస్. యం గురురాజ (ఆంధ్ర హోమియోపతి కళాశాల ప్రిన్సిపాలు) డాక్టర్ పి. యస్. భోప్రా.



ఢిల్లీ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో అధ్యక్షత వహించిన రాజాజీ, ప్రప్రథమురాలుగా వచ్చిన మిస్ మంజూఫీర్ (ఇంద్రప్రస్థ కళాశాల) డిగ్రీని స్తున్న దృశ్యం.



ప గోదావరిజిల్లా నాన్‌గజిటెడ్ ఆఫీసర్ల వార్షికసభ జరిగిన సందర్భంలో ప గోదావరి జడ్జి సి ‑త్యనారాయణచౌదరిగారు పతాకోత్సవం జరిపినప్పటి దృశ్యం



ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్ (మహాభారతము)

సంపుటము 41

సంచిక 25

Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర ఫాల్గున శుద్ధ నవమి బుధవారము



కీ॥ శే॥ శ్రీమతి సరోజిని

(గవర్నరు హోదాలో శ్రీమతి సరోజినీ దేవి)



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ మార్చినెల 9-వ తేదీ బుధవారము

శ్రీమతి సరోజినీదేవి

గత మాసముననే శ్రీ సరోజినిదేవి 70వ జన్మదినోత్సవము జరిగినది. అది జరిగిన పక్షము రోజులకు ఆమె ఇహలోకము వదలిపోయినది ఆమె మరణముతో భారతరంగమునుండి ఒక అపరూపవ్యక్తి తిరోహితమైనదని చెప్పవచ్చును భారతప్రధాని పండిత నెహ్రూ అధినివేశశాసనసభయందు తెలిపినట్లు ఆమెవంటి వ్యక్తిని తిరిగి చూడబోము ఆమెకు ఆమెయే సాటి

శ్రీ సరోజినీదేవి మిరుమిట్లుగొలుపు వ్యక్తి చిన్నతనమువందే తన మేధాసంపత్తిచే అందరిని చకితులను చేసినది వర్ణేతరవివాహ మాడి, తన స్వతంత్రభావముచే విభ్రాంతులను చేసినది. ఒక రచయిత చెప్పినట్లు ఆమె మనస్సు అతిపిన్నవయస్సునందే పరిపక్వమునొందినది అందువల్లనే, ఆమెకు వర్ణభేదముగాని వర్గభేదముగాని పట్టింపుకు రాలేదు బహుశః ఆమెకు వివిధ రాజకీయ వర్గములందున్న మిత్రులు మరెవరికిని లేరు. ఒక వంక పూర్వదృక్పథము గల మహారాజులు, మరొకవంక అతి తీవ్రవాదులైన సామ్యవాదులు ఆమెకడ్డకు వెళ్లి సలహాలను పొందుచుండెడివారు ఉభయవర్గములు, ఆత్మీయతను అనుభవించుచుండెడివారు ఆమె సమక్షమున ఆహ్లాదమును పొందని వ్యక్తి యుండజాలదు ఆర్థికమంత్రి గోపాలరెడ్డిగారు చెప్పినట్లు రాజకీయములకు ఆమె సంస్కృతిని ఆపాదించినది గవర్నరు పదవి ఆమెకు ఉత్కృష్టత తెచ్చినదనుటకంటె ఆమెయే ఆ పదవికి మెరుగు పెట్టినది

ఆమె కవనము, ఆమె దేశభక్తికి వన్నె తెచ్చినది ఆమె గొప్ప కవయిత్రి అంతకన్న మిన్నగా దేశభక్తిపరాయణురాలని చెప్పవలెను ఉభయరంగములందు ఆమెపేరు చిరస్థాయిగ నుండగలదు మొదటినుండి చివరివరకు మహాత్మునిసన్నిహితఅనుచరవర్గములో నుండెను మహాత్ముని తన తండ్రివలె చూచెను ఆయనతోపాటు ప్రతిపర్యాయము కారాగారమునకు వెళ్లి పరిచర్యలు చేసెను ఆగాఖానుభవనమున ఆమె గాంధిజీజన్మదినోత్సవములను జరిపినరీతిని చదివినవారికి, కారాగారమునందు స్తంభించిన వాతావరణమునుకూడ చైతన్యయుతముగ నని బోధపడగలదు అన్నిటికన్న 1943వ సం॥లో ఆమె ఢిల్లీయందు పత్రికావిలేఖరుల సమావేశమునందు చేసిన ప్రసంగము చిరస్థాయిగ నుండగలదు. అప్పటికి గాంధిజీ, తదితరనాయకులు కారాగారములం దుండిరి శ్రీ రాజగోపాలాచారిగారు బయటనుండి కాంగ్రెసువిధానమును విమర్శించుచుండెను బ్రిటిష్ ప్రభుత్వము అతి నిరంకుశవిధానమును అవలంబించుచుండెను దేశము నిస్పృహాస్థితిలోనుండెను ఆ సమయమున అనారోగ్యకారణమున ప్రభుత్వము శ్రీ సరోజినీదేవిని విడుదల చేసెను ఆమెశరీరము బలహీనస్థితిలో నుండెను కాని, ఆమె దేశభక్తి, ఉత్సాహము ద్విగుణీకృతమై యుండెను గాంధిజీ అవలంబించిన విధానమును సమర్థించుచూ చేసిన ప్రసంగము జంఝామారుతమువలె దేశమును ఉత్సాహపూరితము చేసినది. ఆమెపట్ల భారత ప్రజలు ఎప్పుడూ కృతజ్ఞులై యుండుటకు ఆ ఒక్క చర్య చాలును భారత జాతీయచరిత్రలో పేరు చిర స్థాయిగ నుండును

భారతప్రభుత్వ బడ్జెటు

గతమాసాంతమున కేంద్ర ఆర్థిక మంత్రి డా॥ జాన్ మత్తాయిగారు భారతప్రభుత్వ బడ్జెటును సమర్పించిరి ఈ ప్రతిపాదనలను గమనించిన, పారిశ్రామికులకు కలుగజేసిన ప్రయోజనముల కన్న జనసామాన్యమునకు ఎక్కువ ప్రయోజనములు కలుగజేయలేదను విమర్శకే ఆస్కారమున్నది అంతేకాని పారిశ్రామికులకు పన్నుల భారము కొంత తగ్గించెనని నిందించవీలు లేదు రద్దు చేసినది పెట్టుబడిపన్ను మాత్రము Earned income పైని ఆదాయపుపన్ను, సూపర్ టాక్సు రూపాయికి 0-14-0 కంటె యుండకూడదనెను Un-earned income పైని రూపాయికి 0-15-6 గల సూపర్ టాక్సును 0-15-0 లకు తగ్గించెను. కేవలము పారిశ్రామికుల పైన పన్నులను విధించుటవల్ల సమస్యలు పరిష్కారము కావు బ్రిటిషు ఆర్థికమంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్సు కూడ యీ సత్యమును అంగీకరించి ఉద్ఘాటించెను దేశ అవసరములనుబట్టి సంఘముయెడల వారి కున్న ధర్మమునుబట్టి ఉత్పత్తి అధికము చేయవలసిన బాధ్యత వారియెడ నున్నది అయితే అందుకు తగిన వాతావరణమును కూడ సృష్టించవలసి యున్నది. ప్రస్తుతపన్నువిధానము పెట్టుబడికి అనుకూలముగ లేక పోవుటే గాక, ఆదాయము మిగులుటకు అవకాశమును కలుగజేయుట లేదు అంతే కాక, ఆదాయమును పెంచి నిలువచేయుటకు కూడ ప్రోత్సాహము నిచ్చుట లేదు. అట్టి సమయములో, వ్యాపారవిస్తరణకు, పెట్టుబడి ధారాళముగ వచ్చుటకు పారిశ్రామికులకు కొంత ఉపశమనము కలుగజేయుట అవసరము. కేవలము పన్నురూపేణ పైకము నంతనూ ప్రభుత్వ ఖజానాకు ప్రవహింపజేసిన ప్రయోజనము లేదు ప్రభుత్వము కనుక, నిర్మాణ కార్యక్రమములను, ఉత్పత్తి అధికము చేయు పథకములను తనకు తానై అమలు జరపుటకు ఉపక్రమించిన, పైకము నంతను తన బొక్కసములోనికి రప్పించుకొనిన అర్థమున్నది అది లేనపుడు దేశములో పైకమును ఉత్పత్తి అధికమవుటకు వినియోగింపబడునట్లు చూడవలెను డా॥ మత్తాయిగారి బడ్జెటు ప్రతిపాదనలు ఆ సంకల్పముతోనే నిర్మించబడినవి అదే విషయమును వారు బడ్జెటు విమర్శలకు సమాధానమిచ్చుచూ తెలిపిరి ఆయన చెప్పినట్లు ఆదాయపుపన్ను తగ్గింపు పారిశ్రామికులకు ఉత్పత్తి నధికము చేసి, తమ నిజాయితీని రుజువు చేసికొన వలసిన దను హెచ్చరికనే వ్యాఖ్యానించవలసి యున్నది పారిశ్రామికులు తమ నిజాయితీని నిరూపించెదరని ఆశించుచున్నాము లేనియెడల ప్రవర్తన గర్హణీయము కాక తప్పదు ఆదాయపుపన్ను ఎగవేయుటలో భారతవ్యాపారస్థు లిదివరకే అపఖ్యాతిని పొందిరి ఆ సందర్భమున సత్ప్రవర్తన చూపిన ఆదాయపన్నుతగ్గింపునకు ఇంత ప్రతికూల విమర్శన యుండెడిది కాదు.


పోస్టు కార్డు కవరు ధర పెంచుట విమర్శకు లోనైన అది సహజము దీనితోపాటు, మద్యసారము, ముతుకగుడ్డపైన పన్ను, పోకచెక్కలపైన పన్ను అధికము చేయుట ఆక్షేపణీయమవుచున్నది చేనేతబట్టమీద పన్ను విధింపకపోవుట సంతృప్తికరమైన సంగతి పోస్టుకార్డు 1946 సం॥ వరకు 0-0-9 పైసలున్నదనియు, అంతేకాక, తయారు చేయుటకు కార్డు ఒకటికి 8 6 పైసలు అగుచున్నదనీ డా॥ మత్తాయిగారు సమర్థించిరి అయితే కవరును 0-2-0 చేయుటను గురించి సంజాయిషీని వివరించలేదు. విమానటపాలో వేయుటకు అదనపు చార్జీ యుండదని చెప్పియుండిరికాని, విమానటపా ఎన్ని ప్రాంతములకున్నది! దానివల్ల ప్రయోజనమును పొందువారు ప్రస్తుతము పెద్ద పట్టణములందున్న వర్తకులు, తదితరులు తప్ప చిన్న పట్టణములందు పల్లెప్రాంతములందున్నవారికి ఏమాత్రము ఉపయోగకారి కాజాలదు ఉప్పుమీద పన్ను వేయుటకంటె బట్టమీద పన్ను వేయుట ఎక్కువ సమంజసమనీ, దామాషా గట్టి చూచిన అతకన్న తక్కువగ నున్నదనిరి అంతేకాక అవసరమునకు మించి ఎక్కువ వాడకుండ నిరోధించుటకుకూడ ఈ పన్ను తలపెట్టబడినదనిరి అవసరమును మించి ప్రజ బట్టను కొనుదురను భావమునకు ఆస్కారము లేదు. అదీ కాక బొంబాయి ప్రభుత్వము తమ బడ్జెటులో ఏర్పడిన లోటును భర్తీ చేసికొనుటకు, తమ రాష్ట్రమునుండి ఎగుమతి అవు మిల్లు బట్టపైని ఎగుమతిపన్నును విధింప సంకల్పించిరి ఈ రెండు పన్నులు చివరికి వినియోగదారులే భరింపవలసి యున్నది కదా? పోకచెక్కలపైని పన్ను ముఖ్యముగా దక్షిణదేశములో బాధాకరముగ నుండకమానదు భాగ్యవంతులే కాక దక్షిణదేశములో సామాన్యజనులందరూ పోకచెక్కలకు అలవాటుపడినవారు అందువలన ఆ ప్రాంతప్రజలు తీవ్రఅసంతృప్తిని పొందెదరు

డా॥ మత్తాయిగారు చెప్పినట్లు వారు ప్రతిపాదించిన బడ్జెటు ప్రత్యేక లక్షణములు మెరుపులు లేక సామాన్యముగనూ సనాతనముగనూ నున్నది. ఇతరలుకూడ అంతకుమించి చెప్పనవసరము లేదు.

ఆస్థాన కవీశ్వరులు

మద్రాసు ప్రభుత్వము బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారిని తెలుగు "ఆస్థానకవీశ్వరుల"నుగా గౌరవించినదన్న వార్త తెలుగువారందరికి సంతోషదాయకము కాగలదు

ప్రజాప్రభుత్వములో ఆస్థాన కవిసాంప్రదాయము, పూర్వపు సామ్రాజ్య పద్ధతుల ననుసరించుట యగునని, ఆస్థానకవుల నియామక మొనర్చు ఉద్దేశమును మద్రాసు ప్రభుత్వము ప్రకటించినపుడే, చాలామంది ఆక్షేపణలు వెలువరించిరి. కాని, ప్రజాప్రభుత్వమైనను, ఉత్తమ కవులను గౌరవించవలసిన విధాయకము కలదని విస్మరించరాదు. ఈ గౌరవ నిర్ణయము, రాజకీయ వ్యూహముగా పరిణమించి ఉండినచో, అట్టి నియామకము వలన, ఆస్థానము కూడ ప్రథమ స్థితిలోనే, అస్తవ్యస్తములకు ఆలవాలమై, ఆక్షేపణ చేసినవారి వాదముల కనుకూలత చేకూర్చి యుండెడిది.



'ఆస్థానకవిశేఖర'
బ్రహ్మశ్రీ శతావధాని

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు

తెలుగుకవిత్వ మంటేనూ, తెలుగంటేనూ తిరస్కారమే సర్వసామాన్యమయిన రోజుల్లో, దేశీయమైన పాండిత్యమంటే, సంస్కృతభట్టీయవిజ్ఞానమే అనుకొన్న దేశకాలాలలో, "గోచీపెట్టినదాది" కూనిరాగాలతో తెలుగుకవిత్వాన్ని ప్రారంభించి, దాదాపు ముప్పాతిక శతాబ్దంపాటు, తనతోపాటు తెలుగు సరస్వతిని ఉజ్జ్వలంగా యావదాంధ్రదేశంలో దిగ్విజయయాత్రలతో, ఏనుగుల నెక్కించి ఊరేగింపించి సరస్వతికి తెలుగునాట, తెలుగుమాట నేర్పి పునఃప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు

ప్రజాప్రభుత్వంలో, "ఆస్థానకవి" అన్న బిరుదు అపహాస్యాలపాలవకుండా, ఈయుగంలో కూడా ఆ బిరుదుకు, ప్రజాహృదయంలో గౌరవస్థానం ఏర్పరచగలిగేందుకు, ప్రప్రథమంగా తానే మద్రాసు ప్రభుత్వ ఆస్థానకవి స్థానాన్ని చేపట్టి, ముందుముందు రాగల మహాకవులకు ఈ "ఆస్థానకవులవగలగటం" అత్యాకర్షణీయమై అపేక్షణీయమైన గౌరవంగా అవగలిగేట్టు చేశాడు ఈ మహాకవి

దాదాపు ముప్పైసంవత్సరాలు పైబడ్డ వయస్సు గలిగి తెలుగు సారస్వతంలో అంతో ఇంతో అభిరుచి గలిగి ఉన్నవాళ్లకెవళ్లకూ ఈనాడు శాస్త్రిగారినిగూర్చి కొత్తగా ఎవళ్లూ చెప్పగలిగేది ఏమీ ఉండదేమో! గత ఇరవై ఏళ్ల ఈ మధ్య ముఖ్యమైన తెలుగుపత్రికలలో స్వీయచరిత్రవిశేషాలు పూర్వకవిత్వ వ్యాఖ్యానాలూ, పూర్వుల జీవితవిశేషాలూ పడుగు పేకలుగా అల్లుకుపోతూ, అతిరమణీయంగా సులభగ్రాహ్యంగా ఉండే వ్యాసాలు, అనేకం ఆయనవి వెలువడ్డాయి ఆ వ్యాసాలు వ్యావహారికభాషావివాదప్రసక్తికూడా ఆట్టే ఎత్తకుండా, వ్యవహారికభాషలో వ్యాసాలు ఎల్లా ఉండాలో వరవడిపెట్టి చూపించాయి

ఆ వ్యాసాలు కేవలం వ్యావహారికభాషకు వరవడిపెట్టిన తెలుగు వ్యాసాలు మాత్రమే కావు 19వ శతాబ్దాంతపు తెలుగునాడుస్వరూప మేదో తెలుగునాట సభ్యతాస్వరూప మెల్లా ఉండేదో, ఉత్తమవ్యక్తిత్వానికి తెలుగుజీవికి ఆదర్శాలెల్లాంటివో, అన్నీ విపులంగా చూపిస్తాయి అన్నిటికన్నా, ఏఒక్క ముఖ్యసూత్రాన్ని ఆనాటి, (ఆనాటికే కాదు - ఏనాటికీ!) మహాత్ములైనవాళ్లంతా ఆలంబనగా చేసుకొన్నారో, ఆ ఒక్క మహత్తరసూత్రాన్ని, "ఏనాడూ అసత్య మాడకూడదు," - అన్న సూత్రాన్ని ఈ మహాకవికూడా ఎల్లా జీవితాలంబనగా చేసుకొన్నాడో సుస్పష్టంగా తెల్పుతాయి

ఆరామద్రావిడుడు కోనసీమకడియం జన్మస్థానం అనుకొంటూ ("కంకణగ్రామమ్ము కాపురమ్ము" అన్న మాటనుబట్టి) చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు గురువు అంటే ఇతరులూ "ఓనామాలను చెప్పనొక్క గురుడింకొక్కండు" అన్నట్టి వాళ్లున్నారని ఆయనే చెప్పుకొన్నాడు సరస్వతికి స్థానం ఎక్కడెక్కడున్నదను కొన్నాడో అదెల్లా గురుపీఠము, శుశ్రూషార్హము చేసికొన్నాడు "తోలుబొమ్మల వాళ్లవద్దనుంచి "శ్రీరాగం" అలవర్చుకొన్నాను మరోచోట మరొకటి - పూర్వులు పోని పద్ధతులు లేవు ఘనులు పండితరాయాది కవులు పోవు త్రోవలం బట్టి పోదుము" అంటూ, ఎక్కడెక్కడ ఏది నేర్చుకోగల అవకాశ ముందో, అదెల్లా నేర్చుకొనేందుకు ప్రయత్నించాడు, సాధించాడు సహజకౌశలం అపారంగా తోడ్పడ్డది కవిత్వవ్యవసాయంలోనే, తర్కవ్యాకరణాదికమైన మహాపాండిత్యమంతా, అనుషంగికంగా, సాధించాడు కవితావ్యాసంగానికి దేశాటనం ఉపాధిగా చేసుకోవటంలో అపారమైన లౌకికజ్ఞానం, అశేషానుభవం లభించాయి వాక్చమత్కృతి జన్మసిద్ధమైన గుణం ఇక దిగ్విజయానికి ఎక్కడా అడ్డే లేకపోయింది కాని ఈ దిగ్విజయయాత్రలే, ఆయనకవితాజీవితంలో ఎక్కువ కలహాలని కూర్చిపెట్టాయి కాని ఆ కలహాలలోనే ఆ వ్యక్తిలోని సౌజన్యం నిగూఢంగా ప్రకాశిస్తూ ఉంటుంది కలహమైనా కవితావ్యాసంగం, సభ్యతాప్రమాణంలో జరిగిందంటే ఆయన ఉత్సాహ సంతోషాలు చెప్పనక్కరలేదు తాత్కాలికంగా స్పర్ధ కల్గినా, సహృదయులపట్ల ఆ హృదయం ఎంత ఆర్ద్రమైనదో, ఆయన వ్రాసిన వ్యాసాల్లోని ఒక చిన్నఘట్టం ఉటంకిస్తాను ('నన్నయతిక్కనల తారతమ్యాలు' అన్న వ్యాసం-ఆంధ్రవారపత్రిక 1940-ఫిబ్రవరి 21)

"ఆ ఉత్తముడు అంతతో తృప్తిపడడమే కాకుండా, ఆయనగారి పూర్వశాకుంతలంలో వున్న తప్పులన్నీ చూపి ప్రకటిస్తేకిమన్నాస్తిగా ఊరుకొని, ఒకప్పుడు హఠాత్తుగా చామర్లకోట స్టేషనులో కలుసుకోవడం జరిగేటప్పటికి, నేను ఆయీ విరోధాన్ని మనస్సులో పెట్టుకొని "యెడముఖం పెడముఖంగా" వున్నప్పటికీ, ఆయన ఏలాగో నన్ను గుర్తించి, "వేంకటశాస్త్రిలు బాబూ!" అంటూ దగ్గరకు వచ్చి కౌగలించుకొని యెంతో ప్రీతిగా, "యేదో కాలదోషంచేత అల్లా వచ్చిం"దంటూ గతంలో జరిగిన (తూలుమాటల విమర్శనాన్నిగూర్చి అన్నమాట) సందర్భాన్ని జ్ఞప్తికి తెస్తూ మాట్లాడడం, మొదలుపెట్టేటప్పటికి నాకు "సగం చచ్చినట్లయి," "అన్నా! యింత మంచి బ్రాహ్మడంటూ వుంటాడా యీయన ఏవో తొందరపడ్డప్పటికీ సర్వవిధాలా పెద్దవాడు మనకంటె అట్టి మహనీయుణ్ణి మనంకూడ తూలనాడడం తప్పు కదా!" అనుకొని నాలో నేనే విచారించవలసివచ్చింది"

కాలదోషంవల్ల కల్గిన తాత్కాలికకర్కశత్వాలను, క్షణంలో కరిగించుకోగల ఆ హృదయాల ఆర్ద్రతలు - నన్నయ్యగారు నిర్వచించిన బ్రాహ్మణగుణాలు - ఆనాటి తెలుగువారికి అంతగా చెల్లి ఉన్నాయి

ఒకే కోవ నున్న ఏ కొద్దిమందికో అభిమానమున్నా బ్రతుకు తెరువుగా పనికొచ్చేదిగా కనబడని విద్యలో, "తెలుగుకవిత్వం"లో, బాల్యంనుంచి ఆయనకు అభిమానం బయలుదేరింది యక్షగానాలు, తోలుబొమ్మలాటలు, వీథిభాగవతాలు, దాసరిపాటలూ- అన్నీ కూడా ఆ కవితా స్రోతస్వినిని ఆనాటినుంచీ ఆ హృదయంలో పొంగిస్తూనే ఉన్నాయి కాని చదువుకోవలసింది సంస్కృతపండితులవద్ద అదయినా గురుశిష్యసాంప్రదాయ పద్ధతులలో గురువుగారి ఇంట స్వయంగా శుశ్రూషచేసి, అప్పటికే సంస్కృతం చదువుకొనే శిష్యులే "కాళిదాసు కేం తెలుసోయ్, గిరిశంగారి నడుగు ప్రపంచంలో ఏ దెక్కడుందో తక్కున చెప్పేస్తాడు" అనుకొనే కరటకశాస్త్రి శిష్యుల పద్ధతిలో ఉన్నారు సంస్కృతం చదువుకొనే శిష్యుల పరిస్థితే అంతంతగా ఉంటే, ఆ జనం కూడా చులాగ్గా చూసి, హేళనచేసే తెలుగు అభిమానంగల విద్యార్థిలో తెలుగుకవిత్వం భూమిని పెగుల్చుకొని బలీయంగా బైటపడేందుకు ఎంత ప్రతిభ ఉండాల్సి ఉండేదో వేరే చెప్పనక్కరలెదు గురుకులవిద్యాభ్యాసపు గురుశిష్యసాంప్రదాయం శిథిల మవటానికి అక్కడక్కడ గురువులూ శిష్యులూ కూడా దోహదమొసగుతూ, పురాణవిద్యాబోధనపద్ధతుల నూత్నాకర్షణతో, ఉన్న మంచి కాస్తా కూడా ఊడ్చిపెట్టే స్థితిలో ఉన్నారు ఆ స్థితి సుస్థిరంగా ఉంటగానే, చర్ల బ్రహ్మయ్యమనీషివద్ద విద్యాభ్యాసం చేసి, తమకు వీలైనంతవరకూ ఆసాంప్రదాయశేషాన్ని తమతో మిగుల్చుకొన్నవారు తిరుపతి వేంకటకవులు కడియంలో ఆయన స్వగృహంలో ఆయనవద్ద ఉండి శిష్యరికం చేశామని సగర్వంగా చెప్పుకోగల తెలుగు కవులు ఈనాడు చాలామంది ఉన్నారు అల్లాంటి విద్యాభ్యాసం కేవలం అక్షరాలూ అర్థాలూ నేర్పే విద్య గాదని, హృదయాలను పండించే విద్య అనీ తెలుసుకోటానికి, ఈనాడు మనకు ప్రస్ఫుటంగా మిగిలిన చిహ్నము వేంకటశాస్త్రిగారే!

ఆయనజీవితకాలంలోనే, ఆయనచుట్టూ ఆ సాంప్రదాయం శిథిలం అయిపోయే వాతావరణం ఏర్పడి ఆయన ఒక్కడే, సంస్థకు శేషచిహ్నంగా మిగిలిపోవటంవల్ల, కొందరు శిష్యులతోనూ, కొందరు గురువులతోనూ కూడా తాతామనుమల వరుసను వీథిని పడవలసిన కర్మ ఆయనకు తప్పలేదు కాని ఆ కలహాలన్నీ కూడా పరికించుకొన్న విద్యయందు, శాస్త్రమునందు, సత్యమునందు ఆయనకు గల గౌరవంచేతనే తప్ప, కేవలం స్వాభిమానంవల్లనే ఆయన పెనగులాడవలసివచ్చినట్లుగా అంతగా గోచరించదు అయినా కలహాలకన్నా, కలహాలమధ్యకూడా ఆయన హృదయంలో ఉన్న ఆర్ద్రత, ప్రతిస్పర్థులకు గోచరించినా, గోచరించకపోయినా మధ్యస్థులకు గోచరిస్తూ వస్తుందనేదే విశేషం

ఆయన వ్యాసాలలో ఆయన చిననాటివి, ఆయన చిననాటికి ప్రచారంలో ఉన్నవి, అప్పటప్పటి రోజులవాళ్ల విషయాలు గోచరిస్తూ ఉంటాయి 19వ శతాబ్దాంతంలో తెలుగుల జీవితచరిత్రను అర్థంచేసుకోవాలంటే, ఆ వ్యాసాలుపయోగించినంతగా, రాజకీయచరిత్ర గ్రంథం ఏదీ కూడా ఉపయోగించదు

తెలుగుభాషమీద నిరసనం, నీరసం జనించే రోజుల్లో తెలుగుకవిత్వాన్ని దొరక పుచ్చుకొని, తెలుగుజాతికంతకూ కావ్యపిపాసా, కవిత్వపిపాసా కల్పించాడు శతావధానం, కేవలం పండితరంజకమయిన, *'Oriental feats'* గా కాకుండా, తెలుగు నుడికారపుసొంపు అంతా ఒలికిస్తూ, కాకువు, ధ్వని, చమత్కారము, ఇన్నిటిని మించి, రసం, అన్నిటినీచిప్పిలిస్తూన్న ఆశుధారాప్రవాహంగా చేసి, మృదుమధుర కంఠంలో సభాసదులను ఆబాలగోపాలమూ రంజింపచేసి తెలుగు కవిత్వం పట్ల, ఆపేక్షనూ, నూతనోత్సాహాన్నీ జనులలో రేకెత్తించి, "ఏకలవ్య" శిష్యత్వాలను అనేకం సంపాదించుకొన్నాడు ఆయన ఉపన్యాసాలు విన్నవారెవ్వరూ, ఆద్యంతాలు సభలోనుంచి కదలలేకపోయేవారు ఉపన్యాసానంతరం కూడా, ఇంకా ఉందేమో అన్న భ్రమ వదిలేది కాదు ఒక్కటే విచిత్రం ఆయన ఉపన్యాసాలూ, వ్యాసాలూకూడా, ఏకవస్తునిర్దేశితంగా ఏనాడూ కూడా నడవలేదు విశ్వనాథసత్యనారాయణగారు వేయిపడగలలో, ధర్మారావుతో వాదానికి వచ్చిన మిత్రులు "మిమ్మల్ని ఏదో ఒకటి అడిగితే, ఏవో పది చెప్పుకుపోతా"రని నిందించినప్పుడు, ధర్మారావుచేత, "ఒకడు సముద్రము వంటివాడు - ఒకడు చిన్న పడియవంటివాడు. మొదటివాని హృదయము పొంగినప్పుడు సముద్రము పొంగినట్లు అనేకవిషయములు పొంగి వచ్చును" అను అర్థంవచ్చే మాటలతో జవాబు చెప్పిస్తారు అక్కడ ధర్మారావు తానే అని ఆయన అనుకొన్నాడో లేదో గాని, ఉపన్యాసాలలో, వ్యాసాలలో, ఆయన గురువుగారైన వెంకటశాస్త్రిగారు మాత్రం అట్టివాడే కాని, నిజమైన జిజ్ఞాసువుకు ఆ పొంగులో సర్వవిషయాలు ముమ్మరంగా ఘుంచెత్తుకొని వస్తూ, తన హృదయానికి నూతనచైతన్యం కల్గిస్తుంటే ఉన్నంత సుఖము, ఏదో అడిగినదానికి జవాబు చెప్పినట్టుగా చెప్పేడు ఉపన్యాసంలో గాని, వ్రాసిన వ్యాసంలోగాని ఉండదు పైగా శాస్త్రిగారి ఉపన్యాసాలలో మరొక రమ్యత్వము కూడా ఉండేది సభలో చివర కూర్చున్న వారికికూడ కేవలం తనూ శాస్త్రిగారూ ఇద్దరూ ఒంటరిగా కూర్చుంటే తనతో శాస్త్రిగారు పూర్తిగా మనసిచ్చి ఒంటరిగా మాట్లా

(21-వ పేజీ చూడుడు)

కాని ఆధునిక కవి సామ్రాట్టులు కూడ "కవిలోకమహాగురవే" యని స్తుతించు కవి వృద్ధుని గౌరవించుటలో మద్రాసు ప్రభుత్వము అతి ఉచితమైన నిర్ణయ మొనర్చి, సర్వపక్షసౌహార్దమును పొందగల్గినది "ఆస్థాన కవి" స్థానమునకు ప్రప్రథమములోనే ఉన్నతమగు గౌరవము సంపాదించుకో గల్గినది నేటి ఆంధ్రకవులు, ఆంధ్రమహాజనులు ఎల్లగు కూడ, ప్రభుత్వము, వేంకటశాస్త్రిగారి కీ గౌరవమిచ్చుటకు, తద్ద్వారా, భవిష్యత్తులోకూడ "ఆస్థాన కవి" పదవిని అత్యున్నతమైన గౌరవ సంజ్ఞగా నిలుపగలుగుటకు, అత్యధికముగ ఆనందించగలరు భగవంతు డీయనను చిరాయువుగా చేయుగాత!

కథానిక

స్త్రీ హృదయం

"శ్యాంబాబు"

(గత సంచిక తరువాయి)

రాజారామ్

ఇంటికి వచ్చేసరికి ఉదయం 10 గంటలయింది బయట అరుగుమీద రాధ కూర్చుని ఉంది సంగతి గ్రహించాను. మరి వారున్నారా వెళ్లిపోయారా అని అడిగాను "ఉన్నారు నేనెంతో బ్రతిమాలగా బ్రతిమాలగా అక్కయ్యను పిల్లలను ఉంచివేసి ఆయన మాత్రం వెళ్లిపొయ్యా"రని అంది లోపలికి వెళ్లాను అన్నపూర్ణవంటంతా చేసి నాకోసం నిరీక్షిస్తూ కూచుని ఉంది ఆమె ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్లుగా కనిపించింది ఆమె ముఖంలో ఏదో విచార ముద్రకూడా స్పష్టంగా కనిపిస్తోంది

"ఏమమ్మా అల్లా ఉన్నావు, అపుచేసినా మనితోపమా? లేక ఆయన మళ్లీ ఏదైనా అన్నాడా?" అన్నాను "అబ్బే ఏమీ లేదు ఊరికే నే" అంది ముభావంగా

నీళ్ళు సిద్ధంగా ఉన్నాయి ఆమెతోడి ఇచ్చింది స్నానంచేసి భోజనానికి కూర్చున్నాను "మీరు తినకపోయారా! నాకోసం కూర్చోవడ మెందుకు? నేను వేళకు వేస్తానా" అన్నాను

"ఇంతకూ ప్రొద్దేమీ పోలేదుగా" అంది ఆవిడ ముఖం, ఆవిడ ఒలూ చూసేసరికి ఏదో విషయం ఉందనీ, నాతో చెప్పడంలేదనీ గ్రహించాను తడిస్తూఉండగ ఆమె చెయ్యి పట్టుకొని నాదగ్గరగా కూర్చోపెట్టుకొన్నాను "మళ్ళీ ఏమైనా అన్నాడా? మన విషయం తెలుసుకొన్నాడా? అని అడిగాను "అదు ఎల్లా తెలుస్తుంది? ఏమో నాకేమీ తోచడం లేదు అంతా అయోమయంగా ఉంది" అని అంది నామీద కోపమా? అన్నాను ఆమె బుగ్గ నిమురుతూ "నీమీదా! ఎందుకని! ఊహు(—" అంది అన్నివిషయాలు రాధతో చెప్పడం అలవాటుగాని మనవిషయం మాత్రం చెప్పలేను దైవసాక్షిగా అన్నాను "ఆయిన దేదో అయింది రాధకు తెలియనియ్యకు అంతే నిన్ను కోరేది" అని అంది నీ కా భయం అక్కరలేదు మరి ఇల్లా ఎందుకున్నావు? హుషారుగా రోజులాగ లేవు నా కలాగో ఉంది అన్నాను "రాత్రి నువ్విచ్చిన సొమ్ము నీకు తిరిగి ఇచ్చేయమని చెప్పి, నాచేతికి ఇచ్చారు ఎవరో స్నేహితుడు సొమ్ము సర్దుబాటు చేశాడుట ఉండు, తెస్తా"నంటూ లేవబోయింది నేనామె చెయ్యి పట్టుకొని లేవనియ్యలేదు ఆ సొమ్ము నాకూ అక్కరలేదు ఏనాడో నీకోసం ధారాదత్తం చేసాను నేను తిరిగి పుచ్చుకోనన్నాను —నా ఉదారత్వంవలన ఆమెకు సంతోషం కలుగలేద్దామని

"నాకూ అక్కరలేదా సొమ్ము. నీ సొమ్ము కాశించలేదు నేను మరి యెందుకు నీకు లొంగిపోయ్యానో దైవానికి తెలుసు ప్రతిఫలం కోరి కాదు మాట తీసెయ్యలేక, తిరస్కరిస్తే నీవూ నేనూ అల్లరిపడిపోవలసివస్తుం దనీ అంతే—" అంది

"నీ పరోపకారబుద్ధికి మెచ్చుకుంటున్నాను నువ్వు వెళ్లేలోగా సొమ్ము తీసుకొంటానులే" అన్నాను మనస్సులో మాత్రం ఆమెచపల చిత్తం గ్రహించి విచారించాను పైకి ఇంతగా కబుర్లు చెప్పుతుండే అగ్నిహోత్రంవంటి దని పేరు సంపాదించిందే ఇంత తేలికగా, పరిశీలన తెలుసుకొని ప్రవర్తిస్తే ప్రతిస్త్రీ ఇంతే అని నిర్ణయించుకొన్నాను

భోజనం చేసి లేచాను ఈ రోజంతా ఆమె అదో రీతిగా మందంగా విచారంగా ఉంది ఏదో ఆలోచనాభారంతో ఉంది నాకేమీ అర్థం కాలేదు నేనూ ఆమెతో అధికంగా మాట్లాడలేదు

ఆ మధ్యాహ్నం 4 గంటలకి రాధ అక్క శాంతా, మొగుడు విశ్వనాథమూ వచ్చారు విశ్వనాథం తాలూకాఆఫీసులో గుమాస్తా, సామాన్య సంసారి యీమధ్య నెలరోజులనుంచి అతని కనారోగ్యంగా ఉంటోందని నా సలహాకోసం వచ్చామనీ అన్నారు రాధవంటి సౌందర్యవతులుండరని నేననుకొన్నాను కాని శాంతిఅందము రూపురేఖలు చూస్తే నా కాశ్చర్యం వేశాయి నా పెళ్ళికి శాంతిగాని విశ్వనాథంగాని రాలేదు ఇంతకు ముందెప్పుడూ వాళ్ళను చూచి యుండలేదు శాంతకు ఇరవయ్యి, ఇరవయిరెండేళ్లుంటాయి పరిపూర్ణయౌవ్వనంలో ఉంది సంతానము లేదు విశ్వనాథం బక్క పలచగా ఉంటాడు. ఎన్ని చెప్పినా శాంతికు తగిన మొగుడు కాడని నా యూహ

విశ్వనాథాన్ని పరీక్ష చేశాను ఎక్కువ పరిశ్రమవలన వచ్చిన దని ఓ నెలరోజులు విశ్రాంతి తీసుకుంటూ మందు పుచ్చుకోవాలనీ అన్నాను నెలరోజులు మా యింట్లోనే ఉండమన్నాను నేను చెప్పిన మందు కొంటాను కాని ఇంటిదగ్గరే పుచ్చుకొంటామన్నాడు అందుమీద నేను, దగ్గరి బంధువులకి ఓ నెలపాటు భోజనం ఆతిథ్యం ఇవ్వలేని దరిద్రుణ్ణి కానని, తరువాతి మీ యిష్టమని అనేప్పటికి, అతను 'అబ్బె, అది కాదోయి తప్పకుండా ఉంటాను అయితే రేపు వెళ్లి ఒక నెల సెలవుపెట్టితిరిగి వస్తా'నని అన్నాడు. నాకూ రాధకూ చాలా సంతోషం కలిగింది

రాత్రి అన్నపూర్ణను కలుసుకోడానికి వీలు లేకపోయింది ఇన్నేళ్లు వచ్చినా క్రొత్తగా కాపురానికి వచ్చినదానిలాగ అన్నపూర్ణకు మొగుడిదగ్గరే సిగ్గుపడే స్వభావం నాకు బాగా తెలిసియుండడంచేత, ఇంటిలో చుట్టాలుండడంచే తానే నాతోను పలకరించ లేదు అన్నపూర్ణలో పరపురుషుడి స్నేహంకోసం తహతహ లేదనీ, కాని అనుకూలమయిన పరిసితి చూచి బలవంతంచేస్తే తిరస్కరించే శక్తి లేదనీ నేను గుర్తించాను ఎదుటివారి మనస్సు నొప్పించడం ఆమె కిష్టముండదు ఇది నేను బాగా ఎరిగియుండడంచేత ఇవ్వేళ అన్నపూర్ణతో సరిగా మాట్లాడనైనా లేదు

మరునాడే విశ్వనాథం వాళ్ల ఊరు వెళ్ళిపోయాడు శాంత మొగుడితో వెంటనే తిరిగి రమ్మని మరిమరీ చెప్పింది చాలా కాలానికి కలుసుకోవడంచేత అక్కాచెల్లెలూ మహానందంతో కబుర్లు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారు రెండురోజులు గడిచాయి శాంత నాతో చనువుగా, వేళాకోళంగా మాట్లాడేది తన మొగుడు గోవువంటివా డనీ, వేళకన్నం తినాలనీ మాసినగుడ్డ విడువాలనే ధ్యానం కూడా ఎరుగడనీ, తను కంటికి రెప్పలాగ, చంటిపిల్లవాడిని చూచినట్లుగా చూస్తూ సంరక్షణ చేస్తున్నాననీ అనేది అస్తమానం భర్త సాధుశీలత్వం, అమాయకత్వం వర్ణిస్తూ ఉండేది భర్తకు వచ్చిన అనారోగ్యం తనకు వస్తే బాగుండు నని, ఎల్లా ఉంటాడో అని కంట తడిపెట్టుకొనేది అన్నపూర్ణా, రాధా ఆమెగుణాలు చూచి ఆశ్చర్యపడేవారు

శాంతను చూచినప్పటినుంచి, 'యీమెకూడా అన్నపూర్ణవంటిదే' నని అనుకొన్నాను అన్నపూర్ణ మాత్రం - పిల్లలు కలది తన శీలాన్ని అంత పోగుడుకొనేది అన్నేళ్లనుంచి కాపురం చేస్తున్నది ఇంత తేలికగా లభ్యమవుతుం దని మొదట్లోనే ననుకోనేలేదు ఇంక శాంతో, పడుచుది, పిల్లాజెల్లా లేనిది యీ పతిభక్తి కబుర్లు, యీ నటన, ఎంతవరకో నా కర్థమయ్యాయి ప్రపంచంలో స్త్రీలు తమ పాతివ్రత్యం, పవిత్రత మాటలలో ఒలకపోస్తూ, మధ్య మధ్య తప్పటడుగులు వేస్తూ, నటిస్తూ ఉంటారని నాకు ఎప్పుడూ ఉన్న ఉద్దేశ్యం తదనుగుణంగానే, అటువంటి స్త్రీలనే నేను పరీక్షించి చూశాను. శాంతమాత్రం? సరే పరీక్షించాలని నిశ్చయించుకొన్నాను హాలుప్రక్కనే ఉన్న గదిలో శాంత పడుకొనేది అవతల గదిలో రాధ పడుకుంటూంది రెండు రోజులనుంచి రాత్రి నేను చేసే పని రాధకు తెలియకుండా ఉండా లని బాగా మత్తు నిద్ర పట్టడానికి మందు త్రాగించాను రాధకి అన్నపూర్ణకు తెలిసినా నాకేమీ భయం లేదు రేపే వాళ్ల ప్రయాణం అదేమనుకొన్నా నాకేమి అనుకుంటూ పన్నెండు గంటలు దాటినదాకా నిద్రపోకుండా గడిపాను అన్నపూర్ణ పడుకొన్న హాలులోనుంచి శాంత గదిలోకి వెళ్లాను శాంత గాఢనిద్రలో ఉంది రాధను చూశాను ఆమెకెరిగాపే యెరుగకుండా నిద్రపోతోంది నా మందు పట్టిచ్చిం దని అనుకొన్నాను క్షీణంగా వెలుగుతున్న దీపం పెద్దదిగా చేశాను వెలుతురులో శాంత సర్వాంగ సౌందర్యం త్రాగివేయాలని నా యూహ శాంతిమంచంమీద కూర్చొని తనివితీరా ఆమె ముఖం—చిరునవ్వు చిందులాడే ఆమెముఖం చూస్తున్నాను మెల్లగా ఆమెకపోలాలు చుంబించాను ఆమెకు మెలకువ వచ్చి తిరస్కరిస్తే యీ ఆనందం లభించ దనీ, ఆమెకు మెలకువ రానట్లుగా నా ఆనందం తీర్చుకొంటున్నాను ఇల్లా గరగంటసేపు గడిపాను యీసారి కొంచెం గట్టిగా ఆమె వదనాను అధరం ముద్దుపెట్టుకొన్నాను ఆమెకు మెలకువ తెప్పించా లని గట్టిగా ఆమె బుగ్గలూ, కంఠం స్పృశించాను ఒకసారి ఒత్తిగిలి పరుండి ఆమె కళ్లు విప్పింది, లేచింది నన్ను చూచి పెద్దపులిలాగ గాండ్రుమంది ఒక్క తాపు తన్నింది నేను మంచం మీదనుంచి క్రింద పడ్డాను నాపురుషత్వం యీ అవమానం సహించలేకపోయింది ఆమె చెయ్యి పట్టుకోబోయాను ఆమె విదళించి వేసింది 'ఏమి టే తుంటరిపని? పో, అవతలికి!' అని గద్దించింది నేను మాట్లాడక ఆమె చెయ్యి పట్టుకొన్నాను 'జాగ్రత్త! గౌరవంగా దయచెయ్యి ఇంతటి నీచుడవా! తెలవారనీ నీయింట్లో ఒక్క నిముసం ఉండను త్రాచుపాముపుట్ట అని తెలియకవచ్చామే పో!' అంటూ నన్ను గెంటివేసింది

నిజంగా నాకుకూడా ఉన్మాదం కలిగింది పట్టుదలహెచ్చింది మళ్లీ చెయ్యిపట్టుకొన్నాను ఆమె గట్టిగా నా య్యి కరిచింది నాకు కోపం ఆగక ఫెళ్లున కొట్టాను ఆమె తన ఒళ్లంతా గీరుకొంది బలవంతంగా నేను కౌగలించుకోబోతే అడ్డు పెట్టింది చివరికి ఎల్లాగయితేనేమి నేను పురుషుడిని ఆమె అబల కొంతసేపటికి ఆమె అలసిపోయింది నిట్టనిలువునా కూలిపోయింది నేను కృతకృత్యుడయ్యాను దీపం ఆర్పివేసి పోయి పడుకొన్నాను నా శరీరంఅంతా ఆమె కాట్లతో, రక్కులతో బాధగా ఉంది నా కేదో దిగ్భ్రమగా ఉంది హద్దుమీరి ప్రవర్తించానేమో అని భయం కలిగింది నేనంత పిశాచుడిని, రాక్షసుడిని అయిపోయానని, ఫలితం బాగుండదేమో అనీ క్షోభపడ్డాను నిద్ర లేదు.

అన్నపూర్ణ

నూరు రూపాయిలనోట్లు రెండూ నాముందు పారవేసి ఆయన వెళ్లిపోయారు బజారుకు వెళ్లినారని అనుకొన్నాను సాయంకాలం నౌకరు వచ్చి యింటికి వెళ్ళిపోతున్నట్లు తనతో చెప్పారని చెప్పాడు ఆయన అసలే అనుమానం మనిషి తల్లీ - కొడుకు, అన్నా-చెల్లెలు, తండ్రీ-కూతురూ ఏకాంతంగా నివసించడానికి ఆయన ఆత్మ ఒప్పుకోదు నేటి కాలం యొక్క ప్రభావం అనీ, శుద్ధమైన మనస్సులు కూడా ఆయా సమయాలలో క్షుద్రమైపోతా యనీ ఆయన దృఢవిశ్వాసం జితేంద్రియత్వం యీ యుగంలోని మాట కాదని ఆయన అంటారు నామట్టుకు నావిషయంలో అంతే జరిగింది నాచేసిన ద్రోహం, ఆత్మవంచనా తల్చుకుంటూ ఉంటే ఏదో మూకవేదన, మర్మాంతిక వేదన కలుగుతోంది శరీరం నిప్పులమీద ఉన్నట్లు, వేలకొలది తేళ్ళొకసారిగా కుట్టినట్లు సహింపరాని బాధ కలుగుతోంది చిత్తదార్ఢ్యం అలవరుచుకోలేని నా వంటివాళ్ల గతి ఇంతే పైకి మాటలలోనే మేము మా పవిత్రత వర్ణించుకోవలసివస్తుంది

నేనూ ఇక్కడినుంచి వెళ్లిపోవా లనుకున్నా పడింది కాదు యీ రెండురోజులూ రెండు యుగాల్లుగా గడిపాను ఇతరులకోసం నా సుఖం పాడుచేసుకోవడ మంటే ఇప్పుడర్థమయింది మాఆయనమాటలు నాకిప్పుడు అర్థమయ్యాయి వారు ఇంటికి వెళ్లిననాడే రాధ అక్క, బావా వచ్చారు ఆమె సౌజన్యతలో, రూపురేకల్లో రాధను మించింది నన్నెంతో ఆప్యాయంగా, చాలా కాలాన్నుంచి ఎరిగియున్నదానిలాగా ప్రేమవాత్సల్యాలతో మాట్లాడేది నా పిల్లల సంరక్షణ అంతా తనే చేసేది శాంతతో మాట్లాడుతూ ఉన్నంతసేపూ నా మనస్సు చల్లగా శాంతిగా ఉండేది రెండు రోజులలో తిరిగివస్తానని శాంతభర్త వెళ్లిపొయ్యారు శాంతరాక నా కేదో నూత్నహర్షం కలిగించింది రాజారాంతో దూరంగా ఉండాలనీ, మా ఊరు వెళ్లిపోవాలనీ ఎంతో ఆతురతగా ఉన్నా, రాధ ఇంట్లోకి రావడానికి వీల్లేకపోవడంచేత తప్పనిసరిగా మా ప్రయాణం ఆగిపోవలసి వచ్చింది ముళ్లమీద ఉన్నట్లుగా ఉన్నాను రాజారాంనుంచి తప్పించుకోవడం పడదు గదా అనీ బాధపడ్డాను ఇంతలోనే శాంతిమొగుడు రావడంతో కొంచెం దిటవు కలిగింది యీ రెండురోజులూ రాజారాం నన్ను బాధించడానికి వీల్లేదు గదా, రెండురోజులయ్యాక రాధ ఇంట్లోకి వచ్చాక వెళ్లిపోతాము గదా అనీ ధైర్యం చెప్పుకున్నాను మా ఆయన ఇక్కడ ఉండగా శాంత వచ్చియుంటే మేము వెళ్లిపోయే ఉందుము

తెల్లవారితే రాధకు స్నానం యీ రాత్రికే మా ఆయన వస్తానన్నారు కాని రాలేదు ఉదయం వస్తారనుకొన్నాను రాత్రి భోజనాలయ్యాయి అన్నీ చక్కబెట్టి, సర్దుకొని మంచంమీద పడినకే నిద్ర వచ్చింది రెండు గంటలు ఆ ప్రాంతంలో ఏదో మూలుగు వినిపించి లేచాను ఎక్కడనుంచా యిది అని పడుకొనే ఆలోచించాను శాంత పడుకొన్న గదిలోనుంచి అని సిరపరచుకొన్నాను ఏమిటా అని మెల్లగా వెళ్లి దగ్గరగా వేసిన తలుపుల సందులోనుంచి చూశాను నా ప్రాణం నోటిలోకి వచ్చినట్లయింది రాజారాం శాంతను బలాత్కరిస్తూ ఉండడం, ఆమె ఏడుస్తూ ప్రతిఘటిస్తూఉండడం కళ్లారా చూశాను, నమ్మలేకపోయాను శాంత ఎంత ఉత్తమురాలు! పైకి అంత విలాసవతిగా కనిపించే శాంతలో ఉన్న దివ్యత్వం, సాధ్వీత్వం నా కాశ్చర్యం కలిగించాయి రాజారాంను తిడుతూ, శపిస్తూ, ఏడుస్తూ ఆత్మ సంరక్షణ చేసుకొంటోంది నేను వెళ్లి సహాయపడుదామనుకొన్నాను ఎదటపడితే రాజారాం ఉగ్రుడైన న్నేమి చేస్తాడో అని, తనకూ నాకూ ఉన్న సంబంధం బయటపెట్టి అగౌరవపరుస్తాడనీ భయం వేసింది వెళ్లడానికి సాహసం కలగలేదు అల్లాగే చూస్తున్నాను రాజారాం ఎంత తుంటరి! కనిపించినదాన్ని బలాత్కరించడమే అతని పనా? ఇంత దుష్టుడనే మా ఆయన నేనిక్కడ ఉండడం సహించలేకపోయారు నాకు ఆయన మాట తలకెక్కలేదు రాజారాంకు తగినట్లు బుద్ధి చెప్పే ఆడది లేకపోవడంచేతనే యితని ఆటలు సాగుతున్నా యనీ, నేనే చూపించి యుండవలసింది—స్త్రీత్వం అంటే ఏమిటో ఎరుగని ఇటువంటి పశువులకనీ, నా కా శక్తి లేకపోయిందనీ నా దౌర్బల్యం తలుచుకొని సిగ్గుపడ్డాను. ఈ నీచుడికి శాంత బాగా బుద్ధి చెప్పుతోం దని గర్వించాను శాంతసాధ్వీత్వం చూడగానే, ఆమె చేస్తూన్న ప్రతిఘటన గాంచినంతనే నేను భ్రష్టురాల నయిపోయానగదా అని ఏడ్చాను ఆ భ్రష్టుడి కఠోరాఘాతాలికి, అబల సుకుమారి చాలలేకపోయింది, ఓడిపోయింది నిలువునా లనే మీద కూలిపోయింది నేను పురుషుడిని నా కవేమున్న దనే విజయగర్వంతో ఆ రాక్షసుడు తిరిగి

(18 వ పేజీ చూడుడు)



భారతరాజకీయాలకు వికాసం తెచ్చిన కళామూర్తి సరోజినీదేవి

"ఆమె వ్యక్తి ప్రతిభ ప్రచండ తేజోవంతమైన దైనప్పటికీ, ఆమె సానునయ వాక్కులు వ్యథిత హృదయాలకు అమృతప్రాయము లైనవి ఉత్తేజపూరితమైన రాజకీయాలలో ఆమె స్మితవదనం శీతలవాతావరణం ప్రచలింపచేసి, రాజకీయాలను మానవ హృదయానికి సన్నిహితంగా ధరాతలానికి తీసుకువచ్చింది." అని పండిట్ నెహ్రూ శ్రీమతి సరోజినీదేవిని గురించి అన్నారు "గాంధీజీ మన రాజకీయాలలో నైతిక ధర్మనియమాలను 'ఆదరించునట్లు నేర్పిపెట్టగా, సరోజినీదేవి మధుర కళానుభూతిని ప్రసాదించిం" దన్నారు.

సరోజినీదేవి బుధవారం (మార్చి 2) తెల్లవారుజామున స్వర్గస్థురాలైన దని తెలిసి భారతదేశం విచలిత మైపోయింది హృదయం చీల్చిన ట్లున్నదని పండిట్ నెహ్రూ ఆక్రోశించారు ఎక్కడికి వెళ్లినా, ఎవరిమధ్య ఉన్నాసరే తన మధురహాస్య భాషణలతో సన్నిహితస్థులను నిత్యం ఉత్సాహపరిచే సరోజినీదేవిమృతితో ఒక్కపెట్టున వేయిదీపుల నార్పివేసిన ట్లున్నదని సర్దార్ పటేల్ వాపోయారు

తండ్రి మరణిస్తే బిడ్డలకు గౌరవమకుటం తొలగిన ట్లుంటుంది తల్లి మరణిస్తే బిడ్డలకు హృదయాకాశంలో వెలుగే అంతరిస్తుంది గాంధీజీ దుర్మరణంతో భారతజాతికి నైతిక దార్ఢ్యం ప్రసాదించే శక్తి లోటువచ్చాడు సరోజినీదేవిమృతితో కాంగ్రెస్ అగ్రనాయకవర్గంలో 'సర్వప్రియ' మూర్తి అంతరించింది

వంగదేశ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన డా॥ అఘోరనాథ చటోపాధ్యాయకు, వరదసుందరీదేవికీ 1879 లో ఫిబ్రవరి 13 వ తేదీని సరోజినీదేవి జన్మించింది తండ్రి విద్యాప్రచారవేత్త విజ్ఞానశాస్త్రనిపుణుడు స్వతంత్రభావాలు కలిగి ఎవరి అదుపాజ్ఞలకూ లోబడనివాడు పరదేశపరిపాలనలోనూ, నిజాం నిరంకుశ పరిపాలనలోనూ కూడా అధికారుల ఆగ్రహానికి గురైనా ఎదిరించి నిలువగలిగాడు స్వాతంత్ర్యపిపాసువులకు, దేశభక్తులకు అఘోరనాథుని ఇల్లు ఆశ్రయంగా ఉండేది తల్లి వంగభాషలో కవయిత్రి. ఇటువంటి గృహంలో జన్మించిన సరోజినీదేవి మతాచారశృంఖలాలను విదల్చివేసి తెలుగు నాయుడుకుటుంబానికి చెందిన డా॥ గోవిందరాజులునాయుడుగారిని తన 19 వ ఏట వివాహంచేసుకుంది తల్లి కళాసంపదకు సరోజినీదేవి, కనిష్ఠసోదరుడు హరీంద్రనాథ చటోపాధ్యాయ వారసు లైనారు ఒక సోదరుడు వీరేంద్రనాథుడు పరిపాలకుల నెదిరించి, అతివాదరాజకీయాలలో పాల్గొని దేశం త్యజించి జర్మనీలో నివసించవలసివచ్చింది

పదమూడవఏటనే సరోజినీదేవి ఇంగ్లీషులో కవనం ప్రారంభించింది ఆమెకవిత్వం చూసి ప్రసిద్ధాంగ్లకవులు ఎడ్మండ్‌గాస్ ఆర్థర్ సైమన్స్ ముగ్ధులై ఆమెకు సహాయపడినారు.

ఆమెలో భావోద్వేగం హృదయోత్తేజం వాటంతట అవే పెల్లుబికి కావ్యాలుగా గీతాలుగా రూపొందినా యని లండన్ టైమ్స్ పత్రిక ఆమె కవనం గురించి ప్రశంసించింది రాజకీయప్రవాహంలో పడి ఆమెజీవితం కొట్టుకొనిపోకపోయినట్లయితే ఆమె ఆంగ్లవాఙ్మయ చరిత్రలో ఉన్నతస్థానం ఆక్రమించగలిగి ఉండే దని ఆ పత్రిక ఇప్పుడు వ్రాసింది

ఇంటికి నిప్పంటుకుంటే నీరు తెచ్చి ఇల్లు ఆర్పడానికి ప్రయత్నించాలిగాని, గీతాలాపన చేస్తూ కూచోకూడ దని రవీంద్రనాథ ఠాకూర్ చెప్పిన మాటలప్రకారం సరోజినీదేవి కవితాగోష్ఠి విడిచి రాజకీయరంగంలో ప్రవేశించింది దక్షిణదేశంలో ఆమె రాజకీయజీవితం ప్రారంభించింది

ఆమె రాజనీతిజ్ఞత, భావప్రకటనరీతి, వివేచనజ్ఞానం, దేశభక్తి గోఖలే, డా॥ బిసెంట్, జిన్నాలవంటి మితవాదనాయకులను ఆరంభంలోనే ఆకర్షించాయి

దక్షిణాఫ్రికా, యూరప్, అమెరికాదేశాలు పర్యటనచేసి భారత జాతీయోద్యమాన్ని ప్రచారం చేసింది రేశదేశాలలో భారతీయుల గోడు వినిపింపచేసింది ఆంగ్ల విద్యావంతులుకూడా ఆమె ఉపన్యాసాలు విని అబ్బురపడేవారు ఏదేశం వెళ్లినా జనం సమూహాలుగా వచ్చి వినేవారు

వక్తృత్వంలో ఆమెకు సాటి మరొక స్త్రీ ప్రాగ్దేశాలలో లేదు ఆమె శైలి అతిమధురమై సుబోధకమైనది ఝరీవేగంతో ప్రవహిస్తుంది ఎంత కఠినవిషయంలోనైనా సరే హాస్యం చేర్చి శ్రోతలు మరిచిపోనిరీతిగా రసానుభూతి నిచ్చి మాట్లాడగలదు వాదనవిధానం అతిసరళమైనది హృదయాలకు సూటిగా తగులుతుంది ఏ విషయానైనా సరే, సామాన్యమానవహృదయాని కేరీతిగా తట్టుతుందో ఆ రీతిగా చర్చిస్తుంది హృదయాల్ని కరిగించగల తియ్యని శైలిలో మాట్లాడుతుంది ఆమెఉపన్యాసాలన్నీ దేశభక్తిపూరితమైనవి వానిని విన్న తరువాతనే కేవలభ్రమమాత్రమైన అంతర్జాతీయవాదంనుంచి, సామ్యవాదపదజాలంనుంచీ, విముక్తి పొందగలిగినట్లు పండిట్ నెహ్రూ ఆత్మకథలో వ్రాశారు తరువాతనే జాతీయదృక్పథాన్ని అలవర్చుకున్నట్లువ్రాశారు

భారతదేశరాజకీయరంగంలో మతసామరస్యానికి ఆమె చేసిన కృషి, ఆమె ఉపన్యాసాలు ఎంతగా తోడ్పడినాయో గాంధీమహాత్ముడు ప్రశంసించారు. భారతమహిళల దాస్య



బ్రిటిష్ అమాత్యరాయబార వర్గము ఢిల్లీవచ్చినప్పుడు గాంధీజీ భంగీకాలనీలో బసచేయుచుండగా శ్రీమతి సరోజినీనాయుడు నాభా సంస్థాన మహారాణి, తన కుమార్తె పద్మజానాయుడుగార్లతో ఆయనను చూడబోవునప్పటి ఫో[illegible]

స్థితిని విమర్శించిన పేయోలకు సరోజినీదేవి ఈక్రిందిరీతిగా సమాధానమిచ్చింది

"మాదేశపు స్త్రీలకు మీ పాశ్చాత్యదేశాలలో ఎవరి సానుభూతీ అక్కరలేదు మీదేశాలలో ఎవరినీ మేము విశ్వసించం ఇంగ్లండులో కూడా, చివరికి మితవాదనాయకుల్నికూడా విశ్వసించం మేమెవ్వరినీ యాచించనక్కర లేదు మేము స్వయంగా నిలబడి పోరాడగల సత్తా మాకు (స్త్రీలకు) ఉన్నది"

1925 లో కాన్పూర్ కాంగ్రెస్‌కు సరోజినీదేవి అధ్యక్షత వహించింది అప్పుడు గాంధీమహాత్ముడీ రీతిగా అన్నాడు "కవయిత్రిగా సరోజినీదేవికి ప్రపంచఖ్యాతి ఉన్నది ఆమె ప్రజాసేవలో ప్రవేశించిన తరువాతకూడా ఆమెపట్ల గౌరవాదరాలు తగ్గలేదు ఆమె సర్వజనులకూ సన్నిహితురాలు దేశంలో ఏ సేవ చెయ్యడానికైనా వెనుదియ్యని సఖ్యతాసాగనే ఆమె పరమాశయం


"ధైర్యసాహసాలు ఆమెలో మూర్తీభవించి ఉన్నాయి బొంబాయిలో 1921 కలహాలలో నిర్భయంగా వీథుల్లో తిరిగి, ఉన్మత్తజనసమూహాల్ని నివారించ యత్నించింది"

1930 సత్యాగ్రహంలోనూ, 1932 సత్యాగ్రహంలోనూ గాంధీజీ అరెస్టుకాగానె సరోజినీదేవి సత్యాగ్రహానికి నాయకత్వం వహించింది.

1930 ఉప్పుసత్యాగ్రహం సందర్భంలో గాంధీజివెంట ఉండి కఠోరవ్రత పరీక్షాసమయంలో తన హాస్యభాషణలతో సత్యాగ్రహులకు కష్టాలను మరపింపచేసేది ఉప్పు తయారుచేస్తుండగా పోలీసులు ఆమెకు చుట్టు ముట్టారు [illegible] ఆమె మానలేదు అప్పుడు పోలీసులు చుట్టూ నిలబడి ఆమెకు ఆహారం నీళ్లు అందకుండా చేశారు. అయినా "ప్రళయం వచ్చేవరకూ నే [illegible] కూచుంటాను మీరు కూర్చోగలరా?" అని పోలీసులను నవ్వుతూ ప్రశ్నించింది అలాగే పట్టుదలతో కూర్చుంది పోలీసులు ఆమెను అరెస్టు చేసి తీసుకుపోవలసివచ్చింది

హిందూముస్లింసఖ్యతను సాధించడానికి కృషిచేస్తూ, స్త్రీసహజమైన సానునయరీతిని ఈ క్రింది విధంగా చెప్పింది "భారతదేశం తన ఇల్లు చక్కబెట్టుకుని, పూర్వసౌభాగ్యాన్ని తిరిగి లభింపచేసుకోడానికి యత్నించడమే కర్తవ్యం భారతదేశం తన ఇంట తానే సరాకారిణి కావాలి తన సంపదకు తానే వారసురాలు కావాలి భారతమాతకు విధేయురాలైన పుత్రికగా, తల్లి ఇంటిని సరిదిద్ది, భ్రాతృకలహాలను పోగొట్టడానికే నాశక్తిని ధారపోస్తా

(17వ పేజీ చూడుడు)



సర్దార్ పటేలుకు అభినందన గ్రంథం సమర్పిస్తున్న సందర్భంలో—సరోజినీదేవి

చెన్నపట్నంనుంచి ఢిల్లీవరకు ప్రాకిన కాంగ్రెసు 'గ్రూప్' రాజకీయాలు

చెన్నరాష్ట్రంలో కాంగ్రెస్ గ్రూప్ రాజకీయాలకు, వృద్ధాప్యంలో సర్దార్ పటేల్ చేసిన దక్షిణదేశ పర్యటనకు సంబంధం ఉన్నదని సూచిస్తూ, భారతకాంగ్రెస్ రాజకీయరంగంలో గ్రూప్ రాజకీయాలకు సూచీమంత్రంగా వెల్లడిస్తూ ఈ క్రింది వ్యాసాన్ని బొంబాయి టైమ్సు ఆఫ్ ఇండియా విలేఖరి కాండిడస్ వ్రాశాడు.

పన్నెండు సంవత్సరాల అనంతరం సర్దార్ పటేల్ చెన్నపట్నం సందర్శించడంలో పైపైకి కనిపించేదానికన్న ముఖ్యోద్దేశం మరొకటున్నది హైద్రాబాద్, చెన్నరాష్ట్రం, మైసూరు కాంగ్రెస్ పార్టీలలో గల తగాదాలను పరిష్కరించడానికే పటేల్ పర్యటన చేస్తున్నట్లు ఇప్పటికి చాలామందికి తెలిసిపోయింది

ఇలా చెప్తే కాంగ్రెస సంస్థ నిత్య వ్యవహారాలకోసమేనని కొందరు అశ్రద్ధ చూపవచ్చును కాని ఇది మామూలు వ్యవహారం కాదు

ఈ విషయమై రాష్ట్రపతి (డా॥ పట్టాభి) క్రిందటివారం ప్రకటించిన ఒక ఉత్తరువులో ఇలా హెచ్చరించారు

"మంత్రివర్గాల నిర్మాణంతో కాంగ్రెస్ సంస్థలో ఐకమత్యం, సామరస్యం చెడిపోయినట్లు అందరికీ తెలిసినదే మంత్రి పదవు లివ్వకుండా విడిచిపెట్టబడినవారు ఆ సంస్థలోనే ప్రత్యర్థివర్గాలుగా ఏర్పడారు కాంగ్రెస్‌పార్టీ అంతఃకలహాలకు పెంచుకొని ప్రభుత్వాలను బలహీనస్థితిలోకి తేవడం అంటె, అందరూ కలిసి బలం చేకూర్చుకోవడం ఇప్పుడు కర్తవ్యం"

కాంగ్రెస్ సంస్థలో విచ్ఛిన్నశక్తులు ప్రబలినాయనీ, ఉన్నతపదవుల్లో ఉన్న నాయకులు కూడా ఈ కలహాలలో పాల్గొంటున్నారనీ దేశం నలుమూలలనుంచీ సమాచారం చేరతోంది అగ్రనాయకులు కూడా తమ తమ వర్గాల్ని (గ్రూప్స్) బలపరచుకోడానికి యత్నిస్తున్నారు కాంగ్రెస్ అధిష్ఠానవర్గంలో మూలవిరాట్టయిన భారత ఉపప్రధానికి, కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డులోను స్థిరమైన అధికార పదవిద్వారా పార్టీని శాసించగల ఉన్నతాధికారం ఉన్నప్పటికీ, దక్షిణాదిని మూడుప్రాంతాల్లో ఈ చిక్కుల్ని విడతీయడానికి వారు రావలస వచ్చింది సర్దార్ పటేల్ పర్యటనలో నిర్మొహమాటంగా తన ఉద్దేశమేమిటో స్పష్టపరిచే ఉండాలి

కార్యవర్గంలో గ్రూప్‌లు

కాంగ్రెస్ కార్యవర్గంలో అప్పుడే ఒక "దక్షిణాది వర్గం" సృష్టించబడిందనీ, రాష్ట్రపతి తన కార్యదర్శులలో ఒకరి తోడ్పాటుతో స్వంతవర్గాన్ని బలపరచుకోడానికి యత్నిస్తున్నారనీ, తద్వారా నిత్యం భాషావైషమ్యాలతో అధికారసాధనకై నాలుగువర్గాలు పోటీలు పడుతున్న చెన్నరాష్ట్రంలో రాజకీయాలను ఇచ్ఛానుసారం నిర్వహించడానికి వా రిద్దరూ యత్నిస్తున్నారనీ వదంతులు వ్యాపించాయి

చెన్నరాష్ట్రంలో అరడజను గ్రూప్‌ల తాకిడికి లోనైన ప్రస్తుత మంత్రివర్గాన్ని కూలిపోకుండా కాపాడానికే సర్దార్ పటేల్ పర్యటన ఏర్పాటు చేసుకున్నారనడంలో ఎవరికీ సందేహం లేదు

ప్రస్తుత సూచనలు

గత శుక్రవారం జరిగిన పార్లమెంట్‌పార్టీ కార్యవర్గపు ఎన్నికలే దక్షిణాది రాజకీయాల్లో ముందేమి జరుగనున్నదో సూచిత వతోంది

ఈ ఎన్నికల ఫలితాలు చాలా మందికి ఆశ్చర్యం కలిగించాయి ఎన్నికలో అభ్యర్థిగా డా॥ పట్టాభిగారి పేరు మొదట ప్రతిపాదించబడినా చివరకు తొలగించబడింది రాష్ట్రపతికి కుడిచేయివంటి లాలాదేశబంధు గుప్తాగారు ఎన్నికలో ఓడిపోయారు శ్రీ శంకర్రావ్ దేవ్, శ్రీ నిజలింగప్పగార్లు కూడా ఓడిపోయారు ఈ ఎన్నికలో భాషాప్రయుక్త రాష్ట్ర విషయానికి ప్రాధాన్యత లేకపోయినా, ఆ విషయమై రాష్ట్రపతిపల్లవికి అనుపల్లవి పాడినవారే ఇద్దరూ ఏ 'గ్రూప్'కి చెందినవారో గ్రహించడం సులువే

రాష్ట్రపతి పదవిలో ప్రవేశించిన వెంటనే తన గ్రూప్ అనుయాయుల్లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస అధ్యక్షుడు రంగాగారిచే కాంగ్రెస్‌నుంచి వెళ్లగొట్టబడినవారిని తిరిగి చేర్పించారు వాస్తవానికి ఈ విధంగా కాంగ్రెస్‌నుంచి వెళ్లగొట్టబడినవారు వీరే కాక ఇతరరాష్ట్రాలలో వందలాది సభ్యు లున్నప్పటికీ వారి సంగతి రాష్ట్రపతికి ఏమీ పట్టనేలేదు రాష్ట్రపతిగా డా॥ పట్టాభి ఎన్నికతో కాంగ్రెస్ సంస్థలో చీలిక పెద్దదైపోయింది రాష్ట్రపతి వ్యవహారాల నరికట్టడానికిగాను, రంగాగారికి పోయిన ప్రతిష్ఠ పునః స్థాపించవలసిన కర్తవ్యం ఇప్పుడు ఉపప్రధానిపైన పడింది

ఇటీవల దక్షిణాదిప్రాంతాలు పర్యటన చేసివచ్చిన గవర్నర్ జనరల్ రాజాజీకి చెన్నరాష్ట్ర మంత్రివర్గరాజకీయాలతో సంబంధం ఉన్నదని చెన్నపట్నంలోని దేశభాషాపత్రికలు సూచించాయి పటేలా సంప్రతింపుల ఫలితంగా ప్రధానిపదవిగాని, శాసనసభా నాయకపదవిగాని లభిస్తుందని శ్రీ ప్రకాశంగారు ఇంకా ఆశపడుతున్నారు ఈ గ్రూప్ రాజకీయాల కల్లోలంనుంచి చెన్నరాష్ట్రాన్ని ఉద్ధరించి స్థిరమైన మంత్రివర్గాన్ని స్థాపింపచేయగలిగినట్లయితే సర్దార్ పటేల్ దృఢనిశ్చయం, చతురత, రాజనీతిజ్ఞత సార్థక మైనట్లే [ఇది అసంభవమని అప్పుడే చెన్నపట్నంలో తెల్లమైపోయింది]

దక్షిణాదిని భిన్నభాషావర్గాలు ప్రత్యేక రాష్ట్రాల్ని నిర్మించాలని కోరడానికి గల కారణాల్లో ఇదొకటి ఈ గ్రూప్‌రాజకీయాలవల్ల కాంగ్రెసు అప్రతిష్ఠపాలు గావడమే కాకుండా, మర్నాడు పదవిలో ఉంటారో లేదో అనే బెంగతోనే కాలం గడిపే మంత్రులు దేశాభ్యుదయ కార్యక్రమాలు వేనినీ కొనసాగించలేకుండా ఉన్నారు

విదేశ రాజకీయాలు

ఆస్ట్రేలియా తంత్రం, బర్మా చెంపపెట్టు

అమెరికా ఆధ్వర్యంక్రింద ఉత్తర అట్లాంటిక్ దేశాలరక్షణకు తయా రవుతున్న పాక్టు పోలికనే, తూర్పు ఆసియా, ఆస్ట్రేలియా దేశాలమధ్య, భారతదేశం నాయకత్వంకింద దేశరక్షణ నిమిత్తం సమష్టికృషి కొక పాక్టు క్రమంగా రూపొందుతున్నదని ఈమధ్య బ్రిటిష్, అమెరికన్ పత్రికలు అన్నీ వ్రాసాయి పండిట్ నెహ్రూవంటి రాజనీతిజ్ఞుడు ప్రపంచంలో లేడని కూడా వ్రాశాయి

బ్రిటిష్ పార్లమెంటులో ఏ. వి అలెగ్జాండర్ ఈమధ్య ఒక ప్రకటన చేశాడు కామన్వెల్తు దేశాలన్నీ దేశరక్షణ వ్యవహారాల్ని సహకారంతో నిర్వహించడానికిగాను, ఇదివరలో ఉన్న కామన్వెల్తు శాఖ యంత్రాంగానికి నూతన పరిస్థితుల కనుగుణంగా మెరుగు పెడుతున్నట్లు ఆప్రకటనలో తెలిపాడు ఈ సమిష్టినిర్వహణకి గత అక్టోబరులో లండన్‌లో జరిగిన కామన్వెల్తు దేశప్రధాన మంత్రుల సమావేశం పునాది వేసిం దన్నాడు

ఈ రెండూ కలిపి చదివితే ఆసియాదేశాల వ్యవహారాల్లో బ్రిటన్ పన్నుతున్న తంత్రం బోధపడుతోంది దీనికితోడు టైమ్స్ పత్రికలో ఈ క్రింది మాటలు గమనించాలి "ఈ అరాచకం (ఇండొనీషియా, బర్మాలలో అరాచకం) దృష్ట్యా, పశ్చిమదేశాలు, (బ్రిటన్ మొదలైనవి) ఇతర మిత్రదేశాలతో కలిసి, ముఖ్యంగా కామన్వెల్తు దేశాలతో కలిసి, జపాన్‌నుంచి హిందూమహాసముద్రంవరకూ సమిష్టిగా దేశరక్షణ యత్నాలు చేయాలి దేశరక్షణ వ్యవహారాలలో పశ్చిమదేశాలకు తూర్పుఆసియా ప్రధానమైన స్థావరం పసిఫిక్ ప్రాంతంలో పశ్చిమదేశాలకు ప్రత్యక్షంగా చాలా నష్టం వాటిల్లగల అవకాశం మాట అటుంచి, ఆగ్నేయాసియాలో నష్టాలవల్ల పశ్చిమయూరప్ దేశాల ఆర్థిక సౌభాగ్యానికి ప్రమాదం కలుగుతుంది అది అమెరికా దేశరక్షణ కార్యక్రమంలో అగ్రశ్రేణి వంటిది"

ఇది లండన్ టైమ్స్ అభిప్రాయం మాత్రమే కాదు బ్రిటిష్, అమెరికన్ మిలిటరీ నిపుణుల అభిప్రాయంకూడా అమెరికా రష్యాలమధ్య యుద్ధం సంభవించకముందే ఉభయదేశాలు ఇతరప్రాంతాల ఎన్నిదేశాల మైత్రిని సాధించడం సాధ్యమో ప్రయత్నిస్తున్నాయి ఈ ప్రయత్నాల్లో పద్ధతులుమాత్రం తేడా కమ్యూనిస్టుపార్టీల సహాయంతో ఆయాదేశాల్లో అరాచకం, విప్లవాలు తెచ్చి, కమ్యూనిస్టు ప్రాబల్యం హెచ్చించి ఆదేశాల్ని తన వర్గంలో చేర్చుకోడానికి రష్యా ప్రయత్నిస్తోంది అమెరికా ఆర్థిక సహాయం పేరుచెప్పి, మార్షల్ ప్రణాళిక అమలుజరిపి ఆదేశాల వ్యవహారాలను తన అదుపులోకి తెచ్చుకుంటోంది

ఉభయుల యత్నాలూ, గత యుద్ధంలో నష్టవిధ్వంసాలకు గురైన దేశాల్లో ఫలించాయి తదితరదేశాల విషయంమాత్రం ఇదమిత్థమని చెప్ప లేదు ఇప్పుడు ఉభయుల దృష్టి ఒకవైపున స్కాండినేవియా దేశాలపైనా, మరొకవైపున బర్మా భారతదేశాలవైపునా మరలాయి

పశ్చిమ యూరప్‌లో అమెరికా ఆధిపత్యంకింద యూరప్ కూటమి బలపడింది తత్ఫలితంగా పశ్చిమ యూరప్ పార్లమెంట్ ఒకటి గత వారం చర్చిల్ చేత ప్రారంభించబడింది

ఇండొనీషియాసమస్యను పురస్కరించుకొని, బర్మా సూచనపై, భారతప్రభుత్వం ఆసియా ప్రభుత్వాల సమావేశం జరిపింది ఈ సమావేశాన్నీ, నెహ్రూ నాయకత్వాన్నీ బ్రిటిష్ అమెరికన్ పత్రికలు అమోఘంగా ప్రశంసించాయి

ఇప్పుడు బర్మాలో పరిస్థితి అన్ని దేశాలకీ ఆందోళన కలిగించింది బ్రిటన్ సూచనపైన, ఆస్ట్రేలియా భారతదేశాన్ని కోరినందుకు ఫలితంగా, బర్మాసమస్యపైన ఇటీవల ఢిల్లీలో నాలుగు కామన్వెల్తుప్రభుత్వాలు సమావేశం జరిపాయి దీనితో బ్రిటన్ ఎత్తులు అందరికీ తెలిశాయి బర్మా సహాయానికి ఇతర ఆసియా దేశా లెందుకు ఆతురపడలేదు? ఢిల్లీసమావేశం గురించి ఇతర ఆసియాదేశాల్లో ఒక్క నాయకుడుగాని, ఒక్క పత్రికగాని ఒక్కమాటైనా ఎందుకు చెప్పలేదు? ఆసియాదేశాల ఆర్థికబలహీనత నాధారంగా తీసుకుని, కామన్వెల్తు యంత్రాంగంసహాయంతో తూర్పుఆసియాల రక్షణని పశ్చిమయూరప్‌రాజ్య కూటమి ఆధ్వర్యంలోకి తేవాలని బ్రిటన్ అమెరికాలు యత్నిస్తున్నాయి ఇందుకుగాను ఆస్ట్రేలియాకు భారతదేశంపట్ల ఎన్నడూ లేని గౌరవాదరాలు ప్రభవించాయి

ఈ ఆదరం అంటే ఏమిటో భారతదేశానికి అనుభవమే ఆర్థికంగా ఆసియాదేశాలన్నీ నిత్యం యూరప్ అమెరికాలపైనే ఆధారపడి ఉంటే, ఆసియాసహజసంపదతో వారు తమ ధనాగారాలు నింపుకోవచ్చును దేశరక్షణవ్యవహారాల్లో ఆసియాదేశాలు వారికి చక్కగా ఉపకరిస్తాయి ఆసియాదేశాల్లో రణరంగాలు సృష్టిస్తే, యూరప్‌లో వారికి కొంత ఒత్తిడి తగ్గుతుంది చీనా నష్టపోయినందువల్ల అమెరికాకు ఆసియాలో అత్యవసరమైన మిలిటరీ స్థావరాలు లభిస్తాయి

భారతదేశాన్ని విభజన చేసినందుకు ఫలితం ఆర్థికంగా క్రమక్రమంగా బోధపడుతోంది ఆహారానికి అమెరికామీద, ఇతరదేశాలమీద ఇప్పుడు ఆధారపడవలసి వస్తోంది మనదేశంలో ప్రత్తిపంట మనవస్త్రపరిశ్రమకి చాలకుండాపోయింది నారవర్తకంలో మన బలం తగ్గిపోయింది ఇంక పాకీస్తాన్ భారతదేశాల సైన్యవృద్ధిఖర్చులు తడిసి మోపెడౌతున్నాయి

ఈరీతిగానే బర్మానికూడా వారి అదుపులోకి తెచ్చుకుంటే, పెట్రోల్, బియ్యం కలప బ్రిటన్ అమెరికాలకి చాలా ఉపకరిస్తాయి

బర్మా కామన్వెల్తునుంచి విడిపడిపోవడం వివేకమైనది కాదని చెప్తూ, తిరిగి ఎప్పటికైనా చేరుతుందనే ఆశను ఆస్ట్రేలియావిదేశాంగ మంత్రి ఇవాట్ ఢిల్లీలో ప్రకటించాడు. దీని అర్థం వెంటనే బర్మా కామన్వెల్తులో చేరితే బ్రిటన్ ఆర్థికంగా సహాయం చెయ్యడమే కాకుండా, మిలిటరీ సహాయంకూడా ఇవ్వదలదని చెప్పడం బర్మా కామన్వెల్తులో సామాన్యంగా చేరదు బ్రిటిష్‌వారు భారతదేశంలో "హిందూముస్లిం" సఖ్యతకు ఎంత పాటుపడ్డారో, కాంగ్రెస్—లీగ్ పార్టీలమధ్య సమాధానంకోసం ఎంత కృషి చేశారో, అంతా బర్మాలో చెయ్యగలిగితే, రాజకీయ స్వాతంత్ర్యం పొందిన బర్మా, కృతజ్ఞతతో కామన్వెల్తులో చేరడానికి సిద్ధపడుతుంది

ఈ ఉద్దేశంతో బర్మాలో ప్రభుత్వానికీ కరెన్ విప్లవకారులకీ మధ్య సామరస్యం చేకూర్చడానికి కామన్వెల్తుదేశాలు ఒక సామరస్య సంఘాన్ని పంపగలవని బర్మా ప్రభుత్వానికి తెలియజేశాయి ఇది ఢిల్లీసమావేశఫలితం దీనికి పండిట్ నెహ్రూ ఎంత సుముఖంగా ఉన్నారో తెలుసుకోవలసిన విషయమే కాని బర్మా సమాధానం బ్రిటన్ ఆస్ట్రేలియాలకు చెంపపెట్టుగా వచ్చింది

బ్రిటిష్ పరిపాలకులు బర్మావిడిచిపోయే ముందు కరెన్లని తిరుగుబాటుకు పురికొల్పి మరీ వెళ్లారని ఇదివరలోనే తెలిసివచ్చింది బర్మాలో కరెనీస్తాన్ సృష్టించబడితే, ఇంక బర్మా గతి ఏమవుతుందో బర్మాప్రధాని థాకిన్‌నూకు బాగా తెలుసును కరెన్లకు ప్రత్యేకరాష్ట్రం ఇవ్వడానికి సిద్ధమేగాని, దేశాన్ని విభజించడానికి థాకిన్‌నూ సంసిద్ధుడు కాలేదు బ్రిటన్ ఆస్ట్రేలియాలు చెయ్యగలిగేది ఇంతమాత్రమేనని తెలుసును.

కమ్యూనిస్టు ప్రమాదాన్నీ కరెన్ల ప్రమాదాన్నీ స్వయంగా ఎదిరించి జయమో పరాజయమో పొందడమే మంచిది దేశం ముక్కచెక్కలై పోదు

అందువల్ల భారతదేశప్రభుత్వం బర్మాలో సామరస్యానికి కృషి చెయ్యడానికి యత్నిస్తే అభ్యంతరం లేదుకాని, బ్రిటన్ ఆస్ట్రేలియాలు జోక్యం చేసుకోనవసరం లేదని థాకిన్‌నూ స్పష్టంగా చెప్పాడు

యూరోపియన్ పార్లమెంట్

చర్చిల్ కలలోగన్న యూరోపియన్ దేశాల ఐక్యత ఒక విధంగా రూపం పొందుతోందని చెప్పవచ్చును కాని రష్యాతో విరోధం పశ్చిమదేశాలమధ్య ఐక్యతను తాత్కాలికంగా తెచ్చిపెట్టింది ఇటీవల చర్చిల్‌చే ప్రారంభించబడిన ఐక్యయూరప్ ఉద్యమ సంస్థకు ఇంతకు మించి మరే ప్రాధాన్యతా లేదు ఈ సంస్థ బ్రసెల్స్‌లో ఫిబ్రవరి ఆఖరునా మార్చి అరంభంలోనూ సమావేశమై, యూరోపియన్ పార్లమెంట్ స్థాపనకు

(17-వ పేజీ చూడుడు)

భారతదేశ విషయాలు

పుట్టకముందే భగ్నమయిన సాయుధ విప్లవం

కమ్యూనిస్టుల సాయుధ విప్లవ యత్నం పుట్టుకలోనే భగ్నమయింది. ఈ మార్చి నెలలో దేశమంతటా సమ్మెలు జరిపి, రాకపోకలు అరికట్టి దౌర్జన్యంగా దేశంలో కల్లోలం లేవతీయాలని కమ్యూనిస్టులు ప్రయత్నించారు

ముందు రైల్వే సమ్మె, తరువాత తంతి, తపాలా శాఖల్లో సమ్మె, ఆపైన ఓడరేవుల్లో, నీటిసప్లై శాఖల్లో సమ్మెలు జరపడానికి కుట్ర పన్నారు సమ్మెలో పాల్గొనని కార్మికుల్ని బెదిరించి బలవంతంగా సమ్మెలు చేయించడానికీ ఆలోచించారు కార్మికుల్ని, ప్రజల్ని బెదిరించడానికీ, ప్రజల్లో భీతి వ్యాపింపచెయ్యడానికి దౌర్జన్యవిధానం అవలంబించాలనుకున్నారు

ఇప్పుడు కమ్యూనిస్టుపార్టీ అధీనంలో కొల్లగొట్టబడినధనం, రహస్యంగానూ, దోపిళ్లద్వారానూ చేర్చిన ఆయుధసామగ్రి అపారంగా ఉన్నట్లు అందరికీ తెలిసిందే హైద్రాబాదులో రజాకార్లకు లాయక్ అలీ ప్రభుత్వం సప్లై చేసిన ఇటాలియన్ తుపాకులు, చేతిబాంబులు చాలా కమ్యూనిస్టులచేతుల్లో పడ్డాయి రజాకార్లలో తప్పించుకో గలిగిన వారంతా కమ్యూనిస్టులతో చేరి పనిచేస్తున్నట్లు నల్లగొండ, వరంగల్ జిల్లాలలో ప్రజలు చెప్తున్నారు

కమ్యూనిస్టులవద్ద ఉన్న ఆయుధ సామగ్రిలో దాదాపు సగం బెంగాల్‌లో కమ్యూనిస్టుపార్టీ అధీనంలో ఉంది బెంగాల్, అస్సాం సరిహద్దులలో రహస్యంగా బర్మా, పాకీస్తాన్, భూటాన్ దేశాలనుంచి ఆయుధాలు, మందు గుండుసామగ్రి కమ్యూనిస్టులకు రవానా అయినాయి బెంగాల్‌లో ఎప్పుడు కలహాలు వచ్చినా చేతిబాంబులు, తుపాకులు వదగ్గా వాడేస్తున్నారు

అక్కడ పరిస్థితి మరీ విషమించిందని తెలిసి పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కమ్యూనిస్టుపార్టీని నిషేధించింది

ఇప్పుడు తూర్పు ఆసియా దేశాల్లో కమ్యూనిస్టులు కల్లోలం, అరాచకం రెచ్చగొట్టగలిగారు చీనాలో కమ్యూనిస్టులకు విజయం లభించినట్లే బర్మాలో అల్పసంఖ్యాకవర్గాల అసంతృప్తిని అవకాశంగా తీసుకుని దేశం అంతటా అరాచకం తెచ్చిపెట్టారు

మలయాలో బ్రిటిష్‌పాలకులు అణచివేసినా కమ్యూనిస్టులు ప్రస్తుతానికి దాగిఉండి తరుణంకోసం వేచి ఉన్నారు వియత్‌నాంలో జాతీయబలాలతో కలిసి ఫ్రెంచి పరిపాలకుల నెదిరించారు ఇప్పుడు ఫ్రెంచి సైన్యాలు వీరి బలాల్ని ఎదిరించలేని స్థితిలో ఉండె, 'ఎప్పుడు స్వదేశం వెడదామా' అని ఎదురు చూస్తున్నాయి

చీనా కమ్యూనిస్టుల సహాయంతో వియత్‌నాం కమ్యూనిస్టులు స్థావరం చిక్కించుకున్నారనే చెప్పవచ్చును ఇండోనీషియాలో రిపబ్లిక్ సైన్యాలు అతి కష్టం పైన కమ్యూనిస్టు విప్లవకారులను తాత్కాలికంగా అణచివేయగలిగాయి ఇంక తూర్పుఆసియాలో కమ్యూనిస్టు కల్లోలానికి లొంగకుండా భారతదేశం, పాకిస్తాన్, సయాందేశాలు మాత్రం మిగిలాయి

తూర్పుఆసియా అంతటా ఒక్కసారిగా కమ్యూనిస్టులు ప్రాబల్యం సాధించాలని యత్నిస్తున్నారు కాని భారతదేశంలో జాతీయవర్గం ఇంకా దుర్జేయంగానే ఉందని కమ్యూనిస్టులకి తెలియకపోదు కార్మికోద్యమం మనదేశంలో అతివేగంగా బలపడుతోంది ఈ కార్మిక సంస్థల్ని వెంటనే హస్తగతం చేసుకోకపోతే ఇంక ఎన్నటికీ ముక్తిలేదని కమ్యూనిస్టుల ఆత్రుత అందువల్ల దేశంలో పరిస్థితులు కమ్యూనిస్టు వాదం ప్రకారం అనువుగా ఉండకపోయినా, ఆత్మవినాశకరమైన యత్నానికి దిగారు. జాతీయ వ్యవహారాల్లో కమ్యూనిస్టుపార్టీ విధానం ప్రజలకు తీవ్ర అసంతృప్తి కలిగించింది ఇది కాక కార్మికోద్యమంలో నాయకత్వానికి సోషలిస్టుపార్టీ, కాంగ్రెస్ కూడా పోటీచేస్తున్నాయి ఇతర ఆసియా దేశాల్లో కార్మికోద్యమం భారతదేశంలో పాటిలేదు యుద్ధానంతరం ఆ దేశాల్లో ఏర్పడిన అరాచక పరిస్థితుల్ని అవకాశంగా గ్రహించి కమ్యూనిస్టులు చిత్తం వచ్చినట్లు వెలరేగుతున్నారు కాని మనదేశంలో పై హేతువుల వల్ల వీలు కాలేదు

నెహ్రూ ప్రభుత్వం ముందే కన్ను తెరిచింది కార్మికుల హితం కోరుతున్నట్లు ప్రకటిస్తూ సమ్మెలను దౌర్జన్యవాదాన్ని సహించబోరని హెచ్చరించారు దేశమంతటా దాదాపు 900 మంది కమ్యూనిస్టుల్ని అరెస్టు చేశారు ముందు మేలుకోవడానికి కమ్యూనిస్టుల తొందరే హేతువయింది దగ్గర ఆయుధసామగ్రి ఉన్నదని ప్రభుత్వాన్ని ప్రజల్ని బెదరించడానికిగాను అవసరం లేకపోయినా వీధుల్లో బాంబులు విసిరి తుపాకులు పేల్చారు కలకత్తా వద్ద ఆయుధసామగ్రి సేకరించడానికి దుస్సాహసానికి దిగారు కాని వారి యత్నాలన్నీ విఫలమైపోయాయి పండిట్ నెహ్రూ పండం దౌర్జన్యానికి విప్లవకమ్యూనిస్టుపార్టీ సభ్యులు కారకులని పార్లమెంటులో ప్రకటించారు

ఈ కొత్త కమ్యూనిస్టుపార్టీ కలకత్తాలో 1945 లో స్థాపించబడింది జాతీయ వ్యవహారాల్లో కమ్యూనిస్టుల విధానంవల్ల అసంతృప్తి చెందినవారూ, మాస్కో యాజమాన్యం సహించనివారూ కలిసి ఈ పార్టీని మొదట స్థాపించారు అయితే వీరుకూడా దౌర్జన్యవాదాన్నే అనుసరిస్తారు కార్మికవిప్లవమే వీరికీ లక్ష్యం వీరి నాయకుడు సౌమ్యేంద్రనాథ ఠాకూర్ కాని కమ్యూనిస్టుపార్టీ సహజ చాతుర్యం చూపించి, తన అనుచరుల్నే అందులో చేర్పించి ఆ పార్టీని భగ్నపరిచింది భగ్నపరిచినా పైకి అది శత్రుపక్షమేనని చెప్తూ ఆ పార్టీద్వారా కూడా తన విధానం అనుసరించడం ఆరంభించింది అందువల్ల దండం దౌర్జన్యానికి అసలు కారకులు కమ్యూనిస్టులే

కాంగ్రెస్‌లో కమ్యూనిస్టులు

కృష్ణా జిల్లాలోనూ, హైదరాబాద్ సరిహద్దులోనూ కమ్యూనిస్టుల దౌర్జన్యాల్ని, వారు రెచ్చగొడుతున్న అరాజకాన్ని మద్రాసు ప్రభుత్వం అణచివేయగలిగిందని ప్రధాని రామస్వామిరెడ్డిగారు శాసనసభలో ప్రకటిస్తూ, కృష్ణా జిల్లాలో, కమ్యూనిస్టుల ప్రాబల్యానికి కాంగ్రెస్ వాదుల అంతఃకలహాలే హేతువని నిర్మొహమాటంగా చెప్పేశారు అయితే కాంగ్రెస్‌లో అంతఃకలహాలకీ విరోధాలకీ హేతువేమిటి? మంత్రివర్గ రాజకీయాలేనని ప్రతివారికీ వెంటనే తట్టే సమాధానం అందువల్ల ఈ మంత్రివర్గ రాజకీయాలనించి 'ముక్తి కలిగితేనే దేశాన్ని కమ్యూనిస్టు ముప్పునించే కాదు, ఆర్థిక సమస్యలనించికూడా కాపాడ్డానికి సాధ్యపడుతుంది లేనిపక్షంలో కమ్యూనిస్టు ముప్పుమాట అల్లావుంచి ఆహారాది సమస్యల్ని ఎన్నడూ పరిష్కరించలేరు కాని మన రాష్ట్రమే కాదు, అన్ని రాష్ట్రాలకీ పట్టిన ఈ జాడ్యం వొదిలేది కాదని అందరికీ తెలిసినదే ఈ రాజకీయాలే వొదిత్తే, రామస్వామిరెడ్డి ప్రభృతులకు మంత్రిపదవుల్లో స్థానం లభించదు దేశసమస్యల్ని గ్రహించగలవారికీ సమర్థులైనవారికి అవకాశం లభించి ఉండేది

కాంగ్రెస్‌లో కమ్యూనిస్టులు చేరినట్లు కూడా రామస్వామిరెడ్డిగారు చెప్పారు మంత్రివర్గ రాజకీయాల్ని, కమ్యూనిస్టులపై ప్రభుత్వదాడినీ అవకాశాలుగా తీసుకుని కొందరు కాంగ్రెస్‌వాదులు ప్రత్యర్థి కాంగ్రెస్ వర్గంలోనివారిని నానాపాట్లుపాలు చేశారని అందరూ చెప్పుకున్నారు విరోధులు కాంగ్రెస్ అన్నివర్గాలవారూ అంగీకరించారు అయితే ఆపని వారు చేశారని వీరూ, వీరు చేశారని వారూ చెప్తున్నారు

కాంగ్రెస్‌వాదులు, శాసనసభ్యులు కమ్యూనిస్టు అరాజకాన్ని అరికట్టడానికి కృషి చెయ్యవలసిందే కాని స్వపక్షం అధికారంలో ఉన్నదికదా అని పోలీసుబలం సహాయముతో కాంగ్రెస్‌వాదులు కమ్యూనిస్టులపై దాడి చెయ్యడం నీతికరమైనది కాదు రాజకీయ పక్షాలు ఇటువంటి పద్ధతుల నవలంబించినది యుద్ధానికి పూర్వం ఫాసిస్టుదేశాల్లో మాత్రమే అందువలన ఇటువంటి నిందకు అవకాశ మివ్వకుండా, కేవలం పార్టీ ఆశయాలపైన, ప్రచారబలంపైన మాత్రమే ఆధారపడి, ప్రజల్లో ప్రచారానికి అధికశ్రద్ధ చూపిమాత్రమే కమ్యూనిస్టు వ్యాప్తి నరికట్టాలిగాని, పోలీసుబలం సహాయం తీసుకోవడం కాంగ్రెస్ ప్రతిష్ఠకే, ప్రజల స్వేచ్ఛా జీవనానికీ కూడా భంగం కలుగుతుంది ప్రజాసామ్యనీతి కనుగుణంగా కాంగ్రెస్ దేశాన్ని పరిపాలించాలంటే ప్రజల స్వేచ్ఛా జీవనంలో, అనగా వర్తక వాణిజ్యాలు, పౌరనీతి ప్రచారం, అనధికారవ్యవహారాలలో కాంగ్రెస్ అన్యపక్షాలతో సమానంగా ప్రవర్తించాలేగాని, పరిపాలనాధికారాన్ని ప్రయోగించకూడదు పరిపాలనాధికారాన్ని ప్రయోగించవలసినది ప్రభుత్వశాఖలు మాత్రమే ప్రభుత్వం గమనింపుకు తేవలసిన విషయాలుంటే, వానిని శాసనసభలోనూ, కాంగ్రెస్ కమిటీలద్వారానూ పత్రికల ద్వారానూ తేవలసిందేగాని మంత్రుల మైత్రిని వీనికి వినియోగపరచడం అధికార దుర్వినియోగం క్రిందకే వస్తుంది

కాంగ్రెస్ మంత్రులు ఈ విషయాలలో అప్రమత్తతతో వ్యవహరిస్తేగాని పరిస్థితులు చక్కబడవు ఇంతవరకూ కాంగ్రెస్‌వాదులు, మంత్రుల వర్తన దీనికి విరుద్ధంగా ఉండడం వల్లనూ, కాంగ్రెస్‌లో విరోధవర్గాలపైనకూడ ఈ పద్ధతులు ప్రయోగించడంవల్లనూ పరిస్థితులు విషమించాయి కాంగ్రెస్‌వాదుల్లో విభేదాలను కమ్యూనిస్టులు అవకాశంగా తీసుకున్నమాట నిజమే కాని సామాన్యప్రజల స్థితిగతులను కాంగ్రెస్ ప్రభుత్వం, శాసనసభ్యులు గమనించడం లేదని ప్రజలు భావించడానికి వీలిచ్చారు

ప్రజల్లో అసంతృప్తి లేనిదే కమ్యూనిస్టులు వ్యాపించడానికి అవకాశమే లేదు ఈ అసంతృప్తిని తొలగించడానికి ఉన్నపట్టున ఆహార సమస్య మొదలైనవానిని పరిష్కరించమని ఎవ్వరూ చెప్పరు కాని ప్రభుత్వం ఏమి చేస్తున్నదో, కాంగ్రెస్‌పక్షం ఎటువంటి సాంఘికోద్యమాలను, ఆర్థికోద్యమాలను నడుపుతున్నదో ప్రజలకెల్లా తెలుస్తుంది? చేసినది, సాధించగలిగినది ఏమైనా ఉంటే ప్రచారం అవసరం లేదు. ప్రజలే గ్రహించగలరు కాని పరిస్థితులు దుష్కరంగా ఉన్నప్పుడు ప్రచారం చెయ్యవలసి ఉంటుంది ఏమి చేస్తున్నారో ఏమి చేయదలిచారో ప్రజలకి తెలియాలి నిత్యం వర్గవిరోధాల్లో మునిగి తేలడం తప్ప ప్రజల స్థితిగతుల్ని కాంగ్రెస్ కమిటీలు గమనించడం లేదనీ, నిర్మాణ కార్యక్రమాల్ని పూర్తిగా విసర్జించాయనీ ప్రజలు అనుమానిస్తున్నారు ఈ అనుమానాన్ని తొలగించవలసిన కర్తవ్యం కాంగ్రెస్‌వాదులపైన ఉంది కాంగ్రెస్‌వాదులు అధికారాన్ని దుర్వినియోగం చెయ్యడం లేదని నిరూపించవలసిన కర్తవ్యం మంత్రివర్గంపైన ఉంది ప్రజల్లో తిరిగి విశ్వాసం కలిగితేగాని కమ్యూనిస్టుప్రమాదం, ఇప్పుడు కొంత తప్పినా ముందైనా తప్పదు

రామపాదసాగరం

రామపాదసాగర ప్రాజెక్టు సాగరగర్భంలో కలిసిపోయినట్లు ప్రభుత్వం ఇప్పటికి జంకు లేకుండా స్పష్టంగా ప్రకటించగలిగింది ఇది ఇలా అయిందని అందరూ అనుమానించినదే కాని మద్రాసుప్రభుత్వం ప్రజల్లో అసంతృప్తివారైనా కమ్యూనిస్టులంటూ పితూరీచేసి వారిని అరెస్టు చేయించాదు వారి ఇళ్లు సోదాలు చేయించారు. వారినీ వారిబంధువుల్నీ పోలీసులచేత కొట్టించారు ఈ విషయాల్ని కాంగ్రెస్‌లో విరోధభావం కలుగుతుందేమో అనే భీతి కొద్దీ ఇంతవరకూ "అల్లే మేం తోసిపుచ్చుతామా, ఎప్పటికీ అల్లా చెయ్యం" అంటూ వచ్చారు. పరిస్థితులన్నీ అనుకూలంగా మారినాయికాబట్టీ, కేంద్రప్రభుత్వమే నింద భరించడానికి సిద్ధమయిందికాబట్టి, ఇప్పటికి ప్రాజెక్టు నిర్మాణం వీలుపడదనేమాట బయటపడనిచ్చారు

ఈ మాట ఇదివరకు తెలియకపోదు మన తెలుగు మంత్రు లందరికీ తెలిసినదే 'అయినా తప్పకుండా ప్రాజెక్టు తెచ్చితీరతాం' అనిరన్నారు నిర్మించకూడదన్న తెలుగు మంత్రులు లేకపోలేదు కాని గట్టిగా అనడానికి వెరిచారు వీరి అండ ఉండగా, తదితరులు మౌనం వహించగలరని నమ్మకం ఉండగా, ఇంక ఈ ప్రాజెక్టువ్యవహారాల్ని చిత్తం వచ్చినట్లు నడిపించడానికి భక్తవత్సలంగారికి అవకాశం చిక్కింది

స్మారకచిహ్నమా? సమాధా?

రామపాదసాగరానికి పునాది పడితే ఆంధ్రులంతా భక్తవత్సలంగారికే శాశ్వతకాలం కృతజ్ఞులై ఉండాలనీ, వారికి స్మారకచిహ్నంకూడా కట్టుకోవలసి ఉంటుందనీ, మంత్రిగా ఉండగా కళా వెంకట్రావుగారన్నారు ఇప్పుడు భక్తవత్సలంగారు! రామపాదసాగరాన్ని సమాధి చేశారు అయితే ఇంతలో ప్రాజెక్టునిర్మాణయత్నం ఇంక జరగదని చెప్పడం గాదు ఆంధ్రరాష్ట్రం విడిపడేలోగా, సంయుక్త చెన్నరాష్ట్రం ఈ ప్రాజెక్టును నిర్మించలేకుండా చేయగలిగారు

పాల్గాటు ఇరిగేషన్ కార్యక్రమాన్ని నిర్ణయించడంలోనూ, బడ్జెట్‌లో లెక్కగట్టడంలోనూ రాష్ట్రప్రభుత్వం శాసనసభ్యుల్ని ఎలా కన్నుగప్పి వర్తిస్తోందో, కిందటివారం మద్రాసు అసెంబ్లీ బడ్జెట్‌చర్చలో కరంత్‌గారు విమర్శించారు ఈ విషయాల్ని గమనిస్తే మన రామపాదసాగరాన్ని "నిర్మిస్తున్నాం నిర్మిస్తున్నాం" అని చెప్తూనే భక్తవత్సలంగారు ఎంత చక్కగా, తెలివిగా బుట్ట దాఖలు చేయగలిగారో తెలుస్తుంది పరిశోధన పేరుచెప్పి కొన్ని లక్షల రూపాయల ధనం వెచ్చించారు జనం ఎంత ఆందోళన చేసినా అధికారరీత్యా స్పష్టంగా ప్రాజెక్టు పరిశీలనకు శాంక్షన్ ఇవ్వలేదు.

కేంద్రప్రభుత్వాన్ని ఎన్నిసార్లు అడిగినా రాష్ట్రప్రభుత్వం మమ్మల్నింకా కోరనే లేదని చెప్పేవారు రామపాదసాగరం విషయమై కొండరి రామమూర్తిగారు, రంగాగారు, ప్రకాశంగారు కేంద్రప్రభుత్వమంత్రులతో అనేక పర్యాయాలు ప్రసంగించారు రాష్ట్రప్రభుత్వం కార్యక్రమప్రతిపాదనలు, సూచనలు సమగ్రంగా తయారుచేసి, సవ్యంగా కేంద్రప్రభుత్వానికి పంపిస్తే, తప్పక ప్రాజెక్టు నిర్వహణకు సగం ఖర్చయినా భరించగలరని కేంద్రప్రభుత్వమంత్రులు వారికి వాగ్దానాలిచ్చారు కొంత కేంద్రప్రభుత్వం ఒత్తిడిపైనే, అమెరికన్ బ్రిటిష్ ఇంజనీర్లను రాష్ట్రప్రభుత్వం పిలిపించి పరిశీలింపచేశారు పాపం భక్తవత్సలంగారు ఆశించినట్లుగా 'ఈ ప్రాజెక్టు సాధ్యం' కాదు అనైనా వారు చెప్పలేదు. అల్లా చెప్తే వీరికే బాధ ఉండేది కాదు అప్పుడే సాగరంగర్భంలో కలిసిపోయేది "పంపుతున్నాం పంపుతున్నాం" అంటూ 1948 సంవత్సరాంతంవరకూ పంపనే లేదు అప్పటికి కేంద్రప్రభుత్వం ఇతర స్కీములన్నిటినీ పరిశీలించి, పని ప్రారంభం చేసింది ఆపైన ఇంత పెద్దస్కీముని మళ్లీ ఎల్లా నెత్తిపైన వేసుకోగలరు? ఈ తరుణంలో, మనం గట్టిగా అడిగితే ఇన్‌ఫ్లేషన్ అని ఒకరూ, (దుర్) భాషావాదం అని ఒకరూ, ప్రాజెక్టుని ఆంధ్రరాష్ట్ర రాజకీయాల్లో దింపుతారేం అని ఒకరూ కన్నెర్ర చేస్తారు

ఈ రామపాదసాగరం గురించి తెలుగువారంతా ఒకటై అల్లరిచేస్తే, శాసనసభ్యులమతులేమి మార్తాయో అనే భయంకొద్దీ, పూర్తిగా రాయలసీమ తెలుగువాడు కాదనిపించుకునేవారొకరూ, రాయలసీమవారు కాకపోయినా నేనూ రాయలసీమే అనే వారొకరూ కలిసి ప్రాజెక్టుపట్ల రాయలసీమవారిలో విరోధభావం కల్పించయత్నించి, లేనిపోని పోటీలు తెచ్చిపెట్టారు

(21 వ పేజీ చూడుడు)

భారతప్రభుత్వపు ఆయ వ్యయాలు, ఆర్థికవిధానం

పన్నుల విధానం వస్తూత్పత్తి వృద్ధికి తోడ్పడుతుందని ఆర్థికమంత్రి అంచనా

తపాలాకీ, బట్టలకీ, మోటారు ప్రయాణాలకీ, వక్కలకీ, పంచదారకీ ఖర్చు తగ్గించుకుని మా స్మాల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు కొనండి అని భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రి డా॥ జాన్ మత్తయ్‌గారు జనానికి ఉపదేశిస్తూ ఈ సంవత్సరం బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రతిపాదించారు

దేశంలో వస్తూత్పత్తిని వృద్ధిపరచడం, పరిశ్రమల్ని ప్రోత్సహించడం, జనసామాన్యం ధనాన్ని వ్యయపరచకుండా నిలవవేసుకొనేటట్లు వస్తువుల ధరలు పెంచడం-ఇవి ఈ సంవత్సరపు బడ్జెట్ తయారీ సమయంలో ప్రభుత్వం దృష్టిలో పెట్టుకున్న ముఖ్యోద్దేశాలు దేశంలో ధరల పెరుగుదలకు కారణం వస్తువుల కొరతే నని డా॥ మత్తయ్ చెప్పారు అందువల్ల ఇంక ఇప్పటి ధరలు ఎలా ఉన్నా, వస్తువుల ఉత్పత్తి వృద్ధి అయితే చాలు, పరిస్థితి చక్కబడుతుందన్నారు వస్తూత్పత్తి వృద్ధిపరచాలంటే పెట్టుబడిదారులికి కొంత ప్రోత్సాహం ఇవ్వాలి అంటే వారి లాభాల్ని పన్నులద్వారా అంతగా గుంజుకోకూడదన్నమాట పరిశ్రమల యజమానులికి, పెట్టుబడిదారులికి కొన్ని పన్నులు రద్దుపరిచినందువల్ల ఆదాయంలో రు 5 కోట్ల 35 లక్షలు లోపం వస్తుంది ఇదిగాక అసలు ఆదాయవ్యయాల్లో, వ్యయం ఆదాయంకంటె రు 14 కోట్ల 79 లక్షలు అధికంగా ఉంది

ధరలు చెలరేగిపోయి, సామాన్యజనుల ఆర్థికస్థితి దుర్ఘటంగా ఉన్న ఈ రోజుల్లో ప్రభుత్వాల బడ్జెట్లలో మిగులుండాలిగాని తరుగులుండకూడదని కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు కూడబలుక్కున్నాయి

అయితే యు పి సహా ఏ రాష్ట్రానికీ మిగులు బడ్జెట్ లేకపోయింది కేంద్రప్రభుత్వానికి లేకపోయింది దీనికి కారణం ప్రభుత్వాలపైన పడిన అనేక కొత్త ఖర్చులే అందువల్ల ఉన్న పన్నులు కొన్నిటిని హెచ్చించీ, లేని పన్నులు సృష్టించీ ప్రభుత్వాలు దాదాపు ఖర్చులకు సరిపోయేవింగా ఆదాయాలు పెంచుకున్నాయి ఆదాయాలు పెంచుకోడానికి అనేకరకాల పన్నులు వచ్చాయి ఉన్నవి పెరిగిపోయాయి తెల్లవారి లేస్తే తిరిగి పడుకునేవరకూ మనకి అవసరమైన ప్రతివస్తువుపైనా, ప్రతివ్యాపకంపైనా పన్నులు వచ్చేశాయి ఎన్నడూ లేంది మన రాష్ట్రంలో మిర్చి బంగాళాదుంప ఉద్యోగాలపైన కూడా పన్ను పడింది వేరుశనగ రైతులకిమాత్రం పుణ్యాన పుచ్చింది అమెరికాలోనూ యూరప్‌లోనూ జనం కోటు జేబుల్లో వేరుశెనక్కాయలుపోసుకుని ఎక్కడబడితే అక్కడ నములుతూ తిరగడం అలవాటు చేసుకుంటున్నారుగదా అనీ, మన వాలాజీ నూనెకి కూడా ఆ దేశాల్లో గిరాకీ తగిలింది గదా అనీ మనం లాభాలు గుంజుకోనబోతే, పూర్వం ఈ లాగు ఎరిగిన బ్రిటిష్ వర్తకులు ఇప్పుడు మనకి పోటీగా ఆఫ్రికాలోనూ మలయాలోనూ వేరుశెనగ పండిస్తున్నారు అందుకని మన వర్తకం నిలబెట్టుకోడానికి ప్రభుత్వం నూనెగింజలు, నూనెలపైన ఎగుమతిపన్నులు రద్దుపరుస్తోంది

ఇదంతా బాగానే ఉంది పెట్టుబడిదార్లకి అయిదున్నరకోట్ల రూపాయల లాభం వారికే ఉండనివ్వవచ్చును కాని సామాన్యప్రజలకి ఈ పన్ను లెక్కువచేస్తే వస్తువుల ధరలు ఇంకా

ఆయవ్యయాల అంచనాలు

	1948-49 అసలు అంచనాలు (కోట్లు, లక్షలు)	1948-49 సవరించబడిన అంచనాలు (కోట్లు, లక్షలు)	1949-50 అంచనాలు (కోట్లు, లక్షలు)
ఆదాయం	255 24	338 32	328 33
ఖర్చు	257 38	339 87	327 88
పోగా	తరుగు 2 14	తరుగు 1 55	మిగులు .45

ఇతర వివరాలు

ఆదాయం	మొత్తం	327 88
కొత్తపన్నులవల్ల వచ్చేది		+20 59
పన్నుల రద్దులవల్ల లోటు		— 5 35
ఎగుమతి దిగుమతి పన్నులు		107 25
ఎక్సైజ్ పన్నులు		57 75
ఆదాయపుపన్ను		155 00
తంతి తపాలా		1 63
రైల్వే		4 72
ఖర్చులు.	మొత్తం	327 88
(ఏ) సివిల్	మొత్తం	165 16
ఇందులో 1. ఆహారంనిమిత్తం		32 97
2 కాందిశీకులకు		9 85
3 అభివృద్ధి ప్రణాళికలు		12 83
4 విద్య, వైద్యం మొదలైనవానికి		112 34
5 ప్రభుత్వోద్యోగులు వగైరా		28 89
(బి) పెట్టుబడిఖర్చు		62.12
ఇందులో 1 కాందిశీకులకు ఋణాలు వగైరా		23 27
2 అభివృద్ధిప్రణాళికలు		47 80
3 రాష్ట్రాలకు ధనసహాయం, ఋణాలు		75 00
(సి) దేశరక్షణకి		157 37
ఇందులో 1 నౌకాదళానికి		2 79
2 విమానదళానికి		4 97
3 పదాతిదళానికి		7.24

[పైన సూచించినవి ప్రధానమైనవి కొన్నిమాత్రమే]



జాన్ మత్తాయ్

మితిమీరిపోతాయే అని ప్రొఫెసర్ వకీల్ మొదలైనవారు ఆక్షేపిస్తున్నారు తపాలాధరలు పెంచడం అవినీతి అని ఒక పార్లమెంటు సభ్యుడన్నాడు ఇప్పుడు జనసామాన్యం అదనంగా రు 20½ అదనపు కోట్లు పన్నులరూపంలో ఇచ్చుకోవాలి దేశంలో ఆర్థికదుస్థితి ధరల పెరుగుదల నివారించడానికి ఇది మార్గం కాదే అని చాలామంది అన్నారు ఏమీ ఫరవా లేదు ధర లెక్కువైతే వస్తువుల్ని కొననే వద్దు మీ డబ్బు మీ వద్దనే ఉంచుకొని బాంకుల్లో వేసుకోండి లేదా స్మాల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు కొనండి అని మత్తయ్‌గారు చెప్తున్నారు కాని అదికూడా ఇప్పుడు ఎలామిగిలేది? వక్కలు, కవర్లు కొనడం మానేస్తే, మిగిలిన డబ్బు మిర్చికీ, బంగాళాదుంపలకీ పెరిగిపోయే ధరలకి పెడదామన్నా చాలదు వస్తువుల ఉత్పత్తి ఎప్పుడు వృద్ధి అవుతుందో అప్పటివరకూ కూచున్నా, ధరలు తగ్గుతా యని ఎవ్వరికీ తోచడం లేదు ఈలోగామాత్రం కొన్ని అవసర వస్తువుల్ని కొనడం తగ్గించుకోవలసిన అవసరం కలుగుతోంది ధరలు పెరిగితే కూలీలు, కార్మికులు జీతాలు పెంచమంటారు దీనితో పెట్టుబడిదార్లకి అదనంగా మిగిలే అయిదున్నరకోట్లు రూపాయలు కాదుగదా ఇదిరకు లాభాల్నే కోల్పోవలసి వస్తుంది

ఇరుకునబడ్డ రైతులు

మన రాష్ట్రంలో రంగాగారి ధర్మమా అని ప్రభుత్వం ధాన్యం అమ్మకపు ధరలు పెంచినా, మిల్లు యజమానులు అది దక్కకుండా చేశారు ధాన్యాన్ని బస్తా రు 13 కి రు 12 కి కూడా తీసుకోవడం లేదు ఇంక ఈ రైతుల్ని మిర్చికీ, దుంపలకీ ఎక్కువ ధరలు పొయ్యమంటే ఏమవుతుంది?

అంతగా. ఖర్చు తగ్గించుకోవాలంటే ప్రభుత్వోద్యోగుల సంఖ్యను తగ్గించుకోరాదా అనీ, విదేశాల్లో రాయబారుల నిమిత్తం పెట్టే ఖర్చు తగ్గించరాదా అనీ కొందరు సూచిస్తున్నారు

పరిశ్రమల వృద్ధికి వస్తూత్పత్తి వృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో పెట్టుబడిదారుల్ని తృప్తిపరచడానికి ప్రయత్నిస్తున్నట్లు మంత్రిగారు స్పష్టంగానే చెప్పారు గత సంవత్సరం ధనం కలవారంతా ప్రభుత్వంమీద కత్తిగట్టినట్లుగా ప్రవర్తించారు ఇప్పుడు వారికి నిజంగా తృప్తి కలుగుతుందా అనే సందేహం అందరికీ ఉన్నదే

అఖిలభారత వాణిజ్యసభాసమాఖ్య కార్యవర్గంవారు దేశంలో వస్తూత్పత్తిని వృద్ధిపరచాలంటే ప్రభుత్వం ఏమిచెయ్యాలో మార్చి 1 వ తేదీని కొన్ని సూచనలు చేశారు అవి చూస్తే మంత్రిగారిప్పుడు చేసిందికాదుగదా, దీనికి పదింతలు చేసినా వారికి తృప్తి కలగదని ఇప్పుడే స్పష్టపడిపోయింది అయినా వారి లాభాల కోసం ఇప్పుడు కొంతైనా ఉత్పత్తి వృద్ధికి కృషి చెయ్యక తప్పదు. చేసినా దేశంలో ధరలు తగ్గేటంతగా వస్తుసామగ్రిని ఉత్పత్తిచెయ్యడానికి ప్రయత్నించరని పరిస్థితుల్నిబట్టి తెలుస్తూనే వుంది అందువల్ల మళ్లీ సంవత్సరానికి మంత్రిగారు మన పెట్టుబడిదారుల్ని గురించి ఏమిచెప్తారో చూడాలి జనసామాన్యానికిమాత్రం రోజులు మరింత కష్టంగా ఉంటాయన్నది అందరూ, మంత్రిగారుకూడా ఒప్పుకుంటున్నదే

కొత్తపన్నులు, పన్నుల హెచ్చింపు
కార్డులు, కవర్ల ధరల పెరుగుదల

1 కవరుధర అణన్నరనుంచి రెండణాలకు హెచ్చింపబడుతుంది కార్డుధర అర్థణానుంచి మూడు కానీలకు హెచ్చింపబడుతుంది విమానంలో పంపే ఉత్తరాలకు అదనపు స్టాంపులు అంటించ నక్కరలేదు మామూలు కవర్లు కార్డులుకూడా విమానాల్లో రవానా అవుతాయి

2 మద్యం మొదలైన విలాస వస్తువుల పై సుంకం హెచ్చిస్తారు

3 మోటారు పెట్రోల్ పైదిగుమతిపన్ను, ఎక్సైజ్ పన్నుకూడా ముప్పావలానుంచి పదిహేనణాలకు పెంచుతారు

4 పొకవక్కలపై దిగుమతిపన్ను పౌనుకు అయిదణాలనుంచి ఏడున్నర అణాలకు పెంచుతారు

5 చుట్టలు, సిగరెట్ల ఎగుమతిపైన నూటికి 15 వంతుల చొ॥ కొత్త పన్ను విధిస్తారు

6 పంచదారపై పన్ను హండ్రెడ్ వెయిట్ పైన రు 3 నుంచి రు 3-12-0 కు హెచ్చిస్తారు

7 అతిసన్నపూలుతో తయారైన వస్త్రంపైనమాత్రమే కాకుండా, ఇప్పుడు సన్నపూలు బట్టపైన 6¼%, మధ్యరకం బట్టపైనా, ముతక బట్టపైనా గజానికి 3 పైసలు, చొ॥ కొత్తగా పన్నులు విధిస్తారు

8 టైర్లపైన పన్ను రెట్టింపు చేస్తారు

9 అగ్గిపెట్టెలపైన పన్నులు సమరీతిని విధించడానికి తగిన సవరణలు చేస్తారు

రద్దయిన పన్నులు

1 పెట్టుబడిపైన వచ్చే లాభాలపైన పన్ను పూర్తిగా తొలగిస్తారు

2 నూనెగింజలు, దుంప నూనెల ఎగుమతిపైన పన్నులు రద్దుపరుస్తారు

3 దేశంలో పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలను దిగుమతి చేసుకోడానికి పన్నులు విధించకుండా చేస్తారు

4 పదివేలరూపాయలవరకూ ఆదాయం గలవారు చెల్లించవలసిన ఆదాయపుపన్ను రేటులో కాని తగ్గిస్తారు లక్షన్నర రూపాయలకు పైబడిన ఆదాయాలుగలవారికి ఆదాయపు పన్ను రేటులో అణన్నర తగ్గిస్తారు ఆపైన ఆదాయాలుగల వారికి కూడా రేట్లు అణన్నర చొ॥ తగ్గిస్తారు మొత్తానికి ఆదాయపు పన్ను, సూపర్‌టాక్స్ కలిపి 14 అణాలకు మించకుండా చేస్తారు ప్రయత్నం లేకుండా వచ్చే ఆదాయాలపైన (*unearned incomes*) ఆదాయపు పన్ను రేటు పదిన్నర అణాలనుంచి పది అణాలకు తగ్గిస్తారు

5 విమానాలకుపయోగించే పెట్రోల్ పైన పన్ను సగానికి తగ్గిస్తారు

కథానిక

"అంతర్వాహిని"

శ్రీ కందుకూరి లింగరాజు

ఆరోజుల్లో ఎన్నో విధాల ఆలోచనలు రాజాన్ని కమ్ముకున్నై ఇంతవరకూ జీవితం స్వేచ్ఛగా, చీకూ చింతా లేకుండానే గడిచింది తన ఇష్టంవచ్చినప్పుడు లేవడం, ఏదో తీరుబడి వుంటే కథలు వ్రాసుకోవడంతోటి గడిపివేశేవాడు సాయంత్రాలు ఈ పచ్చిక పైరుల్లో, స్నేహితుల్లో గడచిపోయేది

ఇకముందు ? ఇదే శేషప్రశ్న అయి కూర్చుంది ఆరోజుల్లో ఆలోచించేడు నిర్ణయం లేక బాధపడ్డాడు కూడాను స్నేహితులు అంతా అన్నారు "జీవితంలో పెళ్ళి చేసుకోబోకు"అని అల్లా వుండాలనే అనిపించింది ఆ వుద్దేశాన్ని చాలాకాలం పాటించేడు అయినా అదీ చెదరకుండా వుండలేకపోయింది

ఆరోజు కాబోలు వాళ్ళ అమ్మ అంది "కస్తూరి వారి అమ్మాయిని చూడ్డానికి రమ్మన్నారు రేపు పంచమీ ఆదివారం బావుందిట మాధవశర్మబాబాయి వాళ్ళ వూరునుండి కాకినాడ వస్తానన్నాడు ఇద్దరు కలసివెళ్లి చూచి రండి ''అంది

ఓ విధమైన అవివాహితజీవితం ఆమాటల్కు తిరగబడింది ఎదురుచుంది ఇదివరకల్లా చూచినపిల్లల్ని త్రోసిపుచ్చెయ్యడం ఓ నిర్ణయం క్రిందనే పెట్టుకొని నెగ్గుకు వచ్చాడు ఇప్పుడూ

తన భావాన్ని తల్లిపసికట్టినట్టే తల్లి అందుకుంది "సంపన్నులు, గౌరవనీయులు " ఏవో ఏవో చెప్పింది మాధవశర్మ బాబాయిమీద కోపం వచ్చింది ఉన్నవూళ్ళో వుండక పెళ్ళి సంబంధాల్ని కుదిర్చే ఉద్యోగం ఓటి సంపాదించి, తనకికూడా సాలీ గూడు ను అల్లుతున్నాడని

జట్కాఎక్కి స్టేషన్కు వెళ్ళుతుంటేనే, 'ఏదో నాయినా ఏభైయ్యోపడి దాటింది త్వరగా ఎవర్నో ఒకర్ని కుదుర్చుకుని, పెళ్ళి చేసుకో నీకడ వువా, నాలుక్కాయలు కాస్తే చూడాలని వుంది' అంది గద్గదంతో

ఆతనికి జాలి తోణికింది 'అల్లాగే అమ్మా!' అందామనుకున్నాడు ఆవిణ్ణి చూస్తేనే చాలు హృదయం బాధ పడుతుంది తనజీవితంలో అంతకంటే దైవం లేనేలేదు ఆముక్కల్లోని మార్దవం వూచింది

అమ్మ! ఆవిడా తన్నిగురించి బాధపడుతోంది, దుఃఖిస్తోంది! అంటే ఓర్చుకోలేకపోయేడ

అమ్మ! అంతవరకు, తన పాతికవత్సరాల పైబడిన జీవితంలోన, తనభావి, బాగోగులు, ఆరోగ్యం, ఉన్నతికోసం త్యాగం చేసింది ఇంకా చేస్తూనే వుంది, చేస్తుందికూడా భావిలో "ఇంకా ఎన్నాళ్ళు చేయించుకుంటావ్ ?'' అనే పత్యదూరాలు స్మృతికి వచ్చినప్పుడు, తనే బాధ పడవలసి వస్తోంది

కాని ఒక్కటే పట్టుకుంది తనకి అశాంతి తెచ్చిపెడుతోంది 'రేపు ఆ కట్టుకున్న అమ్మాయి వస్తే తను దూరం మరంతదూరంగా తల్లి ఆదరణ, ప్రేమ, వాత్సల్యంకు అయిపోతానేమో' అని బాధపడ్డాడు ఈ భావనకు ఎవరు అర్థంచెప్పి భాష్యం చెయ్యగలరు ?

అంతవరకూ,, తను ఉదయం ఆలస్యంగా లేచినా, బద్ధకంగా వున్నా, సరిగ్గా కబుర్లు చెప్పక పోయినా, ఆరాటపడిపోయే అమ్మకి దూరం అయిపోతానేమో అన్న బెంగే ఆ నూత్నజీవి వచ్చి, ఈ రెండుజీవితాల్లోని సరస్వతీఝురుల్ని, దూరతీరాలు, సమానాంతరాలుగా చేస్తుందేమో?

అయినా, తనతల్లి మారదు, మారలేదు పాతిక సంవత్సరాలనుండీ పెంచుకున్న అమరభావాన్ని త్రెంపెయ్యలేదనే అనుకున్నాడు, వచ్చీరాని మాటల్ని లోపల్లోపలే పెట్టుకుని ఆ జనవరి నాల్గోతారీఖున ఆ కస్తూరి వారి అమ్మాయిని ఉద్వాహం చేసుకున్నాడు

తన తల్లి మురిసిపోయింది పొట్టిగా, ఎర్రగా, గుండ్రంగా, తేనెరంగు కళ్ళు, మధ్యపాపిడితో వున్న సుందర్ని చూచి 'మా కోడలు' అని బహుశః ఓ లక్షసార్లు, చెప్పినవాళ్ళకే చెప్పిందేమో! ఆవిడ సంతోషంలో కళ్ళుతుడుచుకోవడం చూచి, ఓ విధంగా గర్వపడ్డాడు తనకు తృప్తి నిచ్చింది, తల్లి సంతోషపడిందికదా అని

ఆ మొదటి రోజులు తను అనుకున్న, కట్టుకున్న అనుమానాలన్నీ కూడా పునాదులు లేనట్టే కన్పించేయి మానవదౌర్బల్యంకు నవ్వుకునే సిగ్గుపడ్డాడు

రెండు నెలలు దాటింతర్వాతనే కాపురానికి వచ్చిందిసుందరి ఆ సాయిసత్రం ఇంట్లో కాలు పెడుతున్న సుందర్ని చూస్తే క్షణికం వెనుక తను, భయపడిన సన్నివేశాలు ఒస్తాయేమో అని తట్టింది తన ఊహాలకి తావు లేదని ఆ సాత్వికం, అందంలో ఓడుతున్న శాంతతా చెప్పింది తను ఉలిక్కిపడ్డాడు

ఆ వారంరోజుల్లోనూ సుందర్ని వెయ్యి కళ్లతో భావన చేసేడు తనతల్లిలో ఏమైనా పరివర్తన వస్తోందేమో అని పరిశీలన చేస్తునే వున్నాడు తన వూహలే అని ఆత్మలు గోలెత్తుతుంటే తల తీసుకున్నట్టే అయ్యింది అయినా

ఇప్పుడు ఈ స్థితిలో జీవితం మారింది ఇదివరకల్లా, తనతల్లి ఆక్రమించుకున్న దినచర్యల్లో సుందరి పైచెయ్యి అయింది—తనను లేపడం, కాఫీ ఇయ్యడం, భోజనం వడ్డించడం ఇత్యాదుల్లో ఈ నూత్న మార్పు హృదయానికి ఆనందం కల్గచేస్తూనే వుంది అమరత్వం తీసుకుంటూనే వుంది కొన్నిక్షణాల్లోమాత్రం ఇది వరకు ఈ పనులన్నీ "మీ అమ్మ చేసేదోయ్! ఇప్పుడు ఆమె నీదగ్గరనుండి, సుందరిమూలాన్ని దూరం అయ్యింది చూచేవా?" ఈ తలంపు శరీరాన్ని ఉడికించేది సుందరిమీద కోపం తెప్పించేది అయినా తను ఏమీ చెయ్యలేని పరిస్థితిలో పడిపోయేడు

ఒకట్టటి మాత్రం ప్రతిక్షణంలోనూ నంచునేది తనతల్లి తనకి దూరం అయిపోయింది ఇది వరకు ఏచిన్న విషయం అయినా తల్లితో చెప్పేవాడు తన సపర్యల్లో తలి ఫూర్ణంగా ఆక్రమించుకుంది ఇప్పుడు సుందరి ఆక్రమించుకుందుకు వుచ్చులు పన్నుతోంది, పన్నింది ఈ తెలియని ఆవేదన సుందరిమీద కోపం తెప్పిస్తోంది "వాళ్ళింటికి పంపేస్తే, కొన్ని నెలల వరకు, కనీసం తనకు ఉద్యోగం అయ్యేవరకూ కూడా తీసుకురాకుండా వుంటే " ఇల్లాంటి ఆలోచనలు తట్టేయి

పంపించెయ్యాలి! తనతల్లిని తనదిగా చేసేసుకోవాలి! కేలండరుకాగితం చూచేడు కొత్తగా పెళ్లి కూతుళ్ళు నోచుకునే నోములు ఏమైన కొద్దిరోజుల్లో వున్నాయేమో అని కనిపించలేదు సిద్ధాంతిని గట్టిగా తిట్టుకున్నాడు తన సబ్బతి ఎందుకూ పనికిరాని నపుంసకుడిలా కూర్చోపెట్టింది సిగ్గు, కడుపులో బాధ, గుండెల్ని నలిమియేసింది

మర్నాడు పొద్దుటే 'అమ్మా' అనిపిల్చేడు ఆవిడా 'ఎందుకురా'' అని భయంతోనే అని "మీ ఆవిడ వేణ్ణీళ్ళు తోరిపింది వెళ్ళూ" అంతే! నీళ్ళగదిదగ్గరకి నడచి వెళ్ళేటప్పటికి కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి దుఃఖం వచ్చింది సబ్బుబిళ్ళ తువ్వాలు పుచ్చుకుని నుంచున్న సుందరి మీద ప్రళ్లమాలిన కోపం వచ్చింది

'మహమ్మారీ!' అందామనుకున్నాడు లోనున్న ఆత్మలు తిరగబడ్డాయి తల వంచుకునే నీళ్ళు పోసుకున్నాడు ఒళ్ళు తుడుచుకున్నప్పుడు, తనకి ఎక్కడినుండో వచ్చి సమస్తం, ఆ జన్మాంతరం ఇచ్చెయ్యడానికి సంసిద్ధ అయ్యిందే, ఆ పెకంటె

'ఏమైనా తల్లిని దూరం చేసింది' అన్న భావం వదలటం లేదు జీవితంలో 'ఎల్లా, తల్లి, భార్యల మధ్య గడపాలి' అన్నదే సమస్య అయ్యింది. ఇదే కాబోలు ప్రతివాడినీ బాధపెట్టే ఆందోళన అనుకున్నాడు

రోజులు గడుస్తున్నాయి తన విషయంలో తల్లి చెయ్యరాని అన్యాయం చేసినట్టే వుంది! 'అంతా సుందరికి నేను ఇచ్చేసేను' అన్నట్టే ప్రవర్తించింది ఆఖరుకు మాట్లాడానికైనా తీరుబడి లేనట్టే తిరుగుతోంది తను ప్రయత్నించినా విఫలమయ్యే పంగతిక్రింద తయారైంది 'ఎవర్ని అర్థం చేసుకోలేక ఈ విధంగా తను ఎందుకు అడకత్తెరలో ఒక్కలా తయారు అయ్యేడో' అని బాధ కల్గింది

ఆరోజు కాబోలు అత్తగారు ఉత్తరం వ్రాసింది—సుందరిని ఓసారి పంపమని ఉత్తరం చదువుతుంటే, ఓ విధంగా తనకి వల్లెవాటు తీసినట్టే అయ్యింది ఓవిధమైన తేలికపడ్డట్టే అయ్యింది సుందరితో అన్నాడు—మీ 'అమ్మగారు నిన్ను పంపమని వ్రాసే'రని

ఓసారి ఏర్పడ్డ అలవాటుల్లోని వియోగంకు బాధపడిగట్టగా చూచి 'అత్తగారిని అడగండి ఆమె వెళ్ళమంటే వెళతాను' అంది ఒక్కసారిగా ఆశ్చర్యంలో నోరు తెరిచేటట్టేఅయ్యింది ఆ జవాబు సుందరి ఆ విధంగా చెపుతుం దని తను ఎప్పుడూ ఊహించనే లేదు ఇప్పుడు ఈ నూత్న నియంతృత్వఅలవాటులు విఘ్నం కల్గతుందేమో అన్న భావనలోనే 'నే వెళ్ళను మా అమ్మకి పనీ పాటూ లేదు అస్తమాలు రమ్మంటుంది' అంటుం దేమో అనుకున్నాడు

పైగా అత్తగారిని తన భర్తదగ్గరనుండి ఎంత దూరంగా ఉంచితే అంత తన భావికోసం మంచి దని అనుకుని, దివాణం చెలాయిస్తూ, ఆఖర్కు ఆమెను మాట్లాడ్డానికి అయినా భయపడేటట్లుచేసిన సంసిద్ధతను, సుందరి ఆ విధంగా భగ్నపరుస్తుం దనుకోలేదు తన ప్రపంచకంలో ఈ సమీక్షకు ఆధారాలు కల్గనూ లేదు ఈ స్త్రీ ప్రవృత్తులను ఎల్లా అర్థం చేసుకోవాలో కూడా బోధపడటం లేదు

అత్తగారంటే ఇంత భయభక్తులు, అణకువ గౌరవం కలిగియుండి తన తల్లి అంత దూరం అవడానికి సుందరి ఏ విధంగా కారణభూతురాలో అవగాహన అవలేదు

ఉత్తరం చేతో పట్టుకుని పెరుగు చిలుకుతున్న అమ్మతో చెప్పేడు "అమ్మో! ఆవిడ అంతగా వ్రాయాలా క్రొత్తపాపం!వాళ్ళమ్మని చూడాలని బెంగ పెట్టుకుందేమో వెళ్ళి దిగవిడిచిరా'' అంది

ఈ సమాధానానికి, ఆవిడనిండుకుండతనం అర్థం కాలేదు తెల్లబోయేడు అన్నీ సమస్యలే అవుతున్నాయి సమస్యలు అర్థం కాని సన్నివేశాలు అంతులేని సమాధానాలు

'బజారుకు వెళ్ళి లక్క పట్టంచు చీర ఓటి కొనుక్కురా రవికల గుడ్డ వాళ్ళ మంగమ్మ కుట్టించుకుంది, అల్లాటిది తీసుకురా. భూషణంతో చెప్పు, ఓ పాతిక కొబ్బరికాయలు తీసుకురమ్మని ' ఆ వరసలో ఎన్నో చెప్పింది

ఆ ఆదివారం వాళ్ళన్నయ్య వచ్చేడు బండి ఎక్కించే పంపించేశేడు సుందరి వెళ్ళిపోయింది బహుశః ఓ నెల్లాళ్ళవరకూ తను ఆమెను చూడనే చూడడు

ఆ రాత్రి ఇల్లు బావురుమన్నట్టే అయ్యింది. ఏదో శూన్యత! లోపం! అలావాటల్ని బలిపీఠం మీద నరికినట్టే కన్పించింది.

అన్నం వడ్డిస్తున్నప్పుడు అమ్మ అంది 'సుందరి బుద్ధిమంతురాలు పని పాటలు తెలుసు ఎంత వినయం—' ఆ మాటలు రాజాన్ని చాలా ఇరుకులో కూర్చోపెట్టేయి సంయుక్తత అందలేదు అడుగుదా మనుకున్నాడు చెప్పేద్దామని నోటి చివరవరకూ వచ్చింది 'సుందరి నిన్నూ నన్నూ దూరం చేసిన మహమ్మారి కాదా?' అని అయినా గుండెలు నిలకడ అవటం లేదు

"ఇల్లంతా బావురుమని పోయింది లక్ష్మిలా తిరిగేది, ఎప్పుడూ నవ్వుతూనూ నన్ను ఒక్క పని చెయ్యనిచ్చేది కాదు"

మంగలంలోని పేలాపగింజ అయ్యేడు భావనలోని శక్తులు ఎదురుతిరిగేయి భరించలేని బాధ ఆ వేదన ఒక్కుమ్మడి ఎదురు తిరిగేయి

"అల్లాగా!" నోటమ్మట విషంలోనే మాటలు వచ్చేయి. అమ్మ నవ్వింది,అందులోనిఅఘాతాలు, ఆందోళన, ద్వేషం అర్థం అయినట్లే గుండెల్లో బాకు పొడిచినట్టే అయ్యింది రాజాకి . .

"వెర్రివాడా! 'నిన్నూ, నన్నూ దూరం చెయ్యడానికి వచ్చింది' అని అనుకుని బాధపడుతున్నావు కాదూ? నేను మాట్లాడనే లేదు, ఇదివరకటిలా ఉండలేదని లోపల్లోపలే బాధపడుతున్నావు కాదూ? " అంది

ఇప్పుడే తనకి జ్ఞానోదయం అయినట్టే వుంది. తన అమ్మను ఇన్నాళ్ళు అర్థం చేసుకోలేకనే పోయేడు ఎవరో చెప్పిన వాక్యాలు జ్ఞాపకం వచ్చేయి 'జీవితంలో ఒక్క స్త్రీని అర్థం చేసుకుని మరణిస్తే చాలు' అన్నది

'చాలా వెర్రిగా తయారయ్యేవు ఈనాడు నా జీవితంలో, నువ్వూ, కోడలూ ఈ ఇంట్లో తిరుగుతూ, అధికారం చెలాయిస్తూ వుండడం చూడ్డంకంటె నాకు జీవితంలో ఇంకో కోర్కె ఏ ముంది? మీ ఇద్దరే కాదా నాకు రెండు కళ్ళూనూ ఈనాడు, నా కోడలు నా తర్వాత నా హుందా ఆక్రమించుకోవట్లు చూడ్డంకంటె నాకు ఆనందం ఏ ముంది? "

గీతకి భాష్యం చెప్పుతోందా? తను వింటున్నాడా? "అయితే నువ్వు సుందర్ని ద్వేషించటం లేదా?" అనగల్గేడు

"ద్వేషించడమా!" ఆశ్చర్యంతో నవ్వింది. "నీకు అర్థం కాని విషయాలు వుంటాయి. సుందర్ని నేను ప్రేమించినట్టుగా ఎవరూ, ప్రేమించలేరేమో మనింటికి లక్ష్మిరా, ఆ పిల్ల! నువ్వు ఏ అదృష్టం చేసుకున్నావో కాని "


ఆ మాటలు వింటుంటే కళ్ళమ్మట, అమ్మ మీద కల్గిన ఆరాధనలో నీళ్ళు తిరిగేయి. చెయ్యెత్తి నమస్కరించా లని ఆత్మ తోసింది. నెమ్మదిగా తువ్వాలుతోనే ముక్కు తుడుచుకుని, దొడ్లోకి వెళ్ళేడు

ఆనందం కల్గుతోంది తన భావాన ఈ అంతర్వాహినీసరస్వతీఝురల్లో తుంపురుల్లా తెగిపోయింది 'అమ్మా, సుందరీ! ఒక్కటే' తనే ఓడిపోయేడు అనుకున్నాడు


సుందరికి ఉత్తరం వ్రాసేడు—'అమ్మ, నువ్వు వెళ్లిపోయినందుకు బెంగ పెట్టుకుం దని ''

సరస్వతీనదిని చూచినట్టే అయ్యింది రాజాకి ఆనాడు ఆ రాత్రి.


హైదరాబాదుకు



హకీంపేట విమానాశ్రయంవద్ద సర్దార్ పటేల్ రాకకు నిరీక్షిస్తున్న హైదరబాద్ నిజాం, మిలిటరీ గవర్నర్ చౌదరి, భారత ప్రభుత్వ సంస్థానశాఖసలహాదారుడు వి పి మీనన్, జైన్‌యార్‌జంగ్ ప్రభృతులు




ఇటీవల సర్దార్ వల్లభాయ్‌పటేల్ హైదరాబాదుకు
వీరితోబాటు మిలిటరీ గవర్నరు చౌదరీ, షే




భారత ఉతప్రధానిమంత్రి సర్దార్ పటేల్ గత శనివారం హైద్రాబాద్ వచ్చినప్పుడు హకీంపేట విమానాశ్రయంవద్ద స్వాగతం చెప్తున్న నిజాం నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్



ఉస్మానియా విశ్వవిద్యాలయం తరఫున ఉపాధ్యక్షుడు మేజర్‌జనరల్ చౌదరి భారత ఉపప్రధానమంత్రి సర్దార్ పటేల్‌కు "న్యాయకోవిద" బిరుదు పత్రమును అందజేస్తున్నారు




మద్రాసునుంచి బయలుదేరేముందు సర్దార్ పటేల్ ప్రభుత్వమంత్రులతో కరచాలన మొనరిస్తున్న దృశ్యం




ఉస్మానియా విశ్వకళాపరిషత్తు తరఫున ఉపాధ్యక్షుడు చౌదరి

పటేల్ ఆగమనం




వచ్చినపుడు కింగ్ కొఠీ భవనంలో నిజాంనవాబును కలుసుకున్నారు
టేల్ కార్యదర్శి శంకరగార్లు ఫోటోలో గలరు




విమానాశ్రయంవద్ద మిలిటరీ గవర్నర్
మేజర్ చౌదరి సంస్థానప్రముఖులను
ఉపప్రధానమంత్రి సర్దార్ పటేల్‌కు
పరిచయం చేస్తున్నారు




ఉపప్రధానమంత్రి బెంగుళూరుకు వెళ్ళినప్పుడు ఆయనకు సివిల్ స్టేషను మునిసిపల్
కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఇనయత్ మెక్రి పౌరసన్మానపత్రమును
ఒక పేటికలో సమర్పించినప్పటి దృశ్యము



హాకీంపేట విమానాశ్రయంవద్ద సర్దార్ పటేల్ ఆగమనానికి పూర్వం మేజర్ జనరల్
చౌదరి సతీమణి శ్రీమతి అరుణ చౌదరితో సంభాషిస్తున్న నిజాం నవాబు



సర్దార్ పటేల్‌కు 'న్యాయకోవిద' పట్టను గొపగాను



మద్రాసులో రాజాజీహాలులో శాసనసభ్యుల మధ్య సర్దార్ పటేల్ ఉపన్యసిస్తున్న దృశ్యం



అతిఆశ అపాయకరం

శ్రీ పరణం మురళీకృష్ణమూర్తి

నృసింహస్వామి ఆలయంలోని పూజారులు - అనంతాచారి, రామానుజాచారి శేషయ్య ఇంటి సామీప్యంలోనే ఉంటుండేవారు. దేవుణ్ణి దర్శించుకుంటానికి రోజూ ఊర్లో జనమే కాకుండ పొరుగూర్లనుంచిగూడ అనేక మంది వస్తూపోతుంటారు. రోజూ దేవునికి చదివింపులు, మొక్కుబళ్లు జరుగుతూ ఉంటై. ఇవేగాక దక్షిణ డబ్బులుగూడా చాల ఎక్కువగానే లభ్యమవుతూ ఉంటై. కాని వీటిలో చాల భాగము పూజారుల ఇళ్లకు చేరుతుంది భగవంతుని పేరుతో ఈ ఇద్దరు ఆచార్యులూ కాజేస్తున్న డబ్బు, చేస్తున్న అన్యాయాలు ఊర్లోవారికి చాల మందకి తెలియక పోయినా పొరుగింటి శేషయ్యకు బాగా తెలుస్తూ ఉంటై ఇటువంటి విషయాలు.

దైవసేవలో హాయిగా కాలం గడుపు తున్నప్పటికీ ఆచార్యులకు, తమ అర్చకత్వం వల్ల వచ్చే ఆదాయంతో తృప్తిపడటం లేదు. "మా బ్రతుకే మండలే, దిక్కుమాలిన బ్రతుకు. ఎప్పుడూ కానీ దక్షిణడబ్బులతోనే జీవించాలి. మీకు మల్లే మేడలు, కారులు మాకు ఎక్కడ నుంచి వస్తై" అని అప్పుడప్పుడూ, పొరుగింటి శేషయ్యతో తమ కష్ట సుఖాలు చెప్పుకుంటుండేవారు.

"భగవంతుకి నిత్యం సేవజేస్తుంటారు ఆయన మిమ్మల్ని ఆదరించక పోతాడ? ఎప్పుడో ఒకసారి మిమ్మల్ని భాగ్యవంతులుగా జేస్తాడు" అంటూ ఆచార్యులను ఉత్సాహపరుస్తు టాడు శేషయ్య.

శనివారం నాడు నృసింహస్వామి దర్శనానికై ఎంతో మంది జనం వస్తూపోతున్నారు. మన అనంతాచారి, రామానుజాచార్లు చేతినిండా పనితో తీకమకలై పోతున్నారు. రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. గుళ్లో ఆచార్లు తప్ప ఇంక ఎవరూ లేరు. దీపారాధన చేసి ఇద్దరూ తీరికగా కూర్చుని ఆలోచిస్తున్నారు.

"ఒరే రామానుజ, ఇటు చూడు ఇన్ని సంవత్సరాల నుంచి మనం దేవుణ్ణి పూజిస్తున్నాం కదా! ఆయన ఒళ్లంతా బంగారం పూసుకుంటున్నాడు గాని మనల్ని ఏమైనా బాగుచేశాడా?"

"ఆయనికి మనమీద ఇంకా దయ రాలేదు అనంతం. ఎప్పుడు వస్తుందో మనమీద దయ! ఎప్పుడు మన ఒళ్లు గూడ బంగారమయం అయిపోతుందో!"

ఇద్దరి సంభాషణ ఇట్లా సాగిపోతూనే ఉంది. ఇంతలో ఒక పెద్ద శబ్దం వినిపించింది. ఇద్దరూ నిశ్చేష్టులైపోయి దిక్కులు చూడటం మొదలెట్టారు. ఆ శబ్దం మనిషిగొంతు కావటం ఇద్దరికీ ఆశ్చర్యమై పోయింది. గబగబా విగ్రహసామీప్యానికి వెళ్ళారు.

"ఓ పూజారులారా! మీరు నాకు చేస్తున్న సేవకు నేనెంతో ఆనందించాను. మీకు ప్రత్యుపకారం చేద్దామని ఎప్పటినుంచో నా మనస్సులో ఉంది దానికి సమయం వచ్చింది మీరు రేపటిరోజున ఎవరికీ తెలియకుండ నాకు రెండు నవరాల బంగారం చదివించాలి. ఆ మీదట మీకు కోరినంత బంగారం వచ్చే సదుపాయం నేను చేస్తాను"

ఆ తర్వాత వారికి ఏమాటలూ వినిపించలేదు. మనిషిజాడ కన్పించలేదు. "నృసింహస్వామి మనకి మాటలు చెప్పాడు ఇంకెవ్వరూ కాదు" అని అనంతరామానుజాచార్లు నిశ్చయించుకున్నారు. ఆ రోజు వారి సంతోషానికి అంతు లేదు.

దేవుడు మాట్లాడాడనే సంతోషంలో వారు మరుసటి రోజు సరిగా పనులే చేయలేదు. రాత్రి 10 గంటలు కావచ్చింది. గుట్టుగా రామానుజాచారి, అనంతాచారి తమ భార్యల మెళ్లో నగలు తెచ్చి చెరి రెండు నవరాలు భగవంతునికి సమర్పించారు.

"చాల సంతోషం. రేపు తెల్లవారుఝామునే గుడికి తూర్పున ఉన్న పెద్ద మఱ్ఱిచెట్టు క్రింద నీరులేని బావి ఒకటి ఉంటుంది. అందులో పెట్టె ఒకటి కన్పిస్తుంది. ఆ పెట్టె తెరవండి. అందులో ఒక చిన్న పెట్టె ఉంటుంది. ఇద్దరూ కళ్లు మూసుకుని ఆ పెట్టె తెరచి అందులోని ఒక వస్తువును తీసి చూడండి. అది మీకు ఏది కోరితే అది ఇస్తుంది."

ఎంతో బిగ్గరగా వినిపించిన ఈ మాటలు సంతోషంతో రామానుజాచారి, అనంతాచార్యుల హృదయాలు కొట్టుకోసాగాయి.

మరుసటి రోజు తెల్లవారుఝామున 5 గంటలకు లేచారు ఇద్దరూ కలుసుకొని ఎవరికీ తెలియకుండా గుడికి తూర్పుగా పయనమై వెళ్ళారు.

"అరే! అప్పుడే వచ్చామే బావి దగ్గరకు!" అన్నాడు అనంతాచారి.

"ఆలస్యం ఎందుకూ పెట్టె ఉందో లేదో చూద్దాం పద" అని తొందర చేశాడు రామానుజాచారి. నిజంగానే పెట్టె కన్పించింది ఇద్దరికీ. సంతోషం ఇనుమడించింది

'తొందరగా తెరువు' అనేశాడు అనంతం. తెరవటంతోనే చిన్న పెట్టె గూడ కన్పించింది.

"కళ్లు మూసుకుని చూడాలి ఈ పెట్టెలో ఏముందో తెలుసా! అట్లా భగవంతుడు చెప్పినట్లు చేయకపోతే మనకు ఏదీ రాదు." అన్నాడు రామానుజం.

ఆరాత్రి భగవంతుడు చెప్పినట్లుగానే ఇద్దరూ గట్టిగా కళ్లు మూసుకొని పెట్టె తెరచారు అందులో చెయ్యిపెట్టి గిలికారు.

"అమ్మో, బాబో!" అని ఒక కేక పెట్టారు ఇద్దరూ.

"ఎంత అన్యాయం జరిగింది. ఇందులో డబ్బు గాదు, తేళ్లున్నై ఇవి ఏమీ ఇవ్వకపోయినా ఎట్లా కుట్టి వదిలాయో చూడు" అంటూ ఇద్దరూ ఏడ్వసాగారు.

మరి తేళ్లమీదచేతులు వేస్తే అవి కుట్టక ఏం చేస్తాయి. అత్యాశకు పోయి, ఎట్టి దుస్థితి తెచ్చుకున్నారో చూశారా మన ఆచార్యులు. ఆ రోజునుంచి వాళ్లకు బుద్ధి వచ్చింది ఇప్పుడు భగవంతు డిచ్చిన దానితోనే తృప్తిపడి జీవించటంలో సుఖాన్ని తెల్సుకున్నారు.

తను చేసిన పని ఆచార్యులను ఇంత మంచిలోనికి తెచ్చినందుకు శేషయ్యకు ఎంతో సంతోషం వేసింది.

దేవతా రూపం

శ్రీ ఎస్. లక్ష్మీనరసింహాచార్య

పూర్వం ఒక ఊళ్లో 'వెంకన్న' అనే కాపు వుండేవాడు వెంకన్నకి కొద్ది ఎకరాల పొలం వుంది పొలం నుండి యింటికి పోయే దారిలో ఒక చెఱువు వుంది. వెంకన్న ఎప్పుడు పొలానికి వెళ్లవల్సినా, ఆ చెఱువు గట్టుమీద నుంచే దారి అది మామిడి పళ్లు కాలం అవడం వల్ల వెంకన్న, తన పొలంలో పండిన మామిడి పళ్లు—దగ్గరగావున్న సంతలో అమ్ముతూ వుండేవాడు.

ఆ వేళ సంతరోజు. అందువల్ల తన భార్య వెంకమ్మతో కూడా మామిడి పళ్లు కోసేందుకు తన పొలంలోకి వెళ్లాడు. ఇద్దరూ మామిడి పళ్లు కోసుకొని చెఱువుగట్టు మీద నుంచి వస్తున్నారు. అది వేసవికాలం కదూ?—కాళ్లు మాడుతున్నాయి ఇద్దరికీను అప్పుడు వాళ్లిద్దరూ, ఆ గట్టుమీదే వున్న ఒక చెట్టు నీడలో కూర్చున్నారు. అప్పుడు వెంకమ్మ అంది కదా,— "మామా, మరి సంతకి యింకా కొంచం ఏళ వుంది అందాకా యీ చెఱువులో చేపలిని పట్టు, అవి యీ రోజు కూరకన్నా పనికి వస్తాయి నేను యింటికెళ్లి గేలం తెచ్చి యిస్తాను అంత వరకూ యిక్కడే కూచునుండు" అంది.

వెంకమ్మ యింటికి గబగబా పరుగెత్తి, గేలం తెచ్చి యిచ్చింది. వెంకన్న చేపలు పట్టి వెంకమ్మకిచ్చాడు. ఇంతకు ముందు యిద్దరూ పొలంలో కోసిన మామిడి పళ్లబుట్ట వెంకన్న నెత్తిమీద పెట్టకొని— "చూడు వెంకమ్మా, సంతకి వేళైనట్టుది. నేను సంతకి పోతాను ఇవి నేను అమ్మి వచ్చే సరికి అన్నం, కూరా వండి వుంచు" అని చెప్పి సంతకు వెళ్లిపోయాడు.

వెంకమ్మ యింటికి పోయి, ముందుగా అన్నం వండింది తర్వాత కూరవండడం ప్రారంభించింది. కూర వండుతూ వున్నంత సేపూ, నోరు ఊరుతూనే వుంది. కూర వండడం అయి పోయింది మరి వెంకమ్మ ఆగలేక, కొంచం రుచి చూసింది. 'బలే బాగుంది' అని మరొకటి రుచి చూచింది. ఇలాగ ఆఖరకు కూరంతా తినేసింది. ఇంతట్లో వెంకన్న జ్ఞాపకానికి వచ్చేడు. 'వెంకన్న కేం పెట్టేది? మతి పోయినట్లు అంతా తినేశాను. తిన్నానని చెప్తే వెంకన్న నన్ను వుంచుతాడా?'—అని ఆలోచించి, చక్కటి ఉపాయాన్ని పన్నింది.

ఇంతలో వెంకన్న— పాపం! ఆ మండు ఎండలో బడి, సంతలో మామిడి పళ్లు అమ్మి ఆకలితో యింటికి వచ్చాడు. ఇంకేముంది— వెంకమ్మ జుట్టు అంతా విరగబోసుకొని, వెంకన్నని చూడగానే— "నేనెవరి ననుకున్నావురా? చెఱువు దేవతను నన్ను అడగకుండా నిన్నవరు చేపలు పట్టుమన్నారు. నిన్ను యిప్పుడు తినేస్తాను జాగ్రత్త!" అని అరవడం ప్రారంభించింది. వెంకన్న జడిసి, ఒణికి పోతూ—"

"అమ్మా— మరి తెలీక చేశాను. నాదే తప్పే! మరి నన్నేం చెయ్యమంటావు? పోనీ, నువ్వేది చెప్తే అది చేస్తాను" అని అంటూ కాళ్ల మీద పడ్డాడు

వెంకమ్మ మెల్లగా లేవనెత్తి పెద్ద గుద్దు పెట్టి "మరి చేస్తావా?" అంటూ ఇంట్లోకి వెళ్లి, మూకుడు మీద పళ్లెం బోర్లించి, వెంకన్న చేతికిచ్చి— "దీన్ని మధ్యదారిలో నువ్వు మూత ఎత్తి చూడకుండా ఏ చెఱువులో చేపలు పట్టేవో, అందులో వదలేసిరా! ఒకవేళ మధ్యదారిలో మూత ఎత్తి చూచేవా?. నీ పని సరి జాగ్రత్త!—' అని బెదరించి పంపించింది


వెంకన్న వినయంతో ఆ మూకుడు, దారిలో ఎక్కడా చూడకుండా, చెఱువు దగ్గరకు తీసుకెళ్లి, నీటిలో పళ్లెంతో సహా మూకుడు దించి, పైటకు లేచాడు చేపలు చెఱువులోకి వెళ్లిపోయా యనుకున్నాడు (అమాయకపు వెంకన్న)

ఇంటికి తిరిగి వచ్చే సరికి, మొదటి చేష్ట లేవీ లేకుండా, మామూలుగా నున్నట్లు కనిపించింది. మొదటినుంచీ జరిగిన విషయాలు చెప్పి, 'ఏంటి సంగతి?'— అని అడిగాడు 'ఏమో నాకు తెలీదు' అంది. దేవతారూపం నిజమే ననుకున్నాడు వెంకన్న అప్పటికీ, యిప్పటికీను

(ఒక ఆంగ్ల కథ ననుసరించి)

గాంధి శిలావిగ్రహము

(శిల్పి —మేడమర్తి బ్రహ్మానందం, బందరు)




గాంధీమహాత్ముని శిలాప్రతిమలు యిప్పటికి చాలామంది తయారుచేశారు దాదాపు ప్రతి ఊరా ఒక విగ్రహం ఉన్నదేమో! కాని వాటిలో చాలావాటికి మహాత్ముని పోలిక బహు దూరంగా కనబడుతుంది ఇది చాలా విచారకరమైన విషయం ఈ పటంలో చూపబడిన ప్రతిమ ఈ లోటు లేనిది

రాష్ట్రపతి డాక్టరు పట్టాభిసీతారామయ్యగారు ప్రతిమను తిలకించి శిల్పాన్ని ప్రశంసించి, శిల్పికి మంచి భవిష్యత్తు కల దని ఆశీర్వదించారు.

శ్రీయుతులు రఫీఅహమ్మద్ కిద్వాయ్, కె ఎం మున్షీ, అడివి బాపిరాజు, కోలవెన్ను రామకోటేశ్వరరావుగారలు మున్నగు వారు యీ ప్రతిమను చూచి దీని ఉత్కృష్టతను ఉగ్గడించారు

ఈ విగ్రహాన్ని తయారుచేసిన శిల్పి, దేశనాయకులవీ యితరులవీ శిలాప్రతిమలు అతి నిపుణంగా తయారుచేసి యిస్తున్నారు వారికి కళాభిమానులు అన్ని విధాలా చేయూత నిస్తారని ఆశిస్తున్నాను

"కళాభిమాని"



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౧౭

అన్నమాచార్యులు రచన (సంపు. 3, ప. ౪౦)

సాళంగనాటరాగం - త్ర్యశ్రజాతి త్రిపుటతాళం

రాగలక్షణం

౧౫ వ మేళమైన మాళవగౌళరాగమున పుట్టినది శు-రి, అం-గ, శు-మ, శు-ధ, కా-ని స్వరములు గలది ఆరోహణంలో గాంధారనిషాదములు లేవు అవరోహణం సంపూర్ణస్వరాలు గలది సావేరిరాగానికి ఇవే స్వరాల యిట్టి సంచారమే ఉండుటచేత, బహువిధగమకములతో రక్తి గాంభీర్యములు గల ఆ రాగం ఎక్కువ జనప్రియమై దీనిని మూలపడ తోసింది నిజం చూడబోతే రెంటికీ చాలా భేదం కలదు సావేరిలో నిషాదగాంధారాలు ఒక శ్రుతి తక్కువగానో ఎక్కువగానో ధ్వనిస్తూ, కంపితాందోళిగమకాలతో స్వస్థానంలో నిలువక తూగుతూ ఉండును, మధ్యమంకూడా ప్రాయశః తన చోటును వదలి పంచమంవరకూ వళితో ప్రాకులాడుచుండును రిషభధైవతాలు రెండూ షడ్జపంచమముల ఊతతోనే ఆడుతూ ఉండును ఈ యైదు స్వరాల లీలావైవిధ్యంలో స్థిరస్వరాలైన షడ్జపంచమాలే మెరుగుపడుతూ వాటికి త్రోవ విడుచును సాళంగనాటలో అట్లు కాదు, ఇందు గాంధారనిషాదాలు వివాదిస్వరాలై ఉన్నా లేనట్లే, ఆరభిలోవలె ఉండును 'మగరిస-అను ప్రయోగమందుగల గాంధారము నొక్క లేక, ఒరయికతో ఋషభమునకు దిగుట ప్రాచీనసంప్రదాయజ్ఞుల వాడుకగా నున్నది' అన్నారు సుబ్బరామదీక్షితులు (సం సం ప్ర ౯౬౯) ఇట్లే సనిధా అనే ప్రయోగంలో నిషాదంకూడా షడ్జం అంతరగాంధారం—వీనికి గల సహజసంవాదమే ఈ రాగంలో రి-మ లకున్న, ధ-సలకున్న కలదు ఈ రాగనిర్మాణానికదే మూలం కనుకనే నిషాదగాంధారాలు దుర్బలస్వరాలైనవి అవి ఉన్నవన్న విషయం మనం మరచిపోకుండా చేయడానికే మగమ-సనిస అనే అల్పప్రయోగాలు ఇందులో ప్రవేశించి నిల్చినవి కాబట్టి ఈ రాగంలో రి-మ-ధ స్వరాలు మూడూ స్వస్థానంలో సుస్థిరంగా నిలువగలవు ఇది నాటగౌళాదిఘనరాగాలలో ఒకటి కనుక నిషాదగాంధారాలు తప్ప తక్కిన స్వరాలు—మగరిరి ససరిరిసా, రిరిమమ పపమమ, ధధసస, సనిధధ పపమమ—ఇత్యాదిగా జంటగా స్ఫురితప్రత్యాహతగమకాలతో ప్రయోగించడం ఈ రాగస్ఫూర్తికి ముఖ్యం నిసరిగమా, మపధనిసా—ఇట్లు ఆరోహణంలోనూ క్వాచిత్కంగా గాంధారనిషాదాలు రావచ్చు నని తులజామహారాజుమతం (సం. సారా పు ౭౦)

రామామాత్యుడున్ను సోమనాథుడున్ను సారంగనాట, సాలంకనాట అనే పేరుతో, అంతరాన్ని మించిన గాంధారము, కాకలిని మీరిన నిషాదము గలిగి, తీవ్రతర రి-ధ లు శుద్ధమధ్యము గల రాగ మొకటి నిర్దేశించినారు (స్వరమేళ మేళప్ర, రాగవి వివే 3) ఆ మతం తప్పని గోవిందదీక్షితుడు ఖండించినాడు (సంగీతసుధ పు ౧౭౭) ఆతడు సాలంగనాట, సాలగనాట అనే రెండు రూపాలూ వాడినాడు. ప్రాయశః రామామాత్యసోమనాథులు చెప్పిన రాగం వేఱు పేళ్లలో అత్యల్పభేదం గలిగి స్వరూపంలో చాలా భేదం గల రాగాలు ఎన్నో ఉన్నవి కానడ, కన్నడ; భైరవి, భైరవ—ఇత్యాదులు కనుక గోవిందదీక్షితుల ఖండనాన్ని మన మంతగా గమనించనక్కరలేదు రాగాల పేళ్ల మూలం, వాటి మార్పులు, అవి గల్గించిన భ్రాంతులు, దాని ఫలితాలూ చర్చ చేయబోతే తెగని చిక్కులో తగులుకొని దిక్కు తోచక పోవును అది వ్యవహారానికంటే వినోదానికెక్కువ ఉపయోగించే చర్చ

[పల్లవి]

(౧) , , , పా ధ సి రి ని సి ధా , , । సా , ధ ప మ మ గ రి రి మా , , । , , , సా రి స రి మ ప ధా , , ।
మీ రు చే సే ప ను ల కు మే ము తో చే
ప ప ధ ధ ప మ మ గ రి రి సా , , ।
ప ను తే మి

(౨) స రి మ పా ధ సా రి గ రీ ని స ధా । ప ధ స ని ధ ప మ మ గ రి ప మా , , । , , , సా రి స రి
మీ రు చే సే ప ను ల కు మే ము తో
మ ప ధ సా ధ । ప ధ స ని ధ ప మ మ గ రి రి సా , , ।
కే ప ను తే మి
, , , సా రి మ గ రి గ రి , , । సా గ రి రి స స ని రి స ధా , , । , , , ప ధా సా రి స రి , ,
నే రు పు నీ కై వి క మే నె ర పు దు
ప మ గ రి , సా , , , , స రి ।
గా ని
మ ప మ (మీరు)

[చరణం]

, , , పా ప మా , , మా , , । మ ప మ గ రీ స రి స రి మా , ,
ఎ వ్వ రు నీ కు సౌ ప్ప గా
, , , ప ధా ధ ప ప మ గ రీ , । స రి ప మ గ రి స ని స రి సా , ,
ఇ ల న పాం డ వ మం టే
, , , సా రి మ గ రి మ మా , , । గ రీ పా మ మ గ రీ ధా , ,
అ వ్వ ల గా కుం డు గా క
, , , ప మా ప ధ ప ధ ప ధ ప ధ । పా , , , , , , , , , ,
య ని యం టి వి
, , , సి ని స ధా , , పా , , । పా , ధ ప మ మ గ రి స రి మ పా
నె వ్వ గ వి భీ ష ణు డు
, , , ధ ప మ పా , , ధా , , । ప ధ స ధ ప మ పా ధా సా , ,
ని న్నే మి వే డు కొ న గా
, , , సా రి మ గ రి మ గ రీ , । సి రి గ రి రి స ని ధ ప ధ సా , ,
ర వ్వ గా న ట్టే లం కా
, , ధ పా ధ రి సి ని స ధా , , । ప మ ప ధ ధ ప ధ ధ ప ప మ గ రి రి
రా జ్య మొ స గి తి వి
మ ప మ (మీరు)

ఇక్లే ఈ క్రింది చరణాలు.

(౧) రమ్మని యెవ్వ రనగా - రాముడవై విచ్చేసి,
యిమ్ముల నహల్యశాప - మిటు దీర్చితి ?
దొమ్మిలో నేమి చెప్పగ - దూతి విజయునికై
క్రమ్మజ భీష్మునిపై చ - క్రమే యెత్తితివి? ॥మీరు॥
(౨) చెలగి ధ్రువుని కేల - చెక్కుల నీ శంఖ మూది,
పలునుతులు చేకొని - పట్టమిచ్చితి ?
ఎలమి శ్రీ వెంకటేశ - యేమియు నే మెఱుగము,
యిల నిర్హేతుకముగా - ఎట్లైన గావవే ॥మీరు॥

లఘుటీక : మొదటి చరణంలో అశ్వత్థామ బ్రహ్మశిరోస్త్రము అపాండవమగు గాక యని ప్రయోగింపగా శ్రీకృష్ణుడు ఉత్తరగర్భాన్ని కాపాడిన కథ అనుసంహితము (సౌప్తిక ౨ రా౨) తక్కినవి రామాయణభారతభాగవతములలో ప్రసిద్ధములైన కథలు
నేరుపు నీ దైవికమే—నేర్పుగల నీ దివ్యశక్తియే, రవ్వ-ప్రసిద్ధి, నింద, హోరు అనే శబ్దరత్నాకరమందలి అర్థం ఉపలక్షణమాత్రమే
ఇది రవళిబ్ధభవము-శ్లాఘ అనికూడా కావచ్చును, దొమ్మి-దొంబియుద్ధము

ముద్రితపాఠములు నేరుపుదుగాక, నట్టెలంక, యేమినెరుంగము, నిరుహేతుకముజ

సౌరాష్ట్రప్రాంతము - నిర్మాణకార్యక్రమము

శ్రీ బ్రహ్మాండం ఆంజనేయులు

గాంధీ మహాత్ముడు ఉపదేశించిన నిర్మాణ కార్యక్రమమును దేశమున ప్రచారము చేయు ముఖ్యోద్దేశ్యముతో ఈ ధర్మసంస్థ నెలకొల్ప బడినది ప్రస్తుతము చెన్న రాష్ట్రపు గవర్నరుగా పనిచేయుచున్న మాజీ భావనగర్ మహారాజా శ్రీ కృష్ణ కుమార్ సింగ్ జీవారు గ్రామ పునర్నిర్మాణము ద్వారా ప్రజాసేవ చేయదలచి 1946 వ సంవత్సరమున పూనాలో ఆగాఖాను భవనమునుండి విడుదలయై విశ్రాంతి తీసుకొనుచున్న బాపూజీకి తన సంకల్పము తెలియజేసిరి భావనగర్ రాష్ట్రమున ఈ విధముగా దేశసేవ చేయు ధర్మసంస్థ నెలకొల్పుటకు మహారాజా వారు మహాత్ముని సహాయ మర్థించి ఆ సంస్థకు అయిదులక్షల రూపాయలు, పదమూడు ఎకరముల సుక్షేత్రము దానముచేసిరి అప్పుడు మహాత్ముడు, తన సహచరులలో ముఖ్యుడు, అఖిల భారత గ్రామ పరిశ్రమల సంఘముయొక్క సెక్రటరీ, ఆర్గనైజరు అయిన శ్రీ జె సి కుమారప్ప గారికి ఈ ధర్మసంస్థను ఏర్పరచి నడిపించు కార్యభారము వప్పగించెను శ్రీ జె సి కుమారప్పగారు అధ్యక్షతతోనూ, గఢడానివాసి సౌరాష్ట్రప్రజాసేవకులయిన శ్రీ మోహన్ లాల్ మోతీ చంద్ సేట్‌గారు (సెక్రటరీ) వ్యవహార నీతిలతోనూ, ఈ ధర్మసంస్థ 1948 సం॥ జూన్ నెలలో ఏర్పడెను ఈ సంస్థలో శ్రీ యు యన్ దేబర్ (సౌరాష్ట్ర ప్రధాన మంత్రి) శ్రీ బలవంతరాయి మెహతా, (సౌరాష్ట్రప్రాంత ఉపప్రధాని), శ్రీ దర్బార్ గోపాల్‌దాసు దేశాయి (సౌరాష్ట్ర ప్రముఖులు) గార్లు గూడ సభ్యులుగా జేర్చబడిరి మన దేశమునకు రాజకీయ స్వాతంత్ర్యము లభించిన తరువాత నాయకులు ఆర్థిక సాంఘిక స్వాతంత్ర్య సముపార్జనలో నిమగ్నము కావలసియున్న దవి మహాత్ముడు ఆదేశించి యున్నాడు ఆర్థిక, నైతిక స్వాతంత్ర్య సముపార్జనకు కీలకమయిన గ్రామపునర్నిర్మాణ కార్యక్రమము దేశమున ప్రచారము చేయుటయే ఈధర్మ సంస్థనిర్వర్తించవలసిన ముఖ్యకార్యము ఈ ప్రచారమునకు అవసరమయిన ప్రచారకులకు సమగ్రగ్రామసేవాదృక్పథమును కల్పించి అట్టి ప్రచారకులద్వారా గాంధీతత్వమును వాడ వాడల వ్యాప్తిజేయ ఈ ధర్మసంస్థ సంకల్పించినది బాపూజీ సృష్టించిన వివిధనిర్మాణ కార్యక్రమ సంస్థలలో, పకదాని ఉద్దేశ్యములతో ఇంకొకటి కలిసి సమగ్రదృష్టితో ప్రజాసేవ సమిష్టిగా చేయలేకపోవుచున్నవి గోసేవా ప్రచారకుడు ఖాదీధారణ నియమము పాటించవలె ననియూ, ఖాదీప్రచారకులు గ్రామ పరిశ్రమలలో ఉత్పత్తి యయిన వస్తువులనే వాడవలె ననియు, గ్రామ పరిశ్రమల ప్రచారకులు తమ పిల్లలచదువుకొరకు గుమాస్తాలగా తయారు చేసెడి చదువు నేర్పు ఇంగ్లీషుబడులకు కాక చేతిపనులద్వారా స్వతంత్ర విద్యకరపు (నయీ తాలిం) బెసిక్ విద్యాలయములకు పంపవలె ననియూ మొదలగు ప్రధాన అంశములను ఈ వివిధ నిర్మాణ కార్యక్రమ సంస్థలలోని ప్రచారకులు గమనించుట లేదు అందుచేత వారిలో సమగ్రగ్రామసేవ యనెడి దృక్పథము నశించుచున్నదని మహాత్ముడు గ్రహించి తాను నిర్మించిన ఈ వివిధ నిర్మాణ కార్యక్రమసంస్థల నన్నిటినీ వకే వక కమిటీ యాజమాన్యముక్రిందకు తెచ్చి నడిపించినచో బాగుండు నని సూచించియుండిరి కాని నేటివరకూ ఇట్టి పని సాగియుండ లేదు ఇపు డీ ధర్మసంస్థ బాపూజీ కోరిన అట్టి కార్యక్రమమే చేయ తలపెట్టి తాను తయారుచేయు గ్రామసేవకులకు వివిధ నిర్మాణాత్మక కార్య క్రమములలో శిక్షణ నివ్వ తలచినది ఈ ధర్మ సంస్థ నిర్వహించదలచిన కార్యక్రమమునందు అఖిలభారత చరాఖా సంఘము, అఖిలభారత గ్రామ పరిశ్రమల సంఘము, నయీతాలిం సంఘము, గోసేవా సంఘము, హరిజన్ సేవక్ మొదలగు పలు సంస్థల కార్యకలాపములు ఇమిడి యున్నవి

భవన నిర్మాణము

ఈ సంస్థ యొక్క భవననిర్మాణమునకు భావనగర్ మహారాణీ శ్రీమతి విద్యాబాగారు 1948 సం॥ జూన్ నెల పదియవ తారీఖున శంఖుస్థాపన మహోత్సవము జరిపియుండిరి ఈ కట్టడములను గఢడా గ్రామసమీపమున మహారాజా వారు దానముచేసిన పదమూడు ఎకరముల భూమిలో నిర్మించ మొదలిడిరి భవనములన్నియూ అతి నిరాడంబరముగా నిర్మింపబడుచున్నవి సిమెంటు ఇనుమువంటి భారి యంత్రాలయములలో తయారయిన పదార్థముల వాడుకను ఈ భవననిర్మాణములో వీలయినంతవరకు తగ్గించబడినది గఢడా సమీప ప్రాంతమున సరియగు మట్టి, వంటచెరుకు లభించకపోవుటచేత ఇటుకలను స్వయముగా తయారుజేసుకొనలేకపోయిరి గఢడాలో తయారుచేసిన దేశవాళీపెంకులతో ఇండ్లు కప్పబడుచున్నవి ప్రత్యేకఅవసరములకు వలయు గట్టి భవనములనుమాత్రము కొండరాయి సున్నముతోను, మిగతా మామూలు వసతి గృహములు, పాకలు మొదలగునవి మట్టి గోడలతోనూ నిర్మింప బడుచున్నవి ఈభవనములన్నింటిలో అమర్చబడిన కిటికీలు, ద్వారబంధములు పై కప్పుకు వాడబడిన కొయ్యకమ్ములు, ఇచటనే గ్రామములలో సులువుగా లభించు ఆముదము అవిశెనూనె, కావిరాయి రంగు, పచ్చమట్టి మొదలగు ముడిసరుకులతో తయారుచేయబడిన వర్ణలేపముతోనూ, హిమాలయన్ అరిపూస వార్నిషులతోనూ శృంగారించి, సంరక్షించబడుచున్నవి శోధన్- గృహపరిశ్రమల సంఘము, తెనాలివారు ఈపని నిమిత్తము వారి వర్ణలేపశాస్త్రనిపుణుని మూడు మాసములు ఇచటనుండి ఈ వర్ణలేపపరిశ్రమను స్థాపించి నడుపుటకు పంపి యుండిరి ఉత్సాహవంతులగు యువకులను తీసుకొని వర్ణలేపముల తయారీలోనూ, వర్ణలేపములోనూ తర్ఫీయతు ఇవ్వబడును ఉత్తరదేశమున ఉత్పత్తియగు అవిశె విత్తులలో నూటికి రెండు వంతులు మాత్రమే గ్రామములలోని దేశవాళీగానుగలలో పిండి నూనె తీయబడుచున్నది మిగతా ఉత్పత్తి యంతయు నూనె తీయు ఫ్యాక్టరీ యజమానుల చేతిలోనికి పోవుచున్నది గ్రామస్థునకు వేప, వేరుశనగ, అవిశె నూనె మొదలగువాని పూర్తి ఉపయోగము వర్ణలేపము, సబ్బుతయారీలవంటి గ్రామపరిశ్రమలద్వారా తెలియజేయుచో మరికొన్ని దేశవాళీగాను రంగు పని గలుగును గ్రామసులు తమ దేహపారిశుధ్యముకొరకు అవసరమగు సబ్బు ముక్కలకొరకు భారీయంత్రాగారములవంక చూడ నవసరముండదు అటులనే తమ గ్రామకట్టడములను, వ్యవసాయ పరికరములను శృంగారించి సంరక్షించు వర్ణలేపము కొరకు గూడ భారీయంత్రాలయములవంక చూడ నవసరము లేదు దక్షిణదేశమున ఆముదము విరివిగా లభించుచున్నది కాని దీని వాడకము గూడ గ్రామములలో అతిస్వల్పమే ! ఈ ఆముదముతో గూడ వర్ణలేపములను తయారు చేయ వచ్చును ఇచట వర్ణలేపపరిశ్రమను గ్రామసులు చేపట్టి నడిపించుటకు వీలగు పద్ధతులలో నడిపించుచూ, దాని పరిజ్ఞానమును వారికి బోధించి గ్రామములను ఈవిధముగ దేశ సంపదను సంరక్షించగల ముఖ్యవస్తువు వర్ణలేపముకొరకు బొంబాయి, కలకత్తాలలోని భారీయంత్రముల వంక చూడ నవసరము లేకుండ జేయగల్గినచో ఈ విషయమున ప్రతిగ్రామమూ స్వయంసమృద్ధము గాగలదు

పరిశ్రమలు

ప్రతిమానవునకు అన్నము, వస్త్రము, నివాసము ముఖ్యావసరములు గాన ఈ అవసరములను తీర్చు పరిశ్రమలనే ఈ సంస్థ ప్రథమమున నడిపించ తలచినది ఈ దిగువ నుదహరించిన పరిశ్రమలు వెంటనే ప్రారంభించి నడుపబడును వీలయినంతమంది విద్యార్థులకు, నిర్మాణకార్యక్రమప్రచారకులకు ఈ పరిశ్రమలలో తర్ఫీయతు యివ్వబడును ఇచట తర్ఫీయతు పొందిన విద్యార్థి తన గ్రామము చేరి గ్రామపరిశ్రమల ద్వారా సమగ్రగ్రామసేవాదృక్పథముతో గ్రామస్థులకు సేవ చేయుచు తాను స్వకాయకష్టము చేసి జీవితము స్వతంత్రముగా గడుపగల డని ఈ సంస్థ ఆశించుచున్నది ఈ సంస్థ ప్రథమమున తోటపని, వడ్రంగం, పిండి విసురుట, నూనె గానుగ, ఏకుట, వడుకుట, నేయుట, తేనెటీగల పరిశ్రమ, సబ్బుతయారీ చేకాగితము తయారీ, వ్రాతసీరా తయారీ, వర్ణలేపముల తయారీలలో విద్యార్థులకు శిక్షణ నివ్వతలచినది ఈ పరిశ్రమలకు వలయు భవననిర్మాణము పూర్తి కావచ్చినది వివిధపరిశ్రమలలో ఆరితేరిన నిపుణులు కొందరప్పుడే ఇటకు వచ్చియున్నారు మిగతా వారుగూడ త్వరలోనే రాగలరు విద్యార్థులకు వసతిగృహముకూడా వకటి నిర్మింపబడుచున్నది విద్యార్థులు వసతిగృహములోనే ఉండి నవీనవిద్య నభ్యసించుచూ, మిగతా గాంధీనిర్మాణ కార్యక్రమసంస్థలలోవలెనే సక్రమముగా నిర్ణీతసమయమునకు ఆయా కార్యకలాపములను నిర్వర్తించుచుందురు ప్రతి విద్యార్థికి ప్రచారకునకు విధిగా ఈ దిగువ నుదహరించిన కార్యక్రమములో ప్రతి దినము పాల్గొనవలసిన అవసరముండును (1)ప్రార్థన, తోటపని,



బళ్లారిలో బైసాని అన్నయ్యగారి పేరిట "మాతాశిశుపోషణాలయానికి మంత్రి గో. చంద్రమౌళిగారు ప్రారంభోత్సవము జరిపినప్పటి చిత్రం

పిండివిసరుట, వంటచేయుట, అంట్లు తోముట, పారిశుధ్యకార్యము సూత్రయజ్ఞము మొదలగు ముఖ్యవిషయములలో అందరు అనుభవము గడించవలెనని ఆశయము

ఈ ధర్మసంస్థ చేయ సంకల్పించిన ఈ కార్యమునకు ప్రజలు, ప్రభుత్వములు తోడ్పడి ఈ నిర్మాణకార్యక్రమము దేశమున జయప్రదముగా ముందుకు సాగిపోవునట్లు చేయుదురని తలచుచున్నారు ఈ సంస్థ ప్రజకు అందజేయ తలచిన ఈ సదవకాశమును ఉత్సాహవంతులగు యువకులు, గ్రామప్రచారకులు వినియోగించుకొనగల్గుదురనియూ తద్వారా గాంధీతత్వప్రచారము । వాడ వాడల ఇనుమడింపజేయ బడగలదనియూ ఈ ధర్మ సంస్థ ఆశించుచున్నది



సరోజినీదేవి—సుభాష్‌బాబు

భారతరాజకీయాలకు వికాసంతెచ్చిన కళామూర్తి

(7 వ పేజీ తరువాయి)

"భిన్న జాతి మత కులాలవారి మధ్య పొందు కూర్చి కుటుంబం విభక్తం కాకుండా కాపాడ్డానికి కృషి చేస్తాను కుటుంబంలో ఎవరికీ లోపం కలుగకుండా, నిష్పక్షపాతంగా అందరికీ న్యాయం చేకూర్చాలి" కాని ఈ మధురాశయం చేకూరలేదు చేకూరనందుకు ఆమె బాధ్యురాలు కాదు గాంధీజీ ప్రభృతులూ బాధ్యులు కారు ప్రజలలో కొన్ని వర్గాలవారు బాధ్యులు

రాజకీయరంగంలో అగ్రనాయకశ్రేణిలో చేరినప్పటికీ, ఆమె ఎన్నడూ ఎవరిపైనా పెత్తనం చలాయించలేదు పెద్దసమస్యలలో నాయకులందరూ కొట్లు మిట్లాడి, వాక్కలహాలకు దిగినప్పు డెల్లా ఆమె వారిమధ్య స్నేహ సుహృద్భావాలు చేకూర్చేది అతి క్లిష్టసమస్యల్ని చర్చించ సమయంలో కూడా ఆమె చతురంగా మాట్లాడి నాయకుల వ్యథితహృదయాలకు కొంత శాంతి నిచ్చేది

సరోజినీదేవిని ఎరిగినవా రెవ్వరికీ ఆమెపట్ల ఎట్టి ద్వేష విరోధభావాలు కలిగిన దెప్పుడూ లేదు ప్రత్యర్థులు, పరదేశపాలకులు కూడా ఆమెను ప్రశంసించేవారు ఆమె సౌజన్యత అందరికి తెలిసినదే చనువు తీసుకుని అందరినీ ఒకేరీతిగా పరిగణించేది గాంధీజీవద్దకూడా చాలా చనువుగా ఉండేది గాంధీజీకి సత్యాగ్రహోద్యమ దినాలనుంచీ నిత్యసన్నిహితవర్తియై ఉండేది కారాగారవాసంలో గాంధీజీతోనే కలిసి ఒకేచోట ఉండేది గాంధీజిని రాహారదీక్షు లూనినప్పు డెల్ల ఆమె దగ్గర ఉండవలసిందే ఒక పర్యాయం గాంధీజీ నిరాహారదీక్ష విరమించినప్పుడు సరోజినీదేవి స్వయంగా నిమ్మకాయ రసం ఇచ్చింది గాంధీజీ హాసవదనం చూసి "పెళ్లికొడుకులా ఉన్నావు" అన్నది "నువ్వు పెళ్లికూతురైతే నేను పెళ్లికొడుకు నవడానికి సందేహించ నక్కరలే"దని గాంధీజీ సమాధాన మిచ్చాడు

విద్యార్థు లొకసారి గాంధీజిని ఉపన్యసించమని కోరగా హరిజననిధికి రు 2 వేలు ఇస్తేసరే నన్నాడు "ఆకోమటి నెందు కడుగుతారు కోమటి కెప్పుడూ ధనాశే హెచ్చు" అన్నది సరోజినీదేవి ఒక విద్యార్థి "మీరే ఇలా ధనం ఆర్జించ బూనుకుంటే కోటీశ్వర్లు కావచ్చు న న్నాడు "నే నెన్నడూ డబ్బుకి చేయి చాచను కోమటి కొంటె అత నడిగాడు నేను ఉన్నత బ్రాహ్మణ బిడ్డని, దానం ఇవ్వడమేగాని తీసుకోవడం ఎన్నడూ ఎరగను" అని సమాధాన మిచ్చింది గాంధీజీవద్ద ఇంత చనవు తీసుకోగల కాంగ్రెసు నాయకుడు ఎవ్వడూ లేడు

ఆమెతో సంభాషించడం చాల ఆనందదాయకంగా ఉంటుంది కాని హాస్యంలోనైనా అన్యాయంగా అనుచితంగా మాట్లాడి ఎరుగదు నిశితజ్ఞానం, వివేకం ఉట్టిపడుతుంది

సౌందర్యాకర్షణ అనగా ఎటువంటి దని ఒకరు సరోజినీదేవిని ప్రశ్నించారు "అది స్త్రీలో ఒకవిధమైన వికాసం అదే ఉంటే స్త్రీకి ఇతర శృంగారసంభార మేమీ అవసరం ఉండదు అది లేకపోతే ఎన్ని తెచ్చిపెట్టుకున్నా వచ్చేదికాదు కొందరు స్త్రీలు అందర్నీ ఆకర్షిస్తారు. కొందరిలో ఆకర్షణ తమవారికే కనిపిస్తున్నది మరి కొందరిని చూస్తే ఆకర్షణనేది ఎవరికీ కలగదు" అని సమాధాన మిచ్చింది

సరోజినీదేవి చాల రోజులుగా అనారోగ్యంగా ఉంది అనారోగ్యంలో కూడా ఎన్నడూ కార్యవిధులు విడువలేదు సరిగదా, వానిని నిర్వర్తించడంలో ఉత్సాహం ఆవంతకూడా తరగలేదు గత బుధవారం తెల్లవారుజామున సరోజినీదేవి నిద్రనుంచి మేలుకున్నది. ఉపచారం చేస్తున్న శ్రీమతి శర్మను పాటలు పాడమన్నది అందులో నిమగ్నురాలై ఉండగా అకస్మాత్తుగా దగ్గుతెరలు వచ్చి, వెంటనే హృదయస్పందనం స్తంభించిపోయింది కాని మృతిచెందినా ముఖంలో విలక్షణాలే లేవు అంత్యక్రియలముందు ఆమెను ఊరేగించి తీసుకుపోతుండగా చూడవచ్చిన ప్రజ లందరికీ సరోజినీదేవి సుఖసుషుప్తిలో ఉన్నట్లు మాత్రమే కనిపించింది

సరోజినీదేవిజీవితచరిత్ర కూడా గాంధీ నెహ్రూల జీవితాలవలె భారతస్వాతంత్ర్యోద్యమచరిత్రయే జీవితమంతా రాజకీయాలకే అంకిత మయింది ఆమెమధురోపన్యాసాలకీ స్నేహసౌజన్యానికీ కాంగ్రెస్‌నాయకులందరూ ముగ్ధులే

నాయకులలో ఎన్ని అంతఃకలహా లున్నా అవి ఆమె నంటలేదు అందరూ ఆమెను సమానంగా స్వంతసోదరిగా పరిగణించేవారు పండిట్ నెహ్రూ చెప్పినట్లు సరోజినీదేవి సర్వప్రియ పాతిక సంవత్సరాలు నిరంతరాయంగా కాంగ్రెస్ కార్యవర్గంలో సభ్యురాలుగా ఉంది 1947 లో అఖిల ఆసియా వ్యవహార సమావేశానికి ఆమె అధ్యక్షత వహించింది సర్వదేశప్రతినిధుల ఆదరగౌరవాలనూ ఆమె ఆకర్షించింది ఈ అధ్యక్షపదవిగాని, కాంగ్రెస్ అధ్యక్షపదవిగాని, సంయుక్తరాష్ట్రాల గవర్నరు పదవిగాని ఆమె కే క్రొత్తమెరుగూ తెచ్చిపెట్ట లేదు ఆమెవల్ల ఆ పదవులకే మెరుగు వచ్చింది

కాంగ్రెస్‌సంస్థ వ్యవహారాల్లో ఆమె ప్రధాన పాత్ర వహించింది ముప్ఫయి సంవత్సరాలుగా కాంగ్రెస్ ఉద్యమంలో అగ్రనాయకులుగా, పరస్పరసహనప్రేమలతో వర్తించినవారందరికీ ఆమెమృతితీరని లోటు కలిగించింది కాంగ్రెస్ రాజకీయాలనుంచి, వెలుగు, మధురవాణి అంతరించిం దని సన్నిహిత మిత్రులైన నెహ్రూ ప్రభృతులు సంతాపపడుతున్నారు కష్టసుఖాలలో ఒకరికొకరు అండగా ఉన్న సోదరులలో ఒకరు గతించినప్పుడు మిగిలినవారికి లోకం చీక టయింది గాంధీజీ, సరోజినీదేవి రాజకీయ రంగంనుంచి విరమించడంతో రెండు వెలుగులు ఆరిపోయిన ట్లుంది

——

యూరోపియన్ పార్లమెంట్

(8-వ పేజీ తరువాయి)

కార్యక్రమం నిర్ణయించింది ఈ పార్లమెంట్‌లోకి పశ్చిమజర్మనీ, అనగా బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి సైన్యాల ఆక్రమణలో ఉన్న మూడు ప్రాంతాలూ కలిసి, ఒక్క రాజ్యంగా ప్రవేశపెట్టబడుతుంది తూర్పుయూరప్‌రాజ్యాలనుంచి ప్రభుత్వా లెల్లాగూ ఈ పార్లమెంట్‌లో పాల్గొనవు అందువల్ల ఆ దేశాలనుంచి ఎవరు వచ్చినా సరే, పార్లమెంట్‌లో పాల్గొని యూరప్ వ్యవహారాల్లో నిర్ణయాలపైన వోట్లు వెయ్యవచ్చు నని నిర్ణయించారు

ఈ పార్లమెంట్‌కు సభ్యులను వివిధదేశాల పార్లమెంట్‌లు ఎన్నుకుంటాయి సభ్యుల్ని ఎన్నుకోవడంలో ఏదేశమూ ఫలానిపద్ధతి అవలంబించాలనే నిర్బంధం లేదు పార్లమెంటరీ పార్టీలన్నిటికీ ప్రాతినిధ్యం ఇవ్వాలో, ప్రభుత్వ పార్టీలకే ప్రాతినిధ్యం ఇవ్వాలో, ఆయా దేశాలు ఇష్టం వచ్చినట్లు నిర్ణయించవచ్చును పార్లమెంట్ సభ్యుల మొత్తం 300 కు నిర్ణయించారు

ప్రతిసంవత్సరం కనీసం 45 దినాలు సమావేశమై యూరప్ దేశాలన్నిటికీ సంబంధించిన వ్యవహారా లన్నిటినీ చర్చించవచ్చును

ఈ పార్లమెంట్ చర్చించే వ్యవహారాల్లో దేశరక్షణ తప్ప మరొకటి ఏవిషయంపైనా ఒక దేశానికీ మరొకదేశానికీ ఎల్లాగూ పొందు కుదర దన్న వారందరికీ తెలుసు అందువల్లనే ఇటువంటి [illegible]ంట్ స్థాపించాలని చాలకాలంనుంచీ [illegible]న జరిగినా, ఆదేశాలమధ్య సమాధానం [illegible]రక ఏకార్యక్రమం నిర్ణయించబడ లేదు అమెరికా ఆర్థికసహాయం పొందడానికి ఒక సమగ్రమైన కార్యక్రమం తయారుచెయ్యడానికే సమాధానం కుదరలేదు ఇప్పుడు రష్యాతో వ్యవహారాలు తల మునుపుకొచ్చేసరికి పార్లమెంట్ కుదిరి వచ్చింది

ఈపార్లమెంట్‌కీ, ఉత్తర అట్లాంటిక్ పాక్ట్‌కీ సన్నిహిత సంబంధం ఉంది ఉత్తర అట్లాంటిక్ పాక్ట్ దేశాలన్నీ ఇందులో పాల్గొంటున్నాయి ఈపాక్ట్ తప్ప ఈపార్లమెంట్‌వ్యవహరించడానికి మరొక ప్రధానవిషయమే ఉండదు

అట్లాంటిక్ పాక్ట్

యుద్ధంవల్ల ఆర్థికస్థితి ధ్వంసమైన యూరప్ దేశాల్లో మార్షల్ ప్లాన్ ప్రవేశపెట్టి, ఇటువంటి పాక్ట్‌కు అమెరికా 1947 జూన్ నెల లోనే పునాది వేసింది

పశ్చిమయూరప్ రాజ్యాలన్నీ అమెరికావల్ల ఆర్థికంగా పునరుజ్జీవిత మైనట్లు తలెత్తాయి కాని నిత్యం అమెరికాపైనే ఆర్థికంగా సహాయపడక తప్పడం లేదు తూర్పు యూరప్‌రాజ్యాలన్నీ బాగో ఓగో స్వయంకృషిపైనే ఆధారపడి ఆర్థికపునర్నిర్మాణం కొనసాగించాయి అవి రష్యానాయకత్వంకిందకి వెళ్లాయి

పశ్చిమయూరప్ దేశాలు మాత్రం మున్ముందు యుద్ధం వస్తే పోరాడే స్థితిలో లేవు అమెరికాయే వాటికోసం పోరాడవలసిన గతి పట్టింది దేశరక్షణవ్యవహారాల్ని అమెరికాఆజ్ఞల ననుసరించి నిర్వర్తించుకోడానికి అవి అంగీకరించాయి ఈ దేశాలపైన రష్యా దండెత్తి వస్తే అమెరికా వీటిని రక్షిస్తుంది నార్వే, స్వీడన్, డెన్మార్క్ దేశాలనికూడా ఆహ్వానించాయి స్వీడన్ తటస్థవిధానానికి భంగం కలిగించుకోరాదనే నిశ్చయంతో పాక్ట్‌లో చేరడానికి అంగీకరించలేదు నార్వే డెన్మార్క్‌లు పాక్ట్ సంప్రదింపుల్లో పాల్గొనడానికి సమ్మతించాయి రష్యాపైన యుద్ధానికి అమెరికాకు ఇదొక్కటే చాలదు

పాక్ట్‌లో చేరితే అమెరికావల్ల లభించే సహాయం రెండు విధాలు పాక్ట్ దేశాలపైన ఏదేశమైనా దురాక్రమణ జరిపితే, అమెరికా తన బలాలతో వచ్చి రక్షిస్తుంది కాని రష్యా దాడి చెయ్యకపోవచ్చును తూర్పు యూరప్ దేశాల్లో కమ్యూనిస్టుపార్టీలే విప్లవాలు తెచ్చి ప్రభుత్వాల్ని పడగొట్టాయి కమ్యూనిస్టులు అధికారంలోకి రాగానే అంతర్జాతీయ వ్యవహారాల్లో రష్యావర్గంలో చేరిపోయాయి ఇది దురాక్రమణ కాదు దాడి కాదు అందువల్ల కమ్యూనిస్టు విప్లవాల్ని అణచివెయ్యడానికికూడా అమెరికా ఆయుధసామగ్రి నిచ్చి, అవసరమైతే సైన్యాల్ని పంపి సహాయపడుతుంది

ఉత్తర అట్లాంటిక్ పాక్ట్‌లో చేరే దేశాలకి ఈ రెండు విధాలా సహాయం చెయ్యగలదని అమెరికా ప్రకటించింది

ఇందులో రెండో విధానం గ్రీస్‌లో అమలు జరుగుతున్నా కమ్యూనిస్టుల్ని ఇంతవరకూ అణచలేకపోతున్నారు ఒక వైపున పరపతి లేని ప్రభుత్వం అమెరికన్ మిలిటరీ సహాయంతో కమ్యూనిస్టుల్ని అణచలేక ప్రజల్ని క్షోభపెడుతున్నారు మరొకవైపున అమెరికన్ మిలిటరి సహాయం కోరినవారనెల్లా కమ్యూనిస్టులు నాశనం చేస్తున్నారు ఇప్పటికి రాజకీయవాదుల్లో చాలామందికి పరిస్థితులు విసుగు కలిగించాయి మాకు ఎవరిసహాయమూ వద్దు, మా దేశాన్ని కల్లోలానికే విడిచివెళ్లండని మితవాదనాయకులంతా (లిబరల్స్) చెప్తున్నారు అన్యదేశాలమద్దతు, ప్రేరేపణ లేకపోయినట్లయితే ఇదివరకే రెండుపక్షాలమధ్య ఏదో సమాధానం కుదిరి ఉండే దని చెప్తున్నారు

దీనివల్లనూ, చీనాలో అనుభవంవల్లనూ అమెరికా సహాయం ఎంతవరకూ ఉపకరిస్తుందో సందేహంగా ఉంది

బ్రిటిష్, ఫ్రెంచి, ఇటాలియన్ కమ్యూనిస్టులంతా రష్యాతో పశ్చిమయూరప్ దేశాలకు యుద్ధం వస్తే, రష్యాపక్షాన, ప్రభుత్వాలకు విరుద్ధంగా పోరాడగల రని బెదిరించారుకూడా

భద్రతామండలికి డచ్ ధిక్కారం

ఇండోనీషియాలో రిపబ్లిక్ నాయకుల్ని వెంటనే విడుదలచేసి, స్వాతంత్ర్యం ఇవ్వడానికి కార్యక్రమం తయారుచేయాలనీ, ఐక్యరాజ్యసమితి నియమించిన కమిషన్ కార్యనిర్వహణకు సహకార మివ్వాలనీ భద్రతామండలి ఇచ్చిన ఉత్తరువును డచ్‌ప్రభుత్వం ధిక్కరించింది ఇండోనీషియన్ ప్రజలకి స్వాతంత్ర్యం ఇచ్చెయ్యడమే తమ లక్ష్యం కూడాననీ, అయితే, భద్రతామండలిఉత్తరువును మాత్రం పాటించజాలదనీ డచ్ ప్రభుత్వం ప్రకటించింది

జాతీయోద్యమంలో కలియక, దేశవిచ్ఛిన్నతకు యత్నిస్తున్న ఫెడరలిస్టులకు మద్దతిచ్చి డచ్ ప్రభుత్వం రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ జరుపుతోంది రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ ఫార్సులు మన దేశీయులకు బాగా అనుభవం దేశహితాన్ని కోరేవారిని కాదని, ప్రజల్ని మోసపుచ్చడంకోసం దేశహితం కాక అధికార పదవులే ప్రధానంగా ఎంచేవారికి రౌండ్‌టేబుల్‌స వద్ద ప్రాధాన్యమిస్తారు ఎప్పుడు ఫెడరలిస్టుల్ని అడ్డుపెట్టి బూటకపుస్వాతంత్ర్యం ఇచ్చి, వాస్తవమైనస్వాతంత్ర్యోద్యమకారుల్ని అణగదొక్కి చిరకాలం అక్కడే నివాసంచెయ్యాలని డచ్చివారి ఎత్తు రిపబ్లికన్ల నందరినీ విడిచిపెట్టి, వారి ప్రభుత్వాన్ని జాతీయప్రభుత్వంగా గుర్తించేవరకూ డచ్‌వారితో సమాధానానికి సంప్రతింపులకూ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులకూ అంగీకరించ నని రిపబ్లికన్ అధ్యక్షుడు డా॥ సోకర్నో ప్రకటించాడు

డచ్‌వారి రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ ఉత్త మోసమనీ, భద్రతామండలిని కాదని స్వేచ్ఛగా వర్తించడంకోసం వారు పన్నిన తంత్రమనీ, ఐక్యరాజ్యసమితిచే నియమించబడిన కమిషన్ భద్రతామండలికి నివేదించింది భద్రతామండలి ఈవారం ఈవిషయమై చర్చిస్తోంది

——

గ్రంధస్వీకారము

రాయలసీతి కధలు

1, 3 భాగములు కర్త, డా గిడుగు వెంకట సీతాపతి బి ఎ యెల్ టి డి లిట్ ప్రకాశకులు రాయలు అండ్‌కో—పబ్లిషర్సు, కడప, వెల (1 భా 0-4-0, 3 వ భా 0-6-0)

ప్రణయార్పణము

(కీ॥ శే పెమ్మరాజు లక్ష్మీపతిగారి ఖండకావ్యముల సంస్కరణ సంపుటి) ప్రకాశకులు అ నాగగోపాలరావు పద్మా ప్రచురణలు, ఏలూరు వెల 1-8-0

తెనుగు వనము

గ్రంథకర్త, కొసరాజు బసవయ్య విద్వాన్ ప్రకాశకులు, కొండపల్లినాగయ్య లాల్ ప్రింటింగ్ ప్రెస్ గవర్నర్‌పేట, బెజవాడ. వెల 2-0-0

అవ్వకి పోటీ

పిల్లలకి ప్రియమైన కథ రచన వల్లైయప్ప అనువాదం గిరిధర్ బాబు కార్యాలయం 4. రట్లెండు గేటుకాలని. కెతీడ్రల్ మదరాసు. 6 వెల 0-2-0

మామిడిఅంట్లు, చీడపురుగులు

శ్రీ పెనుమాక శేషగిరిరావు

వ్యాపారరీత్యా మన ప్రాంతాలలో ముఖ్యమైన మామిడి అంట్లు ఆయా పరిసరాలకు వ్యవసాయమునకు పనికి వచ్చును.

ఉత్తర సర్కారులలో చిన్న స్వర్ణరేఖ-దత్త మండలాలు ఉత్తరసర్కారులలో బంగనపల్లి తయారౌచున్నవి చిన్నరసం మరి ఇతర రసాలు ఉత్తర సర్కారు లంతా విరివిగా పెంపొందించబడుచున్నది మద్రాసురాష్ట్రమంతా గూడా బంగలోరా నీలం, వక్క మదరాసు పరిసరాల్లో రుమని తయారౌతున్నవి సేలం, కోయంబత్తూరులలో ఖాదర్, పీటర్; చిత్తూరు, ఆర్కాటు (ఉత్తర) లలో వల్గోవా, పశ్చిమ తీరంలో ముందప్ప మొదలైనవి సేద్యింపబడుచున్నవి

హిమాంపసంద్, జెహాంగీరు, హిమాయుద్దీన్ మొదలైన పరుపుపండు వ్యాపారానికి పనికి రావు కేవలము రకమునకు తయారుచేయబడును

జెహాంగీరు, హిమాయుద్దీన్ అమ్మిన ఎంతో మంచి ధరలే వచ్చును కాని ఒక్కొక్కసారి ఫలితమునకు రావు బంగలోర నీలం అన్ని పళ్లను మించిన రకం ఏలనన, అది తప్పక ఫలితమునకు వచ్చి మంచిరంగు కలదై తయారగును ఎంతకాలమైనను నిలువ యుండును వత్తిడి తగిలినప్పటికీ త్వరగా చెడిపోవు కాని వీనినే మామిడి మిడుత ఆకర్షించును ఆకర్షించి పండు ఒకభాగమును పూర్తిగా చెడగొట్టును

బాగా పెరగనివీ, వ్యాపారమునకు పనికి రానివీ, అనగా రకమునకు తయారుచేయునవి వ్యాపారమునకై పండించుతోటలలో వేయరాదు

ఒకే రకము విరివిగా పెంచరాదు ఒకేరకము వేయుటవలన పంట కోత సమయమందు చాల కష్టము అన్ని ఫలములూ పండునది ఒకసారే గనక, కోయుటలో ఆలస్యమైనయెడల కొన్ని చెడిపోవును వివిధరకములు పాతవలెను

విత్తనమునకై అంట్లు మంచివి దొరకుట అతి దుర్లభము ప్రస్తుతము వ్యవసాయశాఖవారు కోడూరు, తాలిపరంబలోను ఏర్పరచిన చోట్లను ముందుగా వ్రాసి వలసిన అంట్లు తెప్పించుకోవలెను

ఇవి వ్రాసి తెప్పించుకొనటలోనూ కొన్ని ముఖ్య గమనికలు గలవు వాని ననుసరించినయెడల మంచి పంటలు గలిగి లాభదాయకము అగును

(అ) అమ్మువానివద్దనుండి గ్యారంటీపత్రమును ఇచ్చినవి ఫలవంతమగునని తీసికొనవలెను

(ఆ) అంటుకట్టుటకు కోసినచోటునుండి, ప్రకాండమువరకును సమానమైన లావు వున్నదో లేదో పరీక్షించవలెను వాని కలయిక ఆరోగ్యకరమై, బలమైనదై, ఏచుక్కలు లేకుండ వుండవలెను

(ఇ) అంటుగాని, కలియిక సంధిగాని తొమ్మిదినుండి పదునెనిమిది అంగుళముల లోపల భూమిపైన వుండవలెను

(ఈ) అంటుకొనెడి సమయమునకు ఒక నెల ముందుగా అసలు చెట్టునుండి అంట్లు వేరు చేయబడవలెను

మొక్కలు ఆరోగ్యకరమై గుబురుగా పెరుగుచుండవలెను నవత్వము శోభిల్లవలెను మొక్కల ఆరోగ్యమును, వాని కే పురుగూ పట్టకుండ కాపాడుచుండవలెను

ఈ మొక్కలకు అనేకరకములైన పురుగులు పట్టును

(క) మామిడి మిడుతలు ఇవి చెట్లు మామిడి పూత పెట్టుటతోడనే వానిని చెడగొట్టి కాయ కుండా చేయును దీని నివారణార్థం చేపనూనె గాని, సబ్బునీళ్లనుగాని చల్లవలెను

(ఖ) మామిడిపండు ఈగ పండ్లు నవనవలాడు సమయమున ఈ పురుగులను ఆకర్షించును ఈ ఈగలు ఆ పండ్ల తొడిమలలో గుడ్లుపెట్టి నివాస మేర్పరచుకొనును

ఈ గుడ్లవలన పండుఅంతయు చెడిపోవును వీనిని నాశనము చేయుటకు ఆ పండు నంతవరకు తుంచివేయుటయే మంచిపని లేక విషసంబంధమైన వస్తువులతో క్రిమి కీటకాదుల హతమార్చవలెను

(గ) మామిడిచెట్లు తొలిచెడి పురుగు చెట్లలోనికి ప్రవేశించి చెట్టును తొలిచి నాశనము చేయును చెట్టు ప్రాణానికి ఇది చెదలవంటిది ఎక్కడ ఇది కనిపించిన అంతవరకు చెట్టుభాగం చెక్కివేసి తారు పూయవలెను తక్కిన పురుగులనుగాని, గుడ్లనుగాని క్లోరోఫారంతో ముత్తెక్కించి లోలోపలనే హతమార్చవలెను లేనియెడల ఇది చెట్టున కెంతో హానికరం

ఈ విధముగా పురుగులను, చీడను, నివారణమొనర్చి పండ్లు పక్షులనోట పడకుండా ఫలితమునకు వచ్చునటుల చేయవలెను రకరకములు పండించుటయే అవసరమైనపని - లాభదాయకం

స్త్రీ హృదయం

(౯-వ పేజీ తరువాయి)

వస్తూ ఉంటే ఏమీ ఎరుగనట్లు గబగబా పోయి పడుకొన్నాను

శాంతవద్దకు వెళ్లాలని ఆరాటపడ్డాను ఆ పిశాచం ఇంకా నిద్రించడం లేదని అనుకొని ఓ గంటదాకా అల్లాగే కదలకుండా పడుకొన్నాను. రాజారాం నాకు రాక్షసుడిలాగ, దెయ్యంలాగ కనిపించాడు హేయపదార్థంలాగ నీచాతినీచంగా అసహ్యంగా తోచాడు హృదయంలో తుఫాను చల్లారడం లేదు వీధిగుమ్మం తెరచి రాధగదిదగ్గరకు వెళ్లి పిలిచాను వందసార్లు పిలిచినా లేవలేదు చివరకు లేచింది శాంతను లేపమన్నాను ఆమె శాంతగుమ్మందగ్గరకు వెళ్లి ఎన్నోసార్లు పిలిచింది ఆమె కూడా మొద్దునిద్రలోనే ఉంది నా కేదో పెద్ద భయంగా ఉంది రాధ "అక్కయ్యా, ఎంతపిలిచినా శాంతక్క లేవడంలేదు ఎంచేతనో గాని నువ్వు అల్లా వచ్చి లేపమంది నేనుకూడా శాంతను పిలుస్తూ అటు కేసి వెడుతున్నాను రాజారాం కూడ లేచి నాతో వచ్చాడు శాంతగదిలో దీపం లేదు అంతా చీకటిగా ఉంది హాలులో ఉన్న లాంతరు పట్టుకొని పరుగెత్తాను ఆ దృశ్యం చూచేసరికి నా ప్రాణం ఎగిరిపోయింది ఆమె వళ్లంతా గాయాలతో నిండిఉంది అస్తవ్యస్తంగా, రక్తం డాగులతో గుడ్డలు భయంకరంగా ఉన్నాయి రాధ ఏడ్పు మొదలుపెట్టింది నాకు నోరు పెగలే లేదు మ్రాన్పడి చూస్తున్నాను రాజారాం ఆమెనాడి పరీక్షిస్తున్నాడు రాధను ఊరుకోమన్నాడు గుండెలు పరీక్షించాడు నాడి మళ్లీ చూశాడు పెదవి విరిచాడు 'శాంత చనిపోయిం' దన్నాడు

"ఏమండీ! రాత్రి పడుకొనేవేళకు ఏమీ రోగం లేదే! ఆనందంగా ఉందే! ఇదెలా సంభవించింది?" అంది రాధ ఏడ్పు మొగంతో

"ఏమోగాని ఆత్మహత్య చేసుకొన్నట్లుగా ఉంది" అన్నాడు తప్పతప్పగా రాజు

"ఆత్మహత్యా! అంత అగత్యం ఏమి వచ్చింది?" అంది రాధ

అబ్బే, అల్లా జరగదని, యీ విషయం తరువాత విమర్శించుకొందామని, ఏడువవద్దని, నల్గురికీ తెలియకుండా దహనం చేయించాలి అనీ, ఆత్మహత్యే అని తెలిస్తే మనం చిక్కుల్లో పడిపోతామనీ భార్యను నోరెత్తకుండా చేశాడు వెంటనే గాయాలు కడిగివేసి ఆ దుస్తులు విప్పి మంచి దుస్తులు కట్టాడు ఆమెకు నా సహాయంతో ఆమె కట్టుకొన్న దుస్తులు తగలబెట్టివచ్చాడు మామూలుగా నిద్రపోతూఉన్నట్లుగా మంచం మీద పడుకోబెట్టాడు

"రాత్రి విపరీతంగా శూలనొప్పిచేత బాధపడి చనిపోయిందని చెప్పాలి రేపు అందరితోనూ" అన్నాడు రాజారాం

"అయితే, అసలు కారణం మీ కేమయినా తెలిసిందా? ఊహించగల్గారా?" అంది రాధ

"ఏమీ అర్థం అవడంలేదు కావలసే చేసుకొందేమో, అన్నాడు రాజు"

"అయితే, వళ్లంతా ఆ గాయాలు ఎందుకు వచ్చాయో" అంటూ ఇంకేదో రాధ అనబోతూంటే రాజారాం నోరుముయ్యి అన్నట్లు తీవ్రంగా చూచాడామెకేసి

"పడుకోబోయేటప్పుడు ఎన్నో కబురులు చెప్పింది తెల్లవారేసరికి తన మొగుడు వచ్చివేస్తారంది యీ రెండురోజుల్లో ఎంత చిక్కిపోతారో కదా అని విచారించింది అంత ఆరోగ్యంగా ఉన్నది ఇంతలో ఇల్లా చచ్చిపోవడం ఆశ్చర్యంగా ఉందని రాధ అంటూంటే. రాజారాం "అయితే నీ గొడవ నీదేనా, ఊరుకొంటావా, లేకపోతే శాంతచావుతోపాటు మన అందరి చావులూ కోరుతున్నావా! గోడలకి చెవులుంటాయే" అని శవం ఇంటినుంచి బయటకు పోవడానికి ప్రయత్నం చెయ్యడంకోసం బయటకు వీధిలోకి వెళ్లిపోయాడు ఎంతనటన, ఏమీ ఎరుగనట్లుగా ఎంత నటిస్తున్నాడు! నిండుజీవం పుచ్చుకొన్నాడే యీ ఘాతుకుడు అనుకొన్నాను యథార్థం అంతా రాధతో చెప్పివేయాలని తలిచాను దానివల్ల నా కేమి ఆపత్తులు వచ్చి పడతాయో అని చెప్పలేదు ఆ తల్లి మానసంరక్షణకోసం ఎంతసులువుగా అసువులర్పించింది! ఎంత పవిత్రురాలు గదా అనుకొని భక్తిశ్రద్ధతో ఆమెకు మనస్సులోనే ప్రణమిల్లాను ఇటువంటి సాధులుండబట్టే ఇంకా ప్రొద్దు పొడుస్తున్నదని ఎంచాను నా హృదయంలోని సంగతి రాధకు చెప్పలేకపోయినాను ఎందుకీ బెడద తెల్లవారితే నాభర్త వస్తారు రాకపోయినా నేనే వెళ్లిపోతాను. ఈ పులిగుహలో ఇంకో నిముసంకూడ ఉండను, ఉండలేనని అనుకొన్నాను

వాళ్లూ వీళ్లూ ప్రోగయ్యారు. శవాన్ని తీసుకుపోవడానికి ప్రయత్నం చేస్తున్నారు.

ఇంతలోనే పోస్టు బంట్రోతు నా కో రిజిష్టరీ ఉత్తరం ఇచ్చి నాచేత సంతకం చేయించుకొని వెళ్ళిపోయాడు నాకు ఉత్తరం ఏమిటా అని చూస్తే నాభర్తే వ్రాసినట్లు కనిపించింది ఉత్తరం చూడగానే ఒడలు కంపించింది ఏదో పెద్ద మంట హృదయంలో ప్రజ్వరిల్లింది వణకుతూ ఉన్న చేతులతో కవరు చింపాను ఇల్లా వ్రాసి ఉంది

"ప్రియమైన అన్నపూర్ణకు,

నా యీ లేఖ నీకు తాత్కాలికంగా విచారం కలగజేసినా, చివరికి నీకు పరిపూర్ణసుఖం చేకూర్చగలదని నా యూహ

పెండ్లి అయి 10, 12 సంవత్సరాలయింది ఆదాది నేను నీ కేమీ సుఖం ఆనందం కూర్చలేకపోయాను కోరినవన్ని వస్తువులు, బట్టలూ సమకూర్చలేకపోయాను కారణం? నా దారిద్ర్యం నువ్వు పల్లెత్తుమాట అనకుండా సహించుకుంటూ వచ్చావు అవి లేవు, ఇవి లేవని మనస్సులో బాధపడి నాపైకినా దగ్గర ఎప్పుడూ అనలేదుగాని నీహృదయంలో యీ విషయంలో నీ కెంతవిచారం, నైరాశ్యం నిండి ఉన్నాయో నేను గ్రహించుకోగలిగాను

ఇటువంటి అసమర్థుడైన భర్తను స్త్రీ ఎందుకు త్రికరణాలా ప్రేమించాలి? ప్రేమిస్తూ ఉన్నట్లు పైకి నటించడంకూడా కొందరు స్త్రీలు కలవాటు నీ వటువంటిదానివి అదీగాక నే నెప్పుడూ నిన్ను అనుమానదృష్టితో చూస్తూ ఉంటానని, నీ స్వేచ్ఛకూ, సంతోషానికీ ఆటంకం కలుగజేస్తూ ఉంటాననీ నీ వనుకుంటూ వుంటావు నాభార్య ఆదర్శస్త్రీ కావాలని నావాంఛ ఇదే నీకు చెప్పేవాడని నీ కర్థం కాకపోవడంచేత నామాటలు, నా చేతలూ నీకు బాధగా ఉండేవి ఎంత ప్రేమగల ఆడదైనా తనకళంకం భర్తతో చెప్పడానికి సాహసిస్తుందా? పురుషుడిలాగ స్త్రీ చెప్పివేయడానికి సమాజం ఆమెకు హక్కు ఇచ్చియుండలేదు భర్త చూస్తూ ఉండగా గానీ, చూడని వేళలలో గానీ చేసిన తప్పులు తల్లిదండ్రికో చెప్పగలుగుతుంది గాని భర్తతో చెప్పలేదు ఇది నేను బాగా ఎరుగుదును నీవు నాదగ్గర నిష్కళంకంగా ప్రవర్తిస్తున్నా, నన్ను ద్రోహం చేయాలని ఎప్పుడూ తలచకపోయినా, నీమనస్సెంత మెత్తనిదో, ధూర్తుడెవ్వడైనా నీ చెయ్యి పట్టుకుంటే అల్లరిఅయిపోతుందనే భయంతో నీ కిష్టం లేకపోయినా అతడికి లోబడిపోయే స్వభావం గలదానవని నే నెరుగుదును నీవు నిజంగా వట్టి అమాయకురాలవు నాదృష్టిలో ఇంతకు మించి ముందుకు వెళ్లే స్త్రీ కావాలి అంటే అటువంటి సమయాల్లో ప్రాణత్యాగం చేసియైనా మానసంరక్షణ చేసుకొనే స్త్రీ కావాలి ఆ శక్తి నీలో లేదని గ్రహించాను అంత ఉత్తమురాలే నా భార్య అయితే ఆమె కాళ్లు కడిగి నెత్తిపై చల్లుకుంటాను దేవిగా భావించి పూజిస్తాను కాళ్లునొక్కుతాను ఉపచారాలు చేస్తాను నీ వటువంటిదానివే అనుకుంటూ, మళ్లీ అనుమానిస్తూ ఇల్లా బాధపడ్డాను మొన్న సినీమాకని వెళ్లి టిక్కెట్లు దొరకక తిరిగి వచ్చినప్పుడు కిటికీలోనుంచి నీ కౌగిటిలో నున్న ఇంకో పురుషుని చూచాను దీపం వెలుతురులో కళ్లారా స్పష్టంగా చూచాను రాజారాం మాట త్రోసివేయలేని తేలికమనస్సుగలదానవని భావించాను అన్నీ ఎరిగియే అటువంటి పరిస్థితిలో నిన్నక్కడ ఎందుకుండనిచ్చానా అని నా పొరపాటు తెలిసికొని ఏడ్చాను అయినా నీ శీలం గట్టిదని నీమాటలవల్ల నమ్మాను నే నక్కడకు వస్తూఉన్నప్పుడు నీ వంత వెలవెలపోతూ, నిరుత్సాహంగా ఉండడానికి కారణం గ్రహించాను ఎన్నిసార్లు నిన్ను ఇంటికి తీసుకొని వచ్చివేద్దామన్నా ఆయా పరిస్థితులు ఆటంకపరిచాయి నీ ఆచరణ, నీ భావం అర్థమయ్యాయి

నా నఖశిఖపర్యంతం సమ్మెటపోటులతో కుమిలి పోయినట్లుగా ఉంది నామనస్సు ఘుమఘుమలో పెట్టినట్లుగా ఉంది ఎన్నాళ్లని యీ విచిత్రగాడితో నీకు బాధ! నీకూ నాకూ శాంతి నిచ్చు తరుణోపాయం కనిపెట్టాను నేను నిన్ను ఏ విధాలా, ఏవిధంగానూ సుఖపెట్టలేను పైగా ఇంకో విధంగా నీ వానందిస్తూ ఉంటే చూచి సహించలేని అధమాధముడిని నేను త్రికరణాలా నీసుఖం, ఆనందం కోరుతున్నాను నీవు హాయిగా, ఉంటే చాలు నీకు నా యీమాటలు పోటులు, అనుమానహింసలూ లేకుండా నీమార్గం నిష్కంటకం చేస్తున్నాను నే నాత్మహత్య చేసుకొంటున్నాను

నాకోసం విచారించకు. లోకంకోసం ఏదో కొంత విచారం తప్పదు తరువాత నీసుఖం, యిష్టం, నీ ఆనందం, నీ స్వేచ్ఛ!

నా ఆత్మహత్యలో ఎవరికీ సంబంధం లేదనీ నేను కావలసే చేసుకున్నాననీ, ఎవరినీ బాధించ నవసరం లేదనీ సర్కారుకు తెలియపరుచుకొన్నాను ఆతరువునుంచి నీ కేమీ భయం లేదు, సెలవు నేనీ పదేళ్లలో నీకిచ్చిన శ్రమలకు, చేసిన తప్పులకు క్షమించు

రత్నంలాగ, దేవిలాగ నిన్ను భావించు (బహుశా ఇది నీ వాయగలేవచ్చు)

నీభర్త
నారాయణరావు

పూర్తిగా చదివేసరికి మూర్ఛ వచ్చింది రెండు రోజులనుంచి పడే బాధ, నిన్నరాత్రి కళ్ళారా చూచిన ఘోరహత్యాకాండతో దహించుకుపోతున్న హృదయంలో ఈ ఉత్తరం చదివేసరికి, అబ్బా! చెప్పలేను!

అక్కడే మ్రాన్పడి కూర్చుండిపోయాను కొంచెం తెలివి వచ్చింది చూచాను శాంతశవ బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

శాంత మొగుడు విశ్వనాథంగారు వస్తున్నారు (సమాప్తం)

కమ్యూనిజం - సోషలిజం

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

[భీమవరం కళాశాలలో ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారు 6-2 49 తేదీన ఆంగ్లంలో చేసిన ఉపన్యాససారాంశం]

మానవుడు నిర్మింపగలిగిన వాస్తవిక జగత్తుకీ, నిర్మించదలచుకుంటూ ఉండే ఆదర్శ ప్రపంచానికీ ఎంతో తేడా వుండడం సహజం వాస్తవిక జగత్తులో ఉండే లోపాలను సవరించడానికీ ఆదర్శ ప్రపంచాన్ని నిర్మించడానికీ నిరంతరం ప్రయత్నం జరుగుతూండడం కూడా సహజం ఆదర్శప్రపంచం ఎలాగ ఉండాలి? అనే ప్రశ్నకు సమాధానం ఆ యా కాలాలలో ఉండే పరిస్థితులమీద ఆధారపడి ఉంటుంది ప్లేటో, మూర్, కార్ల్ మార్క్స నిర్మించిన ఊహాప్రపంచాలలో తారతమ్యం ఆయా ద్రష్టలు నివసించిన కాలం మీదా, పరిసరాల మీదా అప్పుడు ప్రచారంలో ఉన్న అభిప్రాయాల మీదా ఆధారపడి ఉంటుంది కాలం మారినప్పుడు అప్పటి లోపాలుకూడా మారి, కొత్త లక్ష్యాలూ, ఆదర్శాలూ, ప్రచారంలోకివస్తాయి కొత్త కొత్త బాధలకు కొత్త కొత్త నివారణోపాయాలు అవసర మౌతూంటాయి ఆ కారణంచేత ఒక కాలంలో ప్రచారంలోకి వచ్చిన ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్కరణోద్యమాలు, నివారణోపాయాలు సార్వకాలికములై ఉండడానికి అవకాశం లేదు

కారల్ మార్క్స ప్రబోధించిన రాజకీయ ఆర్థికసిద్ధాంతాలు కూడా అతడు తన కాలంలో గమనించిన లోపాలమీద ఆధారపడి ఉండడములో వింత లేదు 17 వ శతాబ్దంచివరా, 18వ శతాబ్దం మొదటా ఇంగ్లాండులో సంభవించిన ప్రముఖసంఘటన పారిశ్రామికవిప్లవం అంతకుముందు ప్రతి ఇంటిలోనూ గృహపరిశ్రమలు ఉండేవి శాస్త్ర విజ్ఞానం ఉత్పత్తి సాధనాల నిర్మాణంలో ఉపయోగింపబడిన కారణంగా యంత్రయుగం ప్రారంభం అయింది పెద్ద పెద్ద యంత్రాగారాలు స్థాపిత మైనవి అనేకరెట్లుగా ఉత్పత్తిపెరిగి దేశదేశాలకు పదార్థాలు ఎగుమతి వుతూఉండడం మొదలయింది కాని యంత్రాగారాలలో పనిచేసే కార్మికుల స్థితిగతులు దుర్భరంగా ఉండేవి వారు అంతకుముందు వ్యవసాయంలో ఉండేవారు అప్పటి పరిస్థితికీ యంత్రాగారాలలోని పరిస్థితికీ తేడా అపారం యంత్రాగారాలలో కార్మికులు 12, 14 గంటలు పని చెయ్యవలసి ఉండేది పురుషులు, స్త్రీలు, బాలురు, పసిపిల్లలూ కూడా అక్కడ పనిచేస్తూ ఉండేవారు యంత్రాగారాలలో తగినంత గాలి, వెలుతురు ఉండేవి కావు యంత్రాలవల్ల ప్రమాదాలు సంభవించకుండా రక్షణ ఉండేదికాదు ఈ విధంగా ఒకటి రెండు తరాలు గడిచినవి ప్రభుత్వం ఈ దుర్భర పరిస్థితులను తొలగించడానికి కించిత్తూ ప్రయత్నించలేదు. ప్రభుత్వం ప్రజల ఆర్థిక జీవితంలో కలగచేసుకో కూడదనే అభిప్రాయం వ్యాపించి ఉండిన రోజులవి కార్ల్‌మార్క్స ఆ యుగంలోనివాడు అతడు జర్మనీదేశపు యూదుల కుటుంబంలో పుట్టి, ఇంగ్లండులో ప్రవాసం అనుభవిస్తూ ఉండేవాడు అతడు పైపరిస్థితులన్నిటినీ పరిశీలించి, బ్రిటిష్ మ్యూజియంలోని అనేక గ్రంథాలు చదివి, తత్వవిచారంచేసి తన సిద్ధాంతాలను క్రోడీకరించి ప్రపంచానికి నూతన ప్రబోధం చేశాడు

కార్మికులు అమానుషములైన పరిస్థితులలో జీవయాత్ర సాగించవలసినదేనా? తెలిసంజ మొదలు మలి సంజవరకూ శ్రమించి, ఫలితాన్ని పారిశ్రామికుల పాలుచేయవలసినదేనా? ఉత్పత్తి అయిన వస్తుసంపదను అసమానంగా పంచిపెట్టడం సామాజిక దృష్ట్యా అసమర్థనీయం కాదా? వస్తూత్పత్తిలో పాల్గొనిన వారందరికీ వారి వారి శ్రమననుసరించి దానిని విభాగించడం న్యాయసమ్మతం ఆ కారణంవల్ల ఉత్పత్తి అంతా కార్మికులదే "పని చేసేవాడికే తిండి" అనే సూత్రం అమలు జరగాలి సమాజంలో క్షమరులకు స్థానం ఉండకూడదు. అంటే వర్గరహితమైన సమాజం స్థాపింపబడాలి. అలాంటప్పుడే ఆదర్శవంతమైన ప్రపంచనిర్మాణం జరుగుతుంది అంతే కాదు కార్మికులకు స్వదేశం అంటూ లేదు అసలు ఇన్ని దేశాలూ, వాటిమీద ఆధారపడే జాతీయవాదం అసత్యం ప్రపంచంలో ధనికులూ, శ్రామికులూ అనే రెండు జాతులు మాత్రం ఉన్నవి వర్గరహితసమాజస్థాపన కోసం అందరూ పాటుపడాలి ఇది కార్ల్ మార్క్స ప్రబోధం

కార్ల్ మార్క్స వట్టి ప్రచారకుడు మాత్రమే కాదు తత్త్వవేత్త, సిద్ధాంతకర్త కూడాను సమాజం నిత్యపరివర్తనం పొందుతోంది—ఇది సహజపరిణామం ఈ సహజపరిణామానికి కారణం ఆర్థికవాతావరణంలోని మార్పులు దానికి కారణం మతం కాదు, అభిప్రాయాలు కాదు మనస్సు శరీరంలో ఒక అంతర్భాగం భౌతికంగా మార్పులు వస్తే, అభిప్రాయాలలో మార్పులు కలుగుతవి అంతేకాని అభిప్రాయాలకు స్వతస్సిద్ధమైన అస్తిత్వంలేదు మతం మొదలైనవన్నీ కూడా భౌతికంగా కలిగే మార్పుల ప్రతిబింబాలే కాని, సమాజస్వరూపానికి కారణాలు కావు ఈ భౌతికపరివర్తనం వర్గరహితసమాజానికి దారితీస్తున్నది ఈ సహజపరిణామం తప్పదు ఇది మార్క్స ప్రతిపాదించిన భౌతికవాద సారాంశం

దీనినిబట్టి మార్క్స ప్రతిపాదించిన ముఖ్యసూత్రములు నాలుగు అని తేలుతుంది (1) ఆదర్శప్రాయమైన ప్రపంచంలో వర్గరహితసమాజం ఉంటుంది ఆ సమాజస్థాపనకు అందరూ తోడ్పడాలి (2) సాంఘికపరివర్తనం ఆర్థికవాతావరణంలోని మార్పులనుబట్టి కలుగుతూన్నది దానికి మతంకాని మహాత్ముల ప్రవచనాలుకాని కారణాలు కావు (3) సంఘ పరివర్తనం వర్గరహితసమాజంవైపు ప్రయాణం చేస్తున్నది మానవకోటి ఈ సహజపరిణామానికి దోహదం చెయ్యాలి (4) వర్గరహితసమాజస్థాపన అనే ఆశయంకోసం ఏ మార్గాలనైనా అవలంబించవచ్చును విప్లవంవల్ల కాని, రక్తపాతంవల్ల కూడా ఆ ఆశయాన్ని సాధించవచ్చును

మార్క్స జీవితకాలంలో అతని అభిప్రాయాలకు విశేషప్రాముఖ్యం రాలేదు ఆ తరువాత అతని సిద్ధాంతాలు విశేషవ్యాప్తిలోకి వచ్చేయనే విషయం నగ్నసత్యం మొట్టమొదట చెప్పినట్లుగా ఆ సిద్ధాంతాలు మార్క్స తన జీవితకాలంలో గమనించిన స్థితిగతులుమీద ఆధారపడి ఉన్నవి కాని అప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు మారి అతని ప్రచారంలో బలాన్ని కొంతవరకూ తగ్గించినవి కార్మికుల జీవితపరిస్థితులలో ఎంతో మార్పు వచ్చినది కార్మిక సంఘాలను స్థాపించుకొని కార్మికులు యజమానులతో ఉమ్మడిగా సంప్రదించి వారి వేతనాలను వృద్ధిచేసుకోగలిగేరు ప్రభుత్వం కూడా ప్రజల ఆర్థికజీవితంలో కలుగచేసుకుని, అక్రమపద్ధతులను అంత మొందించింది కార్మికులకు అన్యాయం జరగకుండా కార్మికశాసనాల ద్వారా, ఇతరచట్టాల ద్వారా కట్టుదిట్టాలు చెయ్యగలిగింది పెట్టుబడిదారులు కూడా యంత్రయుగంలో విశేషంగా లాభాలు తియ్యగలిగేరు ప్రపంచం అంతటికీ విస్తరించి ఉండిన మార్కెట్లలో వారు విక్రయించగలిగిన వస్తుసంపదకు మితి లేదు తద్వారా వారు సంపాదించగలిగిన లాభాలలో కొంత భాగం కార్మికులకు పంచి ఇవ్వడానికి సంశయింపలేదు అంతే కాదు వ్యక్తిస్వామ్యంలో ధనికులు మరింత ధనికులుగానూ, నిర్ధనులు మరింత నిర్ధనులుగానూ అయిపోకుండా, ఆదాయపు పన్ను, వారసత్వపు పన్ను, మరణసుంకాలు మొదలైన పన్నుల ద్వారా ధనికులవద్దనుండి విశేషంగా పన్నులు వసూలుచేసి, ఆ ధనాన్ని సంఘంబాగుకోసం ఖర్చు పెట్టడం ప్రభుత్వానికి పరిపాటి అయింది ఈ విధంగా ఏ మార్పులు విప్లవంద్వారా జరగాలని, జరుగుతా యని మార్క్స ఊహించాడో, ఆ మార్పులు సంస్కరణలద్వారా, శాసనాల ద్వారా చాలవరకు జరుగుతున్నవి

ఇదే సామ్యవాదానికి ప్రారంభం సామ్యవాదానికి లక్ష్యం అయిన సమాజంలో ప్రజలందరికీ సమానావకాశాలు ఉంటాయి కాని కమ్యూనిజానికీ సామ్యవాదానికీ కొన్ని ముఖ్యభేదములు ఉన్నవి సామ్యవాదులకు భౌతికవాదంలో నమ్మకం లేదు సంఘపరిణామానికి ఆర్థికవాతావరణం ఒక్కటే కారణం కాదు వ్యక్తుల ప్రభావంకూడా ఒక్కొక్కప్పుడు కారణం అవుతుంది ఉదాహరణకు రష్యాలో విప్లవం జరగడానికి లెనిన్ కారణభూతుడయాడు రష్యాలో కల్లోలం రేకెత్తించడానికి స్విట్జర్లెండులోనుండి జర్మనులు అతనిని రష్యా పంపించకపోతే, రష్యా చరిత్ర వేరే విధంగా ఉండేది అంతే కాదు ప్రపంచచరిత్రలో మతాభిమానం కారణంగా ఎన్నెన్ని యుద్ధాలు జరగలేదు? ప్రపంచచరిత్రకు ఆర్థిక వాతావరణం మాత్రమే కారణమని అనుకోడం ప్రపంచచరిత్రను సమగ్రంగా సమీక్షించకపోవడమే అవుతుంది మరొక్క విషయం మార్క్స సిద్ధాంతం ప్రకారం వర్గవైషమ్యాలను నిర్మూలించడం, రూపుమాపడం అసంభవం ధనికులందరూ అభివృద్ధినిరోధకులని అనడంలో సత్యం లేదు రోమక్ సామ్రాజ్యంలో బానిసత్వం పోవడానికి బానిసలే కాకుండా యజమానులు కూడా కారణమే మనదేశంలో హరిజనోద్ధరణానికి మహాత్ముడు పట్టుగొమ్మ కాదా? అందుచేతవర్గవైషమ్యాలు తప్పనిసరి అనుకోడం పొరపాటు అన్నిటికంటె ముఖ్యమైన తేడా—సామ్యవాదులు విప్లవం మూలంగా కాకుండా, సంస్కరణలద్వారా మార్పులు రావాలంటారు వారికి సామాన్యప్రజలలో విశేషమైన నమ్మకం ఉన్నది వారికి ప్రజాస్వామ్యపద్ధతులపట్ల విశేషాదరణ ఉన్నది కమ్యూనిస్టు దేశాలలోలాగ ప్రభుత్వయంత్రం ఒక చిన్న రాజ్యాంగ కూటంహస్తగతమై పోడానికి వారు ఎంత మాత్రమూ ఇష్టపడరు

పైని ఉదాహృతములైన మార్క్స సిద్ధాంతాలు నాలుగింటినీ మనం పరిశీలిస్తే, మార్క్స ప్రతిపాదించిన తాత్త్విక సిద్ధాంతాలలో పటుత్వం లేదనీ, అతని ఆశయాలు ఆచరణసాధ్యాలు కావనీ ఋజువు అవుతుంది వర్గరహిత సమాజాన్ని నెలకొల్పడం సాధ్యమా? ఆ విషయంలో మనం వాదనకు లొంగిపోకుండా అనుభవాలను పరిశీలించాలి రష్యాలో 1917 లో లెనిన్ అసమానత్వాన్ని పూర్తిగా రూపుమాపడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు అందరూ ఒకే రకమైన, ఒకేతరగతికి చెందిన పని చెయ్యరు చేసిన పనికష్టాన్నిబట్టి, మొత్తాన్నిబట్టి ప్రతిఫలం మారకపోతే, బాగా పని చెయ్యగలిగినవారు కూడా తమ యావచ్ఛక్తి వినియోగించి పని చెయ్యరు అది దేశానికి ఎంతో నష్టం కలుగచేస్తుంది మనుష్యుల సామర్థ్యాలలో తేడాలు ఉన్నంతకాలం, ప్రతిఫలాలలో తేడాలు తప్పవు దీనిని రష్యా ప్రభుత్వం కూడా గుర్తించక తప్పింది కాదు ఆదాయాలలో అంతరాలు అక్కడ అమలులో ఉన్నవి ఒక్కొక్కప్పుడు ఒక ఉద్యోగస్థుని జీతం ఇంకొకని జీతానికి 200 రెట్లుగా ఉంటుంది ఇంకొక్క విషయం కొంతకాలంక్రిందట రష్యాప్రభుత్వం ప్రజలవద్దనుండి పెద్ద ఋణం చేసింది ఆ ఋణానికి ప్రజలందరూ సహకారం చేసి, ప్రభుత్వబాండ్లను కొన్నారని మాస్కో రేడియో సగర్వంగా ప్రకటించింది ఈ విషయం ప్రజలకు ప్రభుత్వంలో ఉండే విశ్వాసాన్ని సూచిస్తుందేమో గాని, ప్రజలలో కొందరు ధనాఢ్యులు అంటే తమ ఆదాయంలో కొంత భాగం నిలువచేసుకో గలిగిన ప్రజలు, దేశంలో ఉన్నారని కూడా ఋజువు చెస్తుంది ఆ బాండ్లమీద ప్రభుత్వం ఇచ్చే వడ్డీ పెట్టుబడిదారులు శ్రమించకుండా సంపాదించే ప్రతిఫలం కాదా? ఈ విధంగా రష్యాలో కూడా ఆదాయాలలోనూ ఆస్తిలోనూ వ్యత్యాసాలు ఇతర దేశాలలో అంతగా లేకపోయినా, ప్రభుత్వం గుర్తిస్తుందని స్పష పడుతోంది అయితే ఇతర దేశాలలో ప్రత్యేక వ్యక్తులే పెట్టుబడిదారులుగా పారిశ్రామికులుగా ఉంటే, ప్రభుత్వమే రష్యాలో ఆ స్వామిత్వాన్ని స్వీకరిస్తోంది అయితే, పరిశ్రమలన్నీ జాతీయం అయినంతమాత్రాన కార్మికుల సమస్యలన్నీ పరిష్కారం అయిపోతా యనుకోడం వెర్రి అభిప్రాయం ఒక్కొక్కప్పుడు ఈ విధానంలో వారికి అన్యాయం జరగడం అసంభవం కాదు ఏ కార్మికునికేనా ప్రభుత్వం అన్యాయం చేస్తే, ఫిర్యాదు చేసుకోడానికి కూడా అతనికి అవకాశంలేదు

కమ్యూనిజం ఆచరణసాధ్యం కాకపోవడమే కాకుండా, తాత్త్వికంగా కూడా సత్యమైన సిద్ధాంతంమీద ఆధారపడి ఉండలేదు. భౌతికప్రపంచం తనంతట తనే మారదు ఆ మార్పుకు అభిప్రాయాలలో మార్పుకూడా కారణమే సమాజంలో మార్పు రావాలంటే విప్లవమే ఏకైక మార్గం కాదు ప్రజలలో, ప్రభుత్వంలో నాటుకున్న అభిప్రాయాలలో పరివర్తనం కలుగచేస్తే సంస్కరణల ద్వారా సంఘానికి క్షేమకరములైన లక్ష్యాలను సాధించడానికి అవకాశం ఉన్నది

ఇక, కమ్యూనిజం ఏర్పరచే ప్రభుత్వస్వరూపం ఏలాటిది? అది "కార్మికుల నియంతృత్వం" నిజమైన కమ్యూనిస్టు సూత్రాల ప్రకారం సమాజాన్ని నిర్మించడానికి ఎంతో కాలం పడుతుకది ఆ మధ్యకాలంలో "కార్మిక నియంతృత్వం" ఉండాలని సిద్ధాంతం నియంతృత్వపరిపాలనలో ప్రభుత్వం ప్రజలకు గాని, దేశానికి కాని జబాబుదారీ వహించదు తనకు అధికారం ఇచ్చిన పక్షానికి మాత్రం ప్రభుత్వం జబాబుదారీ వహిస్తుంది రష్యాలోని జనాభా 170 మిలియన్లలోనూ, 4 మిలియన్లు మాత్రమే కమ్యూనిస్టు పక్షానికి చెందినవారు ప్రభుత్వం వారి చేతులలో ఉంది ప్రభుత్వనిర్వహణం విషయమై కూడా, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వనిర్వాహకులు నడుచుకోడానికి బదులుగా, ప్రభుత్వనిర్వాహకుల అభిప్రాయాల ప్రకారం ప్రజలు నడుచుకుంటారు ఇదే నియంతృత్వానికి గీటురాయి ఇక, ప్రజలకు పూర్తిగా ఆర్థికసమానత్వం లేకపోగా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, భద్రత ఏమీ ఉండదు నిజానికి కమ్యూనిస్టుదేశం ఒక జైలు అక్కడి ప్రజలకు కొంతవరకూ సమానత్వం ఉన్నా స్వాతంత్ర్యం లేదు దేశంలో శాంతి, భద్రతలు పోలీసు దళం, గూఢచారిదళం సైనికదళాల మీద ఆధారపడి ఉంటవి కాని సహజంగా, న్యాయసమ్మతమైన సూత్రాలపై ఆధారపడి ఉండవు ఈ విధంగా కమ్యూనిజం సిద్ధాంతరీత్యా అసమర్థనీయమే కాకుండా ఆచరణ సాధ్యం కాదు కూడా

అయితే, ఇప్పటివలెనే సమాజం ఎల్లకాలం నడవాలా? ప్రస్తుత ఆర్థిక, సామాజిక విధానాలలో లోపాలు లేవా? ఆర్థికరంగంలో మార్పులు వచ్చి తీరాలికాని ఈ మార్పులు నియంతృత్వానికి దారి తీసే విప్లవం మూలంగా కాకుండా, ప్రజాస్వామ్యం వర్ధిల్లడానికి అవకాశాలుండే సంస్కరణల మూలంగా జరగాలి సామ్యవాదం ఇలాటి పరివర్తనానికి అవకాశం కలిగిస్తుంది చట్టబద్ధమైన పద్ధతుల ద్వారా, శాసనసభాపరమైన ప్రజాస్వామ్యం సంఘపురోభివృద్ధికి అనుగుణమైన సంస్కరణలు ప్రవేశపెట్టడం వాంఛనీయమైన విధానం

పావులూరి గణితము - ప్రక్షిప్తములు.

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

పావులూరి మల్లన గణితములో "మిశ్రమగణితం" ప్రారంభమందే ప్రక్షిప్తములు కనబడుచున్నవి అవి గౌరనసుతుడగు భైరవకవి రచించిన "రత్నపరీక్ష", "కవిగజాంకుశము" లోనివిగా పోల్పవచ్చును క్రీ శ 12 శతాబ్దమందలి గణితంలో క్రీ. శ 15 వ శతాబ్దమందలి "రత్నపరీక్ష" చేర్చడము కృత్రిమకల్పన ఆముక్తమాల్యదలో మనుచరిత్రపద్యములు చేర్చినట్లున్నదీ కల్పన ఇవి సమకాలికరచనలు కాని, అవి సమకాలికరచనలు కావు

మిశ్రమ గణితం

"అందు చతుర్థత్రైరాశికగణితంబు చెప్పిన తదనంతరబ్బపంచ్చమమిశ్రవ గణితంబ్బు చెప్పెదు, నది యట్టిదనినా "

"(శ్రీ) వెలలయగా పద్యములను
పావననవరత్న కుసుమ
పంక్తుల పూజల్
గావించెద ముదిగొండ్ల
(శ్రీ)వీరేశునకు భక్త
చింత్తామణికిన్ "
"వారిరేశుడు పల్కిన
గారవమున మది దలర్ప
భక్తులయడ సం
భావింప్పగ బ్రీతిగ విద్యా
ప్రావీణ్యుడైన వీర
భద్రము నెలమిని "
"తన్ను బ్రియమార రేడిన
మున్ను మునీంద్రుల కగస్త్య
ముని చెప్పిన యా
నన్నుతమణిలక్షణములు
చెంన్ను కోడీకరించి
చెప్పెద తెలియనూ "
"భ్రమరాంభ్బదే వర
సముచితవంద్యహృద్య
సాహిత్యకళా
క్రమవిమల ప్రతిభావిత
క్రమణ క్రమశాలియైన
గారవతుడనో "
"భైరవుడ నుభయభాషా
పారీణుడ లోభిభువనజాతవ్యా
పారవికారదుష్టమదన
ఘోరపిశాచుల దబ్బ
ను భయరవుడనూ"

"నిఖిలజనవినుత ప్రభూత ప్రభాని రంతరదురిత స్తోమంబ్బులగునానారత్ననామంబులు సాభిధానంబులువిక్రమక్రమంబ్బున వివరించ్చెదా."

"కురువింద్ద వజ్ర ముక్తిక
పరమరకత నీల
వయిడూర్య మనో
హర పుష్యరాగ విద్రుమ
నరనుత గోమేధికములు
నవరత్నంబులూ "

రత్న పరీక్ష

"శ్రీవెలయగబద్యములను
బావననవరత్న కుసుమపంక్తుల పూజల్
గావించెద ముదిగొండల
శ్రీవీరేశునకు భక్తచింతామణికిన్ "
"ఆ వీరేశ్వరు పేరిట
నావల కేదారపుత్రుడని ధక్షుం సం
భావింప నధికవిద్యా
ప్రావీణ్యుండైన వీరభద్రుం డెలమిన్ "
"తన్ను బ్రియమార వేడిన
మున్ను మునీంద్రుల కగస్త్య
ముని చెప్పిన యా
సన్నుతమణిలక్షణములు
చెన్నుగ గ్రోడీకరించిచెప్పెద దెలియన్ "
"భ్రమరాంబాదేవికృపన్
సముచితనిరవద్యహృద్యసాహిత్యకళా
క్రమవిమలప్రతిభామణి
క్రమవైభవశాలియైనగౌరనసుతుడన్ "
("ప్రతిభాసం, క్రమణు డమతిశాలి" - అని పాఠాంతరము)

"భ్రమరాంబికా మహావర
సముదితనిరవద్యహృద్యసాహిత్యకళా
క్రమవిమలప్రతిభాచం
క్రమణ క్రమశాలియైన గౌరనసుతుడన్ "
(—కవిగజాంకుశము 6 పద్యము ఆం సా. ప పత్రిక 18-2 సంచిక (1929) 115 పుట లోనిది)

"భైరవుడ నభయవిద్యా
పారీణుడ లోభిభవనభవభూమవ్యా
పారసవికారదుష్కర
ఘూరపిచాము లదల్చు
గుణ భైరవుడన్ "
"భైరవుడనుభయభాషా
పారీణుడ లోభిభవనభవభూమివ్యా
పారసవికారదుష్కవి
ఘోరపిశాచుల నదల్చుకొను భైరవుడున్ "
(కవిగజాంకుశము - 7 పద్యము, పరిషత్పత్రిక, 115 పుట లోనిది)

"మఱియు నిఖిలజనవినుతనిజ ప్రభూత ప్రభాపటలనిరస్తసమస్త దురితస్తోమంబులగు నవరత్న నామంబుల విరామంబులగు తత్క్రమం బెట్టి దనిన "

"కురువిందవజ్రముక్తిక
పరమరకతశక్రనీలవైడూర్యమనో
హరపుష్యరాగవిద్రుమ
నరనుత గోమేధికములునవరత్నంబుల్ "

ఇంతవరకు రెంటిలో పీఠిక లొకటిగానే (స్వల్పమార్పులతో, దోషములతో) వరుస తప్పకుండ నున్నవి కాని, కొన్ని పద్యములు వరుసగా లేవు

*   ~   *


"రవిసుక్రచంద్రబుధులును
రవిసూనుడు కేతు వమరరాజగురుండున్
భువిసుతుడు సైంహికేయుడు
నవరత్నంబులకు వీరునాథులు తలపన్ "
"వజ్రముక్తికప్రమానంబ్బు లవి దక్కనుభయభేదజాతు లుంన్న మణులు
వీని జనజాతవర్ణనగుణ
ప్రతతితోడ తేటపడగవలయు "

"వజ్రముక్తిక ప్రవాళాదికంబుల
భేదజాలము మణిభేదములును
వాని జననజాతి వర్ణగుణంబుల
ప్రతతి దేటపఱతు వరుసతోడ "

ఇక నీ పద్యము లన్నియు నిట్లు వ్రాయుటకు వీలులెదు "రత్నపరీక్ష" లోనివి (పై యెనిమిది గాక) 10 మొదలు 27 వరకు 34, 42, 44, మొదలు 49 వరకును గల పద్యములు కూడ "మిశ్రమగణితం" లో పోలిక పద్యము లున్నా నన్నవి కొన్ని పద్యము లెందుకల్లనో చేరలేదు గ్రంథమధ్యలో నింత పీఠిక వ్రాయుట సందేహాస్పదము

నా కాగితము ప్రతి మూలము "ప్రభవనామ సంవత్సర ఆషాఢశుద్ధ ౧౦లు గాలి నర్సప్పి దశణిత ప్రోక్తంబునందు సూత్రగణితం సంపూర్ణం" గా వ్రాయబడినది తాటియాకుల ప్రతి శిధిలమై పోయినది కాగా, ఇది క్రీ శ 18౦ సంవత్సరమునాటిదై యుండవచ్చును

[పెద్దటైపులోనున్న విషయము పావులూరి 'మిశ్రమగణితము' లోనిది చిన్న టైపులోని విషయము 'రత్నపరీక్ష' లోనిది ఆయా పద్యములను సరిపోల్చుకొనగలరు —సం]



ఎవరైనా తెలుపగలరా ?

ఈ బొమ్మలోని పక్షి కొన్నాళ్ల క్రితము గుంటూరులో కనిపించినది సుమారు $2\frac{1}{2}$ అడుగుల ఎత్తు, $4\frac{1}{2}$ అడుగుల పొడవుండి రెక్కలు నెమలి రెక్కల వలె అనేకరంగులతోను, తలవద్ద తెల్లగా దూది వలెను ఉన్నది ఇది ఏమిపక్షియో ఎవరైనా చెప్పగలరా?



తివారం కొల్హాపూరు సంస్థానమును బొంబాయి రాష్ట్రములో కలిపివేయు సందర్భమున ఒక బహిరంగసభలో బొంబాయి ప్రధాని బి జి ఖేర్ ఉపన్యసించినప్పటి దృశ్యం

కులాసాకబుర్లు

"అదుగో పులి- ఇదుగో తోక"

శ్రీ జి. యస్. సూరి

ప్రాణంమీద ఉండే తీపి భయానికి దారి తీస్తుంది భయం అంకురించగానే బుద్ధి మందగించి ఆలోచన అంతరిస్తుంది స్వరక్షణ మాత్రమే కంటికి గోచరిస్తుంది. అందుకు పలాయనం తప్ప వేరే మార్గం లేదని అనిపిస్తుంది పలాయనం ప్రమాదంతో ముగుస్తుంది ఇది భీతి లక్షణం

ఎఱ్ఱగుడ్డను చూడగానే ఎద్దు ఎగిరిపడుతుంది గొడుగును తెరవగానే గుఱ్ఱం గంతు లేస్తుంది ఉడుత, గిలకచప్పుడు విని ఉలిక్కిపడుతుంది పక్షి దిష్టిబొమ్మనుచూసి పారిపోతుంది ఈలాంటి బెదురుకు కారణం ఉండదు. ఇది జంతులక్షణం

మానవుడుకూడా ఒకవిధంగా జంతువే కాబట్టి అప్పుడప్పుడు ఈ విధమైన బెదురుకు గురి అవుతూ ఉంటాడు బెదరిన గొడ్డుకూ హడలిపోయిన మనిషికీ ఆట్టే భేదం కనబడదు ఛంగనాలు తొక్కి చదరిపోవటం తప్ప మరేదీ ఉండదు తాను ఏమయేదీ, ఇతరులు ఏమయేదీ తోచదు నీళ్లలో మునిగిపోతున్నవాడిని ఎవడైనా రక్షించటానికిపోతే అమాంతం గొంతును వాటు లేసుకుని ఉభయులూ ఢింకీకొట్టేట్లు చేస్తాడు ఇరుసు వేడెక్కి రైలుపెట్టెలోకి పొగవస్తే ఇంకేమున్నది నిప్పంటుకున్నదని ముందూ వెనకా చూడకుండా కిందికి దూకి హతమైపోతాడు

వ్యక్తులు బెదిరితే కొంతవరకు ఫరవాలేదు గాని గుంపులు బెదిరితే తట్టుకోటం కష్టం ఎటువంటి ప్రమాదమైనా సంభవించవచ్చు వరదలరోజులలో పడవప్రమాదాలను గురించి పత్రికలలో తరచు చదువుతునే ఉంటాము బోటు నిండాజనం, ఒక చెట్టుకొమ్మప్రక్కగా కొట్టుకుని పోవటం, ఆకొమ్మమీదినుంచి ఏ నీళ్లపామో పడవలోకి దూరటం, లోపల ఉన్నవాళ్లంతా తుళ్లిపడి ఒక వైపుకు పరుగెత్తటం, మొత్తం నావ బుడుంగు మనటం ప్రతిరాష్ట్రం లోనూ యున్న విషయమే సినిమా భవనాలకు నిప్పంటుకున్నప్పుడు అగ్నిప్రమాదంవల్ల మరణించేవాళ్ళకంటె తొక్కిడిలో చితికి పోయే వాళ్లు ఎక్కువని అందరం ఎరిగినదే ఇది అంతా తెలిసినా ఈలాంటి పరిస్థితిలో మనం చిక్కుకున్నట్లయితే ఇంతకు భిన్నంగా ప్రవర్తిస్తామని నిక్కచ్చిగా చెప్పేందుకు సాహసించలేము, అదే విచిత్రం

ఉన్నవి చాలనట్లు ఈమధ్య కొత్తరకం బెదురు బయలుదేరింది అది రేడియో బెదురు దక్షిణ అమెరికా ఒక వింతఖండం—ఉత్తర అమెరికాకు దక్షిణ అమెరికాకు ఉత్తర దక్షిణాలంత తారతమ్యం ఉంటుంది మోటార్లు ఎక్కినా, సినిమాలు చూసినా అక్కడి జనం చాలవరకు రెండుమూడు వేల ఏళ్లనాటి మనుషుల మాదిరి వ్యవహరిస్తారు అఖండంలో ఒక రాజ్యం యూకేడార్

అక్కడి ప్రజలకు హుషారు ఒక మోతాదుకు మించి ఉంటుంది సరదాలూ అధికమే నవనాగరికత లక్షణం కాబట్టి ప్రతి ఇంటిలోనూ వెలసి ఉంటుంది రేడియో ఆ పెట్టె లోపలినుంచి వినవచ్చేదంతా విస్పన్న వేదంగా పరిగణిస్తారు ఆబాలగోపలమూ

అమెరికాదేశాలలో రేడియో సంస్థలు మన దేశంలో మాదిరిగా ఉండవు ప్రభుత్వం వాటిని నిర్వహించకపోగా ఆటే జోక్యంకూడా కలుగచేసుకోదు వీటిని నడిపేదంతా వ్యాపారస్తులు, అందువల్ల పోటీ అధికంగా ఉంటుంది ప్రజాదరణసంపాదించటానికి ఒకదానిని మించేట్లు మరొకటి వింత వింత ప్రోగ్రాములను వినిపిస్తూ ఉంటాయి

కొద్దిరోజులక్రింద అక్కడి ఒక రేడియో స్టేషను దేశాన్నంతా కల్లోలపరచే ప్రోగ్రామును ప్రసారం చేసింది వార్తలు చెపుతున్నట్లుగా ప్రారంభించి, హఠాత్తుగా ఆపి, ఈవిధంగా చెప్పటం మొదలుపెట్టాడు రేడియో జీతగాడు తాజావార్త "కొద్దిసేపటికిందట అంగారక గ్రహంలో నివసించే వింతమానవులు, మిడతల తెగుళ్లవలె విమానాలలో భూమిమీదికి వాలి, కనివిని ఎరుగని మహామారణ యంత్రాలతో కనిపించిన ఊరినల్లా దగ్ధం చేస్తున్నారు సంయుక్త రాష్ట్రాలలో భీకరయుద్ధం చేస్తున్నారు కొన్ని సైన్యాలు మన దేశంమీదికి బయలుదేరినట్లు తెలుస్తున్నది. అంతా భీభత్సంగా ఉన్నది" అని ముగించాడు

ఈ మాటలు వినగానే రేడియోలను వదలిపెట్టి ఎవరికి వారు వీధుల్లో పరుగెత్తటం మొదలు పెట్టారుట ఆఫీసులు, విద్యాలయాలు, హోటళ్లు సినిమాలు, వగైరాలు యావత్తూ క్షణంసేపటిలో ఖాళీ అయినవిట అయినవాళ్ల జోలిమీద పట్టించుకోకుండా ఉడాయించటం సాగించారుట ఈ వార్తని కొందరు అదురుగుండెవాళ్లు నిలువున కూలబడి పరలోకానికి యాత్ర వెళ్లారుట జరిగిన హంగామాలో కాళ్లు చేతులు విరిగిన వాళ్లు లెక్కలేదుట తరువాత కొంతసేపటికి గాని ఇది రేడియో బుద్ధిమంతుడి పరిహాసమని అందరికీ తెలియలేదుట

మొన్నటి యుద్ధమప్పుడు అమెరికాలో ఈలాంటి గల్లంతే జరిగింది ఆర్సన్ వెల్స్ అనే ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు ఒక విచిత్రనాటకాన్ని రేడియోలో బ్రాడ్‌కాస్ట్ చేశాడు జర్మన్ సేనలు అమెరికాను ముట్టడించినట్లు ఎంతో సహజంగా వినిపించాడు అది నాటకమని తెలియక, నిజంగా వార్త అనుకుని చికాగో, న్యూయార్కు మొదలైన పట్టణాలలో జనం బెదిరి తందనాలు తొక్కారు కొందరు ఉరువుగల్లంతు కూడ అయినారు ఆతరువాత ప్రభుత్వం, రేడియో ప్రోగ్రాముల విషయంలో గమనించవలసిన నియమాలను జారీచేశారు

పూర్వం మనవైపు పల్లెటూళ్లలో బందిపోటు భయం అపరిమితంగా ఉండేది రెండు మూడు రోజులలో బందిపోటు రాబోతున్నదని ఊళ్ళో పుకారు పుట్టేది వెంటనే మొదలయేది ఖంగారు వెండిబంగారపు సామానులు బావిలోకి దించేవాళ్లు పాత్రసామానును పాతివేసేవాళ్లు చిన్నపిల్లలను, యువతులను సొమ్ములు గిమ్ములు ఏమీ లేకుండా పూరిగుడిసెల వాళ్లఇంటికి పంపేవాళ్లు తిన్నగా భోజనం చెయ్యకుండా, కన్నుమూయకుండా ముసలి ముతకలు నిష్ప్రయోజనమైన కాపలా కాచేవాళ్లు డప్పుమోత వింటే ఉలిక్కిపడేవాళ్ళు కాగడాలు కనబడితే గాభరాపడేవాళ్లు నిజంగా బందిపోటు వచ్చినప్పుడు ఇక చెప్పపనే లేదు బజారుకు ఒక్కరైనా గుండె ఆగి చనిపోయేవాళ్లు

అందాకా ఎందుకు—మొన్నటి యుద్ధపు రోజులలో మన పెద్దపట్టణాలలో జరిగిన గందరగోళం ఎరుగనిది కాదు అదుగో వస్తున్నారు జపానువాడు, ఇదుగో వస్తున్నాడు జపానువాడని నగరాలన్నీ ఖాళీచేశారు ఏ విమానం మోత వినపడినా విరోధిదే అనుకున్నారు బ్యాంకులనంచి డబ్బు యావత్తూ తెచ్చుకున్నారు వీలైనంతవరకు నోట్లు కాకుండా కరుకు రూపాయలను తెచ్చి సంచుల కెక్కించారు వార్లను సర్కారువారికి ఒప్పగించారు ఇండ్లను ఏదో ధరకు ఫైసలు చేసి వదలించుకున్నారు మూటా ముల్లె కట్టి, దొరికితే రైలు, లేకపోతే బండి కష్టంతో సాధించి, అదీ వీలు కాకపోతే కాలినడకను మారుమూల పల్లెటూళ్లకు ప్రయాణం కట్టారు సైన్యాలు సులభంగా కదలకుండా రోడ్లు ఆక్రమించారు

జాగ్రత్త ఉండవలసినమాట నిజమేగాని నిర్హేతుకంగా బెదరిపోవటంవల్ల ఏలాంటి ప్రయోజనమూ ఉండదు పైగా తలపెట్టినదానికి వ్యతిరేకంగా ఫలితం సంభవిస్తుంది అదుగో పులి అని ఒకడు అనగానే ఇదుగో తోక అనటం సాధారణమయింది జంతువులకు సహజమైన ఈ బెదురు లక్షణాన్ని ఎంతదూరంగా ఉంచితే అంత సుఖం ఉంటుంది అయితే చెప్పటం తేలిక చేయటం కష్టం అని మేమూ ఒప్పుకుంటాం లెండి

—

రామపాదసాగరం

(9 వ పేజీ తరువాయి)

దేశంలో ఇన్ని ప్రాజెక్టు స్కీములున్నాయి రామపాదసాగరం, సంగమేశ్వరం, గండికోట, వంశధార మొదలైనవి రామపాదసాగరం సర్కారువార్ల స్వార్థమన్నారు సంగమేశ్వరం రాయలసీమవారి స్వార్థమే కాదు పరార్థం కూడా నన్నారు సర్వం సంగమేశము దారం రామపాదసాగరం ముందా అని శాసనసభలో రాయలసీమసభ్యు లడిగారు సంగమేశ్వరం మా పెత్తితే మా గండికోట పాడౌతుందని ఒక రన్నారు

భక్తవత్సలంగారీ పోటీలు చూసి నవ్వారు "మీకు పోటీలు అవసరం లేదు అన్నిటికీ పరిశోధన జరుగుతోంది దేనికి పరిశోధన ముందైతే దాన్ని ముందు, తరువాతవానిని తరువాత మొత్తానికి అన్నిటినీ నిర్మిస్తాంగాని దేన్నీ విడిచిపెట్టం" అన్నారు

ఇప్పటికి గూడింటికీ సున్న పెట్టించారు

తుంగభద్ర మచ్‌ఖండ్ ప్రాజెక్టులకి సిమెంటు వగైరాల లోపంవల్ల పని మందంగా నడుస్తోందని చెప్పారు కాని చడీచప్పుడూ కాకుండా వారికళంలో దిగువ భవానీప్రాజెక్టు చురుగ్గా సాగిపోతోంది ఆ ప్రాజెక్టు మళ్లీ సంవత్సరానికి పూర్తయిపోతుంది

సర్దార్ పటేల్ చెప్పినట్లు నిజంగా అందరూ ప్రత్యేకరాష్ట్రం కోరితే విభజనకు అడుపడేవారెవరు? అలాగే ప్రాజెక్టువిషయమై మన తెలుగు మంత్రులకే పట్టుదలే ఉంటే రాక పోయేదా? పోనీ సంగమేశ్వరమైనా, అదీకాక పోతే గండికోటైనా వచ్చేది నిత్యం మంత్రుల ప్రాపకం కావలసిన శాసనసభ్యులు, సంవత్సరానికోసారి శాసనసభ్యుల అనుగ్రహం పైన ఆధారపడే మంత్రులూ, ఈ విషయంలో చేయగలిగేది చాలా స్వల్పం

మళ్లీ ఈ నెల 28 వ తేదిని పార్టీ నాయకుని ఎన్నిక వస్తోంది ఎన్నడూ శాసనసభకు ముఖం చూపని ప్రధాని రామస్వామి రెడ్డిగారు ఇప్పటి కప్పుడే మూడుపొడ్లు ఇంగ్లీషులో దీర్ఘమైన ఉపన్యాసాలు వ్రాయించుకొచ్చి శాసనసభలో చదివారు

రామపాదసాగరాన్ని భగ్నం చేసే పాపానికి నేనొడిగట్టగలనని భావించే సభ్యులు కూడా ఉన్నారా అని విస్తుపోయారు కళ్లు నులుపుకు చూస్తే కాశీశ్వరరావుగారే కనిపించారట ఐతే ఆంధ్రదేశంలో కాంగ్రెస్‌నాయకులు అధికార పదవులకోసమే ఆంధ్రరాష్ట్రం కావాలని ఆందోళన చేస్తున్నారని వీరే బళ్లారిలో ఉపన్యసించారు ఆంధ్రదేశంలో ప్రజల్లో పలుకుబడి సంపాదించుకోడానికీ నాయకత్వం బలపర్చుకోడానికీ మాత్రమే కొందరు నాయకులు రామపాదసాగరం కోసం ఆందోళన చేస్తున్నారు, గాని అసలీ ప్రాజెక్టు నిర్మించడం సాధ్యం కాదనీ, నిర్మించినా కష్టానికి తగిన ఫలితం లభించదనీ వీరే కేంద్రప్రభుత్వనాయకులతో స్వయంగా నివేదించారు

రంగాగారి విదేశ వ్యవహారాల సంస్థ

విదేశాలలోనూ, స్వదేశంలోనూ భారత ప్రభుత్వానికి విరుద్ధంగా కమ్యూనిస్టులు చేస్తున్న దుష్ప్రచారానికి ప్రతిగా కాంగ్రెస్ తరఫున ప్రచారం చెయ్యడానికిగాను ఢిల్లీలో యన్. జి. రంగాగారి అధ్యక్షత కింద విదేశవ్యవహార సంస్థ అనే అనధికారసంస్థ ఒకటి ఫిబ్రవరి ఆఖరు వారంలో ప్రారంభమయింది.

—


శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు

(5 వ పేజీ తరువాయి)

దుతూన్నట్లుండేది ఆ విశాలత్వం వక్తృత్వాగ్రయంలో ఉంటే తప్ప, అంతా విస్తృతంగా ప్రతివారి హృదయాన్నీ సన్నిహితం చేసుకోలేదు.

వేంకటశాస్త్రిగారినిగూర్చి, ఏ ఒక్క విషయమైనా సంపూర్ణంగా తెలిపేట్టు వ్రాయాలంటే, ఈ వ్యాసమూ చాలదు, వ్యాసకర్తా చాలడు. ఆయన మహాకవి ఆయనవల్ల "ఆస్థానకవి" పదవి ఉత్తమగౌరవ మందుకొంది ఆయన జీవితం ఆయన వ్యాసాల్లోనే, ఇతరు లెవరూ చెప్పలేనంత రమ్యంగా వివరింపబడిఉంది. ఆయనకు చిరాయువులని భగవంతుణ్ణి ప్రార్థించటమే మన వంతు ఆయన వ్యాసాల్లో "ప్రస్తుతానికి స్వస్తి చెపుతాను" అంటూ ఆయన ఒక చోట చెప్పిన శ్లోకంతోనే ఈ వ్యాసానికి స్వస్తి చెప్పుతాను

"జయంతి తే సుకృతినో
రససిద్ధాః కవీశ్వరాః,
నాస్తి తేషాం యశఃకాయే
జరామరణజం భయమ్"



హిందూమతధర్మాదాయములబోర్డు దేవస్థానములు

అయ్యా,

ఇప్పుడు మనరాష్ట్రంలో హిందూ ధర్మాదాయముల బోర్డు పరిపాలన దేవస్థానములకు చెందినంతవరకు ప్రజాపరిపాలనలోను చెందక ప్రభుత్వ శాఖకు చెందినదై యున్నది

ముగ్గురు కమీషనర్లు ప్రసిడెంటుతో సహా యీ వ్యవహారములు అన్నియు వారిపైన నిర్వహించబడుచున్నవి

ప్రతిపల్లెలోని దేవాలయమునకు ఆ గ్రామ ప్రజలతో సంప్రతింపులు జరిగిననూ జరుగకపోయిననూ ఆ గ్రామప్రజల అభీష్టములతో నిమిత్తం లేకుండా మొదట్లో స్కీము బోర్డువారు మద్రాసులో వారి ఆఫీసు నుండే ఏర్పరచియున్నారు ఆ స్కీములలో కమీషనర్లు అన్ని దేవస్థానములకు ఒక విధానంగా ఏర్పరచినట్లు కనబడదు చాల గ్రామాదులు ఆ స్కీములు నిర్ణయించునప్పుడు వారి ప్రాతినిధ్యం బంపి సాధించుకోని గ్రామాలు చాలా వున్నాయి

రెండు జిల్లాలకు ఒక్కొక్క అసిస్టెంటు కమీషనరు 2, 3 తాలూకాలకు ఒక్కొక్క యిన్‌స్పెక్టర్లు వుంటూన్నమా పరిపాలనావిధానం రెంటికీ చెడ్డ రేవడివలె వున్నది

సాధారణంగా స్కీములో ప్రతి దేవస్థానం పల్లెకు కెంపులుగా డిక్లేరుచేసి ఆ గ్రామస్థులు ముగ్గురు ట్రష్టీలతో ఆ దేవస్థాన వ్యవహారములు జరుగచుండవలెననీ వుంటూ రు 1000 ల మించి ఆదాయం వచ్చు ప్రతీదేవస్థానమునకు బోర్డువారే మానేజర్లను అప్పాయింటు చేసి ట్రష్టీల ఆధీనంలో వుంచక బోర్డువారే డైరక్టు కంట్రోలు పెట్టుకొని నిర్వహించలేక మానేజర్లకు ట్రష్టీలకు భేదములు ఏర్పడి అనేకదేవస్థాన వ్యవహారములు స్తంభించి యున్నవి

దేవస్థానములకు నియమించే ట్రష్టీలు ప్రజలలో నుండి ఎన్నిక పద్ధతిని కాదు, ప్రజాసంస్థల ప్రాతినిధ్యం వహించే వారూ వుండరు బోర్డువారే వారిని నియమిస్తారు బోర్డువారే వారిని రద్దుచేస్తారు కాని యీ పద్ధతివల్ల మానేజర్లు, వున్న కెంపుల్సు వ్యవహారములు పంచాయితీ బోర్డువలె గాని మరియే యితర సంస్థల నిర్వహణవలె గాని జరుగుట లేదు గావున ట్రష్టీలనియామకం విధానం మారాలి గ్రామ పంచాయితీ బోర్డు, పంచాయితీ బోర్డు, సహకార సంఘ ప్రతినిధులనే ట్రష్టీలుగా నియమించవలెను ఆ సంస్థలు లేనిచోట్ల ఆ గ్రామంలో వుండే ప్రజాభిప్రాయప్రకారం వున్న వార్ని నియమించి మానేజర్లను వారి ఆధనంలో వుంచవలెను

యిప్పుడు దేవస్థానములకు గంట గంటకూ అనేకమార్పులైన వుత్తర్వులు వస్తున్నాయి కొన్ని దేవస్థానముల వ్యవహారములకు ట్రష్టీల మొరలకు బోర్డునుండి జవాబులే లేవు

దేవస్థానముల బోర్డులు వాట్ల ఆస్తుల విషయమై కోర్టులకు ఎక్కి వంశపారంపర్యా రెండవ వృత్తిలేక అర్చకత్వంపైననే ఆధారపడి యున్న కుటుంబాలు సిలిలు చర్యలలో పడి క్రుంగిపోతున్నారు యీ ట్రష్టీలు కోర్టులవెంట తిరుగలేకపోతున్నారు నౌఖరీ యీనాములు -అనగా దేవతావుత్సవములలో బాజా భయింత్రీ, దేవదాసీ, బాకా, కాగడా యీనాములలో కొన్ని జిరాయితీలుగా మార్చివేసినారు

యీ అర్చకుల మాన్యములగురించి జమీందారీ రద్దు బిల్లు వంటి ఒకటి తెచ్చి దేవస్థానముల ఆస్తుల గురించి కోర్టుల అంతం చూచుకొని క్షతిమములు పొందకుండా చేయవలసిన బాధ్యత ప్రభుత్వముమీద నున్నది యిపుడు పెట్టబోవు బిల్లులో యిది అంతా వున్నట్లే తోచదు

దేవస్థానముల పరిపాలనాసౌకర్యముల కొరకు ఒక జిల్లాకు ఒక్కొక ఓవర్సీరు, జిల్లా అధికారి, తాలూకాకు ఒక్కొక అధికారి వుంటూ ట్రష్టీలకు సహాయసంపత్తు లిస్తూ పంచాయితీపరిపాలన వలె ఒక నిర్ణీత పద్ధతులపై నడిపించవలసియున్నది గ్రామ పంచాయితీ బోర్డులవలె మానేజర్ల (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు) ఒక నిర్ణీత ఆదాయం మించినవాటికి గాని మానేజర్లను రుద్దకూడదు

మానేజింగుట్రష్టీల అప్పాయంటుమెంటు బోర్డువారు ట్రష్టీల అభిప్రాయం లేకుండా వస్తూన్నందున ప్రతిబంధకములు వస్తున్నవి గనుక ట్రష్టీలనుండే మానేజింగు ట్రష్టీని ఎన్నుకొనేటట్లును, మానేజరుమీద పూర్తి కంట్రోలు వప్పగించవలసి యున్నది

అప్పుడు గాని దేవస్థానపరిపాలనా కార్యక్రమం సుగ్నతంగా జరుగుటకు యీ బిల్లులో ఏ చర్యలు తీసుకున్నది నిర్దిష్టంగా లేదు

అన్ని మతాలతోటి కూడుకొనియున్న ప్రభుత్వం ఒక్క మతంతాలూకు ధర్మాదాయముల మీదనే యీ బోర్డు వుండుట, పక్షము వహించుట గర్హించ తగినది గావున ఏ మతమునకు సంబంధించినదైననూ ఏ విధమైన ధర్మాదాయమైననూ సక్రమంగా నిర్వహించని చోట్లల్లా యీ బోర్డుకు అధికారం కలుగచేసి అన్ని ధర్మాదాయములకు రక్షణ మొసంగవలెను.

తంగిరాల కృష్ణానందతిలక్.

హిందుస్థానీ పండితుల గోడు

ఆర్యా,

1-1-1947 తేదీకి పూర్వము హిందుస్థానీ భాషాపండితులతోసహా అందరు భాషాపండితులునూ సమానస్కేళ్లను పొందియుండిరి హైయరు పారములలో బోధించువారందరునూ రూ 45-2/2-75 స్కేలును పొందియుండిరి లోయరు ఫారములలో బోధించువారందరు రూ 30-2/2-50 స్కేలును పొందియుండిరి

1-1-1947 తేదీనుండి జీతములు హెచ్చింపబడిన తర్వాత ప్రభుత్వమువారు ఇతరభాషాపండితులందరికిని ఎక్కువస్కేళ్లనిచ్చి, హిందూస్థానీ భాషాపండితులకు తక్కువస్కేళ్లనిచ్చుటకడుశోచనీయము సర్కారువారు అవలంబించిన ఇట్టి "ఒక కంటికివెన్న, మరొక కంటికి సున్నము" అను విధానమువలన హిందుస్థానీ పండితులకు చాల దెబ్బ తగిలినది వారియుత్సాహము తగ్గుటయే గాక హిందుస్థానీభాషాపండితు లయినందులకు సర్కారువారిచే తమకు ఒకవిధమగు శిక్ష యొసంగబడినదని భావించు పరిస్థితి యేర్పడినది

హిందూస్థానీ పండితులకు జరిగియున్న అన్యాయము క్రింద నిరూపింపబడినది

(a) హైయరు ఫారములలో బోధించు (1) S S L C (2) ఓరియంటల్ టైటిల్ (3) పండిత ట్రెయినింగ్ లేక సెకండరీగ్రేడ్ ట్రెయినింగ్. యోగ్యతలుగల ఇతరభాషా పండితు లందరికిని 1-1-47 నుండి 31-12-47 వఱకు రూ 60-40-100-5-180 స్కేలుఇవ్వబడియుండెను తరువాత 1-1-48 నుండి జీతములు పునః హెచ్చింపబడి రూ 75-5-145 స్కేలు ఇవ్వబడెను

హైయరుఫారములలో బోధించు హిందుస్థానీ పండితులు (1) S S L C (2) ఓరియెంటల్ టైటిల్ లేక తత్సమానయోగ్యత (3) ప్రచారకట్రెయినింగ్ లేక సెకండరీగ్రేడు ట్రెయినింగ్ యోగ్యతలుగలవారయి యున్నచో వారికిని 1-1-47 నుండి 31-12-47 వఱకు రూ 60-4-100-5-130 స్కేలునూ, తరువాత 1-1-48 నుండి రూ 75-5-145 స్కేలును ఇచ్చుట న్యాయమే కదా! కాని అట్లు చేయక సెకండరీగ్రేడుట్రెయినింగ్ అయినవారందరికిని రూ 50-2-90 స్కేలునూ, ఇతరులకందరికిని రూ 40-1½-70 స్కేలునూ ఇచ్చినారు ఇంతేకాదు, ఇతరభాషలలో లోయరు పారము పండితులకు రూ 45-2-85 స్కేలును అమలులోపెట్టి (వీరు హైయర్ ఫారములలో కొన్ని పీరియడ్లు బోధించి సచోమతియు రూ 10 ఇచ్చెదరు) హిందుస్థానీ పండితులకుమాత్రము వారు హైయరుపారములలో బోధించినను సరే, లోయర్ పారములలో బోధించినను సరే, రూ 40-1½-70 స్కేలును ఇచ్చి మిక్కిలి అన్యాయ మొనరించినారు

(b) హైయర్ ఫారములలో బోధించుచు 1-1-47 వ తేదీకి పూర్వమే రూ 45-2/2-75 స్కేలులో జీతమును పొందుచుండిన ఓరియెంటల్ టైటిల్ యోగ్యతను మాత్రమే కలిగియుండిన ఇతరభాషాపండితులందరికిని 1947 వ సం॥ రమంతయు నెలకు రూ 60 చొప్పున జీతము ఇవ్వబడెను 1-1-49 వ తేదీనుండి రూ 60-4-120 స్కేలు ఇవ్వబడెను 1-1-48 వ తేదీన 15 సం॥ రముల సర్వీసుగలవా రందరికిని రూ 75-5-145 స్కేలు ఇవ్వబడెను

హిందుస్థానీపండితులు హైయరు పారములలో బోధించుచు 1-1-47 వ తేదీకి పూర్వమే రూ 45-2/2-75 స్కేలులో నుండినను, వారు కూడ ఓరియెంటల్ టైటిల్, లేక తత్సమాన యోగ్యతలు కలిగియున్నను, అంతకంటె ఎక్కువ S S L C, మరియు ప్రచారక ట్రెయినింగ్ యోగ్యతలు కలిగియున్నను, వారికి 1-1-47 వ తేదీనుండియు రూ 40-1½-70 స్కేలుమాత్రమే ఇవ్వబడినది ఇట్లుచేయుటవలన హైయర్ పారము హిందుస్థానీపండితులకు జీతముల హెచ్చింపువలన నేటికిని ఎంతమాత్రమయినను ఉపకారము కలుగలేదు రూ 30-2/2-50 స్కేలులో నుండిన లోయరుపారము హిందుస్థానీపండితులు కూడ రూ 40-1½-70 స్కేలునే పొందుచున్నారు

ఇట్లు 1-1-47 వ తేదీకి పూర్వము హైయరు పారములలో బోధించుచూ రూ 45-2/2-75 స్కేలులో నుండిన ఇతరభాషాపండితులందరునూ 1-1-47 నుండి 31-12-47 వ తేదీ వఱకు నెలకు రూ 60 చొప్పున జీతమును బడసిరి 1-1-48 వ తేదీనుండి కొందరు రూ 75-5-145 స్కేలునూ, మరి కొందరు రూ 60-40-120 స్కేలునూ పొందుచున్నారు ఇట్లుండగ హిందూస్థానీ పండితులు హైయరు పారములలో బోధించుచున్నను, 1-1-47 వ తేదీకి పూర్వమే రూ 45-2/2 75 స్కేలులోనుండినను, ఇతరభాషాపండితులకు గలయోగ్యతలే వారికి కూడ ఉన్నను వారికి రూ. 40-1½-70 స్కేలును ఇచ్చి జీతములహెచ్చింపు వలన వారికి నేటికిని ఎంతమాత్రము ఉపకారము కలుగనట్లు చేయుట అన్యాయము

ఇప్పుడైనను ప్రభుత్వమువారు హిందుస్థానీ పండితులకు జరిగిన అన్యాయమును గుర్తించి 1-1-47 వ తేదీనుండి వారియోగ్యతలనుపట్టి ఎవరెవరికి (1) రూ 60-4-100-5-130 మరియు రూ 75-5-145 స్కేలునూ, (2) రూ 60-4-100 మరియు రూ 60-4-120 స్కేలును ఇవ్వవలసి వచ్చునో వారందరికిని ఆయా స్కేళ్ళనొసంగవలెననియు, లోయర్ పారము హిందుస్థానీ పండితులకుకూడ రూ 45-2-85 స్కేలు నివ్వవలెననియు ప్రార్థన

యం. అరలప్ప.

బీదరైతులకు నష్టం

ఆర్యా,

ప్రభుత్వం అధికాహారోత్పత్తి కావాలంటుంది! ఆ విధంగానే రైతు నవంబరు మొదటివారానికి వచ్చే బసంగిధాన్యాన్ని పండించి ఆహారం కొరత తీరుస్తున్నాడు అట్టి రైతుకు హెచ్చు ధరలుముట్టకుండా, భూస్వాములవంటి రైతులకు హెచ్చుముడుతున్నయ్! 1948 నవంబరు 21 నుంచి ప్రభుత్వం హెచ్చుగా ధరలు పెంచింది నవంబరు 21 లోపునే బీదరైతులందరూ తమ ధాన్యాలను అమ్ముకున్నారు.

నవంబరు 21 లోపున మిల్లులో వున్న ధాన్యం స్టాకుకు బస్తా 1కి సుమారు రూ 2-12-0 చొ॥ ప్రభుత్వము మిల్లర్సు వడ్డి వసూలు చేసినట్లు తెలుస్తూయున్నది అలా వసూలు చేసిన సొమ్ము రైతుకు యిస్తామని గానీ, యివ్వమనిగానీ ప్రభుత్వమువారు ఏవిధమైన ప్రకటనా చేసియుండలేదు యిప్పుడైన వెంటనే ఆ సొమ్ము మిల్లర్సుద్వారా కాకుండా ప్రభుత్వపరంగానే రైతులకు యిప్పించు ఏర్పాట్లు చేయించగలందులకు కోరుచున్నాను

దంము వెంకట్రాజు.

సంవత్సరాదినాడు పరీక్ష

అయ్యా,

ఈ సంవత్సరము మార్చి నెలలో జరుగనున్న S S L C పరీక్షలలో టైపు రైటింగు పరీక్ష 30-3-49 తేదీన జరుగు నట్లుగా గజెటు యందు ప్రచురింపబడినది ఆ రోజు తెలుగు సంవత్సరాది దినము పండుగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయుచు పరీక్షను మరుసటి దినమునకు మార్చ వలసినదిగా కొల్లూరుబోర్డు హైస్కూలు విద్యార్థులు వారి హెడ్మాష్టరు గారి ద్వారా, సెక్రటరీ S S L C బోర్డు వారికి విన్నవించుకొన్నప్పటికిని, శ్రీ సెక్రటరీగారు వారి ప్రార్థనను నిరాకరించిరి కనుక ఈ పండుగ ప్రతి ఆంధ్రునకును అవసరమైనది గనుక మీరుకూడ తోడ్పడి పరీక్షను మరుసటి దినమునకు మార్చునట్లుగా తగు సహాయము చేయ ప్రార్థితులు

యన్ వి కృష్ణారావు


సంగమేశ్వరం ప్రాజక్టు

అయ్యా,


కృష్ణా, సంగమేశ్వర ప్రాజక్టు కొత్తి కనుమ కాల్వస్కీమును అంగీకరించాలని, రాయలసీమ మహాజనసభ రాయబారవర్గమువారు భారత ప్రభుత్వమువారికి సమర్పించిన నివేదికలో సూచించినందుకు, ఆ రాయబారవర్గము వారికిన్ని, రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుల వారికిన్నీ ప్రాంతీయ ప్రజల తరపు కృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాను అయినను ఈ ప్రాజెక్టు నిర్మించిననాడే ప్రాంతీయప్రజలు సంతృప్తి నొంద గలరని తలచుచున్నాను

రాయలసీమాభివృద్ధికి రాష్ట్ర కాంగ్రెస్‌వారు వారు, ఆంధ్రమహాసభవారు సంపూర్ణ సహకారమిచ్చుటకు అంగీకరించారని రాష్ట్ర కాంగ్రెసు ప్రధానకార్యదర్శి గారు చేసిన ప్రకటన న్యాయముగాలేదు శ్రీభాగ్ ఒడంబడికలో రాయలసీమ, నెల్లూరుజిల్లాలవ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్య మిచ్చి కృష్ణానీటిని ఉపయోగించాలని యున్నది అందువల్ల నెల్లూరు జిల్లాలోని మెట్టతాలూకాల అభివృద్ధిని గుర్తించకుండా, ఒక్క రాయలసీమాభివృద్ధి దృష్టితో తగిన సహకార మిచ్చుటకు ఆమోదించిరి అని ప్రకటనవల్ల స్పష్టపడుచున్నది గుంటూరు, నెల్లూరు జిల్లాలలోని మెట్టతాలూకాలలోని ప్రాజెక్టులను, నిర్మించుటకున్ను, శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం, నెల్లూరు జిల్లాలోని మెట్ట తాలూకాలను రాయలసీమతోబాటు ఏకకాలమందే అన్నివిధములా అభివృద్ధిలోనికి తీసికొని రావలసి యున్నది, గనుకనూ బాధ్యతగలవ్యక్తులు పూనుకొనవలసినదిగా మనవిచేస్తూ యున్నాము.

మంచెల్ల వెంకటేశ్వర రావు.



భారతదేశానికి ఇటలీ వాణిజ్య రాయబారవర్గం రాజఘాట్‌లో గాంధిజీసమాధిపద్ద పుష్పగుచ్ఛము నంచుచున్న దృశ్యం



దేశభక్త కొండ వెంకటప్పయ్యపంతులుగారి 84 వ జన్మదినోత్సవం గుంటూరులో వారి స్వగృహంలో వేడోక్తంగా జరిగింది.

వార్తా చిత్రాలు



ఆసియా సభా విదేశప్రతినిధులతో పండిట్ నెహ్రూ.



న్యూఢిల్లీ, బోర్డు ఆఫ్ సైన్సు అండ్ ఇండస్ట్రీస్ రిసర్చి ఇన్‌స్టిట్యూట్ సభకు నెహ్రూ అధ్యక్షత వహించారు. గౌ. ముఖర్జీ (పారిశ్రామికమంత్రి), సర్ సి వి రామన్, కె యస్ క్రిష్ణన్, హెచ్ జి బాబాగారలు నెహ్రూకు కుడివైపునను, శ్రీరాం, భట్నగిరి, ఆర్ పి బహదూర్, ఓ సి ఘోష్, యస్ యన్ బోసీగారలు నెహ్రూకు ఎడమవైపున ఉన్నారు



బర్మా ప్రతినిధులు—ఇండోనీషియాసమస్య విషయం జరిగిన ఆసియా సభకు వచ్చిన బర్మా ప్రతినిధులతో కాప్టెన్ సింగ్—(ఎ డి సి ఆఫ్ గవర్నరు జనరల్) ఛలోక్తు లాడుతూన్న దృశ్యం





ఆసియామహాసభకు వచ్చిన యమెన్, ఇండోనీషియా, కట్నాం ప్రతినిధులు.

ఢిల్లీలో ఫిబ్రవరి 23-వ జరిగిన ఆలిండియా పవర్ ఇంజనీర్ల సభలో ప్రధానామాత్యు డుపన్యసించినప్పటి దృశ్యం

Regd. M. No. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7, Thambu Chetty St., G. T. Madras.